# మొదటి సినిమా

## - కిరణ్ ప్రభ

### Part - 1



శ్రీ కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: ౮

# విషయసూచిక


| | |
|---|---|
| అన్నే మోహన గాంధీ | 3 |
| ముత్యాల సుబ్బయ్య | 7 |
| లయ | 11 |
| భీమినేని శ్రీనివాస రావు | 14 |
| ఆర్.నారాయణ మూర్తి | 18 |
| సాగర్ | 21 |
| శ్రీను వైట్ల | 25 |
| వి.ఎన్.ఆదిత్య | 29 |
| కోడి రామకృష్ణ | 34 |
| రేలంగి నరసింహా రావు | 43 |
| సురేందర్ రెడ్డి | 49 |
| శ్రీనివాస రెడ్డి | 53 |
| బి.గోపాల్ | 60 |
| బోయపాటి శీను | 64 |

# అన్నే మోహన్ గాంధీ



మొదటిసినిమా అనుకోగానే ఒక్కసారిగా మనసు 30 సంవత్సరాలు వెనక్కి వెళ్ళింది. చిత్రరంగంలో పనిచేసే వాళ్ళకి మొదటి సినిమా అంటే..ఒకటి కంటే ఎక్కువే వుంటాయి, మొదటి సినిమాకి ఇచ్చే నిర్వచనాన్ని బట్టి. వినడానికి విచిత్రంగా వున్నా ఇది నిజమే..అంటే ..సినిమా రంగంలోకి ఏదో ఒక సినిమా తోటి ప్రవేశిస్తాం, మరో సినిమాతోటి మా రంగానికి చెందిన శాఖలో అడుగుపెడతాం..ఇంకో సినిమా తోటి మా శాఖలో నిజమైన పేరు తెచ్చుకుంటాం. ఒక్కో కోణంలో ఇలా ఇవన్నీ మొదటి సినిమాలే అనిపిస్తాయి..

నా విషయానికొస్తే..

విజయవాడలో బి.ఎస్సీ ముగించుకుని కేరళలోని మణిపాల్‌లో ఇంజినీరింగ్ కోర్సులో చేరినా, ఆరోగ్యం దెబ్బతినడం వల్ల 4 నెలలు తిరక్కుండానే చదువుకి మధ్యలోనే స్వస్తి చెప్పి 'బ్యాక్ టు హోమ్' అవ్వాల్సి వచ్చింది. ఒక విశేషమేమిటంటే, మణిపాల్ వెళ్ళేటప్పుడల్లా మాకజిన్ వెంకటరత్నం నాకు తోడుగా వచ్చి నన్ను దిగబెట్టి వస్తుండేవాడు. ఆ ప్రయాణం మధ్యలో మద్రాసులో దాదాపు ఉదయంనుంచీ సాయంకాలం వరకూ వుండాల్సి వచ్చేది. ఆ సమయంలో మా కజిన్ వెంకటరత్నానికి దూరపు బంధువూ, అంతకు మించి మంచి మిత్రుడూ, అప్పుడే తెలుగు చలన చిత్రరంగంలో హీరోగా ఎదుగుతున్న శ్రీ శోభన్‌బాబు గారింటికి వెళ్ళేవాళ్ళం. ఆయన నాగురించి క్షేమ సమాచారాలు తెలుసుకుంటుండేవారు.

చదువుమానేసి విజయవాడ వచ్చేసాక మళ్ళీ ఆరోగ్యం కుదటపడడానికి ఏడెనిమిది నెలలు పట్టింది. చదువుమీద ఆసక్తి తగ్గింది. అప్పటికే స్టేజి నాటకాలతో అనుభవం వుండడం వల్ల, వెంకటరత్నంతో చెప్పాను

"అన్నయ్యా..నాకు చదువుకోవాలని లేదు..మళ్ళీ అక్కడికివెళ్ళి ఆరోగ్యం చెడగొట్టుకోలేను. ఇక్కడా నా మార్కులకి సీటు రాదు. సినిమాల్లో అదృష్టం పరీక్షించుకోవాలని వుంది..నువ్వేమైనా శోభన్‌బాబు గారికి రికమండేషన్ చెయ్యగలవా? " అన్నాను.

ఆయన నా పరిస్థితిని అర్థం చేసుకుని మద్రాసు తీసుకెళ్ళారు. శోభన్‌బాబు గారు వివరాలు తెలుసుకున్నాక

"...సినిమా రంగంలో కెరీర్ వెదుక్కోవడం మంచిదే.కాకపోతే ఇక్కడ భవిష్యత్తు ఎలా వుంటుందీ అనేది ఎవ్వరూ ఇతమిత్థంగా చెప్పలేరు. చాలా కష్టలు పడాల్సి రావొచ్చు. నా పరిస్థితీ ఇంతే..లాయర్ చదువుదామని మద్రాసు వచ్చి సినిమాల ఆసక్తితో ఈ రంగంలో అడుగుపెట్టాను. ఎన్నో సంవత్సరాల తరవాత ఇప్పటికి కొంచెం నొలదొక్కుగోగలిగాను.." అన్నారు.

అది 1968 వ సంవత్సరం..

ఎవరో చెప్పిన మాట మీద ఎడిటింగ్ నేర్చుకోవాలని ఉంది అన్నాను.

"ఎడిటింగ్ అంటే ఒక్క రంగానికే లిమిట్ ఐపోతావు..ఎలానూ నాటకాల్లో అనుభవం ఉందంటున్నావు కదా..దర్శకత్వ శాఖలో ప్రయత్నించు.." అని సలహా ఇచ్చారు..

"ఇక్కడ నాకెవ్వరూ తెలీదు..మరి మీరే ఎవరికైనా రికమండేషన్ చెయ్యాలి" అని అడిగాం.

ఆయన వెంటనే అంగీకరించి, అప్పుడే కొమ్మూరి సాంబశివరావుగారి నవల ఆధారంగా మొదలౌతున్న 'చావు తప్పితే చాలు' దర్శకుడు గురుదేవ్ గారి వద్ద అప్రెంటిస్ గా చేర్చారు.. కరెక్టుగా చెప్పాలంటే ఇదీ నాకు సినిమా రంగంలో అడుగుపెట్టనిచ్చిన **మొదటి సినిమా.** శోభన్ బాబు. రాజశ్రీ గార్ల కాంబినేషన్. 'సంగీతలక్ష్మి' నిర్మాణంలో భాగస్వామ్యులైన ఒకరు సినిమా నిర్మాతలు. గురుదేవ్ గారు నర్తనశాలకి కో-డైరెక్టర్‌గా చేసి వున్నారు. ఆయన నిర్మాత లక్ష్మీరాజ్యంగారికి దూరపు బంధువుకూడా (తరువాత విశ్వనాథ్ గారికి కూడా చాలాకాలం సహాయకులుగా పనిచేశారు). ఐతే ఆ యూనిట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్, అసోసియేట్ డైరెక్టర్ అంటూ వేరే ఎవరూ లేకపోవడంతో గురుదేవ్ గారు అన్నింటికీ నా మీదే ఆధారపడే వారు. చిత్ర నిర్మాణం, దర్శకత్వంలోని అనేక మెళకువల్ని చాలా ఓపికగా చెప్పేవారు. అప్పుడే ఆ రంగాన్ని అర్థం చేసుకుంటున్న నాకు ఇది చాలా ఉపయోగపడింది. దురదృష్టవశాత్తూ రెండు షెడ్యూళ్ళు ముగిశాక ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఆ సినిమా ఆగిపోయింది. చాలా నిరాశపడ్డాను..

మళ్ళీ శోభన్‌బాబు గారి వద్దకే వెళ్ళాను. ఆయనే మళ్ళీ అప్పుడే స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్న 'బంగారు పంజరం' యూనిట్లో నన్ను చేర్పించారు. ఐతే నా మొదటిసినిమాకీ ఇక్కడికీ చాలా తేడా కనిపించింది. ఇక్కడ అంతా సీనియర్స్.. నన్ను అంతగా దగ్గరికి చేరనిచ్చేవాళ్ళు కాదు. లోపల స్క్రిప్ట్ వర్క్ జరుగుతుంటే నన్ను బయట ఉండమనే వారు.. కొన్ని రోజులు చూశాక, ఇంక ఆ వాతావరణం నచ్చకా, మళ్ళీ శోభన్‌బాబుగారి వద్దకి వెళ్ళడానికి మొహం చెల్లకా విజయవాడ తిరిగొచ్చేశాను. మళ్ళీ కొన్ని నెలలు ఖాళీగా విజయవాడ రోడ్లు సర్వే.. నాన్నకి కోపంగా వుండేది, నేను ఎక్కడా స్థిరపడలేదని..ఐదారు నెలల తరువాత, మళ్ళీ కజిన్ వెంకటరత్నాన్ని కలిశాను..

"నీకు నువ్వే డిసైడ్ చెయ్యాలి..ఒకరం సలహా చెప్పినా నీ మనసుని నువ్వే సమాధానపరచుకోవాలి" అన్నాడు తను.

"సరే అన్నయ్యా..మళ్ళీ ఒక్కసారి మద్రాసు వెళ్ళి ప్రయత్నిస్తాను. ఈ సారి ఆరు నెలలుంటాను. ఏమీ ప్రోగ్రెస్ లేకపోతే వచ్చేస్తాను" అని పట్టుదలతో మద్రాసు వెళ్ళాను.

ఈ సారీ శోభన్ బాబుగారిని కలవడానికి మొహం చెల్లలేదు. ఎక్కడైనా కుదురుకున్నాకే ఆయన్ను కలవాలని నిర్ణయించుకున్నాను. లోగడ జరిగిన పరిచయాలతో నాగేంద్రరావుగారనే ప్రొడక్షన్ ఎక్జిక్యూటివ్ ఒకాయన నన్ను 'మనుషులు మారాలి' సినిమాకి సెన్సారు స్క్రిప్ట్ వ్రాయడానికి అవకాశం కల్పించారు. మూవియోలాలో ప్రతిసీనూ మళ్ళీ, మళ్ళీ చూస్తూ డైలాగులన్నీ గ్రంథస్థం చేసే పని.. మొట్టమొదటిసారిగా పారితోషికం అందుకున్న **మొదటిసినిమా** 'మనుషులు మారాలి'. తరువాత నాగేంద్రరావుగారే పనిచేస్తున్న 'నాటకాలరాయుడు'కి దర్శకత్వశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరడంతో దర్శకత్వశాఖలో నేను పూర్తిగా పనిచేసిన **మొదటిసినిమా** 'నాటకాల రాయుడు' అని చెప్పుకోవచ్చు. ఈ సినిమా మంచి అనుభవాల్నిచ్చింది. తరువాత ఉషశ్రీ ప్రొడక్షన్ చిన్నపురెడ్డి పరిచయమవ్వడం, మాకిద్దరికీ విజయవాడలోనే లోగడ పరిచయం వుండడ.. వీటన్నింటివల్లా ఆయన కంపెనీలో చేరి ఆయన సినిమాలన్నింటికీ 1973-74 వరకూ దర్శకత్వ శాఖలో పనిచేశాను. మళ్ళీ శోభన్‌బాబు గారి సలహామేరకు తాతినేని రామారావుగారి వద్ద 'దేముడు చేసిన పెళ్ళి'కి సహాయ దర్శకుడిగా చేరాను. తాతినేని రామారావు గారి ద్వారానే పి.ఎ.పి లో 'అల్లుడొచ్చాడు'కి పనిచేసే అవకాశం లభించింది. అక్కడే నాకు ప్రత్యగాత్మ గారి పరిచయం జరిగింది.

మొదటిసినిమా తోటే నా చురుకుదనాన్ని గమనించిన రామారావుగారు ప్రత్యగాత్మగారికి ప్రత్యేకంగా చెప్పడం - ఆయన నన్ను అభిమానంగా చూసుకోవడం జరిగాయి.

1975 జనవరిలో మహాబలిపురంలో 'అల్లుడొచ్చాడు' కోసం 'కొడితే పులినే కొట్టాలిరా' అనే పాట చిత్రీకరణ జరుగుతోంది.. వర్షం బ్యాక్‌డ్రాప్‌లో నాలుగు రోజులు తీసిన పాట అనుకున్నట్లు రాకపోవడంతో రీ-షూట్ చేద్దామని అందరూ నిర్ణయించుకున్నారు. ఐతే ఆ పాటలో పాల్గొంటున్న ప్రభకి డేట్స్ విషయంలో క్లాష్ వచ్చి 'నేను వెళ్ళిపోవాలి కుదరదు' అంది. ఆవిడ డేట్స్ మాట్లాడింది నేనే. ఆవిడ వెళ్ళిపోతే , షూటింగ్ వాయిదా వేస్తే మళ్ళీ జయసుధ డేట్స్ దొరకడానికీ మరో నెలరోజులు పడుతుంది. ఇవన్నీ సుబ్బారావు గారికీ, ప్రత్యగాత్మగారికీ తెలిస్తే నా మీద వాళ్ళకి చెడ్డ అభిప్రాయం వస్తుందే అని భయం. ఐతే ప్రభ వాళ్ళన్నయ్యతో మాట్లాడి ఆమె షూటింగ్ కంటిన్యూ చేసేలా ఏర్పాటు చేశాం..ఇది జరిగిన రోజు రాత్రే సుబ్బారావు గారి వద్దనుంచీ నాకు కబురు వచ్చింది 'ఒక సారి రావాలి' అని. ఇంక నాపని ఐపోయిందనే అనుకున్నాను. డేట్స్ సరిగా చూడలేకపోయినందుకు నన్ను మందలించడానికే పిలిచారనుకున్నాను.

హోటల్‌కి వెళ్ళే సరికి సుబ్బారావు గారు. ప్రత్యగాత్మ గారు, రామారావు గారు కూడా అక్కడే వున్నారు. అందరూ ఒక్కచోట వుండి నాకు కబురుచెయ్యడం వెనుక ఆంతర్యం అర్థం కాలేదు.. 'రావయ్యా..గాంధీ రా..' అని సుబ్బారావుగారు పిలవడం, ఆయన గొంతులోని ఆత్మీయత నాకు కాస్త ఆశ్చర్యం కలిగించాయి. ఏదో మందలించడానికి పిలిచారనుకుంటే, ఇంతమృదువుగా రమ్మంటున్నారే అనుకున్నాను 'ఈ రోజు నా పుట్టినరోజయ్యా' అన్నారు..'హేపీ బర్త్‌డే సార్..'అని ఒక మూల ఒదిగి కూర్చుకున్నాను. కొంతసేపు అయ్యాక ఆయనే ప్రత్యగాత్మ, తాతినేని రామారావు గార్ల సమక్షంలో 'గాంధీ నిన్ను దర్శకుడ్ని చేస్తున్నాను' అని ప్రకటించారు.. నా విస్మయానికి హద్దులు లేవు. పి.ఎ.పి లాంటి సంస్థలో దర్శకుడుగా పనిచేసే మొదటి అవకాశం.. నన్ను నేను నమ్మలేక పోయాను..అది 1975 జనవరి 20 వతేదీ..!


సరిగ్గా రెండు సంవత్సరాల తరువాత 1977 లో పి.ఎ.పి వారి రజతోత్సవ సంవత్సరంలో వారు నిర్మించిన మూడు సినిమాల్లో ఒకటైన 'అర్ధాంగి' కి దర్శకత్వం వహించే అవకాశం వచ్చింది. గురువుగారు ప్రత్యగాత్మగారిదే కథ.. దర్శకుడిగా చెప్పుకోవాలంటే 'అర్ధాంగి' నా **మొదటి సినిమా**.. మురళీమోహన్, జయసుధ, మోహన్‌బాబు, చంద్రమోహన్..ల కాంబినేషన్.. 1977 మే 1 న హైదరాబాదులోని గోల్డ్‌స్పాట్ కంపెనీలో జయసుధమీద ఫస్ట్‌షాట్.. రామారావు గారు క్లాప్, ప్రత్యగాత్మగారు కెమెరా స్విచ్ ఆన్ తో దర్శకుడిగా నా కెరీర్ మొదలైంది.. "మేడే నాడు మెగా ఫోన్ పట్టిన మోహనగాంధీ' అని గిరిధర్ అనే పాత్రికేయ మిత్రుడు పెద్ద పెద్ద శీర్షికలతో న్యూస్ వ్రాశాడు..

మొత్తం 28 రోజుల్లో హైదరాబాదులోనే సినిమా పూర్తిచేసి, కొంచెం ప్యాచ్‌వర్క్‌ని మద్రాసులో ముగించి దరిదాపు రెండున్నర నెలల్లో సినిమా మొత్తం పూర్తిచేసి రిలీజ్‌కి సిద్ధం చేశాను. అప్పుడే మొదలయ్యాయి అసలు సమస్యలు .. 'అర్ధాంగి' టైటిల్ తో ఒక పాతసినిమా వుండడంతో చాలా మంది ఆ టైటిల్ వొద్దు అని సలహా ఇచ్చారు.. పి.ఎ.పి.సుబ్బారావుగారు, ప్రత్యగాత్మగారు నిర్ణయాన్ని నాకొదిలేశారు. కథ, కథనం దృష్ట్యా అదే సరైన టైటిల్ అని 'అర్ధాంగి'పేరుతోనే సినిమా రిలీజ్ చెయ్యడానికి నిర్ణయించాం. 1977 అక్టోబర్ లో రిలీజ్. మా సినిమా రిలీజ్ అవడానికి వారం ముందే పాత 'అర్ధాంగి' సినిమాని కొత్త ప్రింట్లతో మా సినిమా రిలీజ్ అయ్యే థియేటర్లకి పక్క థియేటర్లలోనే రిలీజ్ చేశారు.. ఐనా నవయుగ ద్వారా మా సినిమా కూడా మంచి థియేటర్లలోనే రిలీజ్ ఐంది. కానైతే సినిమాకి ఏవరేజ్ టాక్ వచ్చింది. ఇందుకు కారణం..దాదాపు ఇదే కథాంశంతో అప్పటికే మరో రెండు కొత్త సినిమాలు రావడం..! కేవలం యాధృచ్ఛికమే ఐనా దాదాపు ఇదే కథాంశంతో ఒకే సమయంలో 4 సినిమాలు రిలీజ్ అయ్యాయి.

అమరదీపం - సూపర్ హిట్, ప్రేమ లేఖలు అబౌవ్ ఏవరేజ్..మా 'అర్ధాంగి' ఏవరేజ్. నాలుగో సినిమా 'గోరంతదీపం' ఫ్లాప్..! పైగా మా సినిమా రిలీజ్ ఐన 2-3 వారాల్లోనే ఆంధ్రా అంతా అతలాకుతలం చేసిన భయంకరమైన్ తుఫాన్..! గమనించదగ్గ విషయం ఏమిటంటే - ఇన్ని ఆటంకాలెదురైనా, పి.ఎ.పి కి మాత్రం నష్టాలు రాని సినిమాగా నిలిచింది నా మొదటి సినిమా 'అర్ధాంగి'.

ఇదీ దర్శకుడిగా నా మొదటి సినిమా వరకూ జరిగిన నా సినీ జీవిత ప్రస్థానం..!




శ్రీ మోహన్ గాంధీగారు 'కర్తవ్యం','మౌనపోరాటం'.. లాంటి సందేశాత్మక, సామాజిక ప్రయోజనాత్మక చిత్రాలతో బాటు 'మంచి మనసులు', 'వారసుడొచ్చాడు' లాంటి ఫేమిలీ సెంటిమెంట్ సినిమాలకూ దర్శకత్వం వహించి సూపర్ హిట్ చేసిన ఘనత ఆయనది. ఇంతవరకూ దాదాపు 40 సినిమాలకి పైగా దర్శకత్వం వహించిన గాంధీ గారు కొన్ని కన్నడ సినిమాలకి కూడా దర్శకుడిగా పనిచేశారు.

Featured in January 2007

# ముత్యాల సుబ్బయ్య

తెలుగు సినిమా దర్శకుల్లో చక్కటి కుటుంబ చిత్రాల దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకున్న ముత్యాల సుబ్బయ్య గారు దాదాపు 50 సినిమాలకి దర్శకత్వం వహిస్తే 75 శాతం హిట్ సినిమాలే. ఒకే నిర్మాతకి ఐదారు సినిమాలు తీసి నిర్మాతల దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు సుబ్బయ్యగారు. చిరంజీవి తో 'హిట్లర్', 'అన్నయ్య' సినిమాలూ, వెంకటేశ్ తో 'పవిత్రబంధం' ' పెళ్ళిచేసుకుందాం', బాలకృష్ణ తో 'ఇన్స్పెక్టర్ ప్రతాప్', 'పవిత్రప్రేమ' 'కృష్ణబాబు' , ఏ హీరో ఇమేజీ లేకుండా కేవలం కథా బలంతో కలికాలం, అమ్మాయి కాపురం, సగటు మనిషి లాంటి సినిమాలు దర్శకుడిగా రూపొందించిన సుబ్బయ్య గారు, 'అరుణ కిరణం', 'ఎర్ర మందారం','అమ్మాయి కాపురం', పవిత్రబంధం' చిత్రాలకు నంది అవార్డులనందుకున్నారు. 'కలికాలం' చిత్రానికి కళావాహిని అవార్డు, ౨౦౦౪ లో కె.వి.రెడ్డిగారి అవార్డు, పి.పుల్లయ్యగారి అవార్డు కూడా అందుకున్నారు.




నా మొదటి సినిమా గురించి చెప్పాలంటే దాదాపు 35 సంవత్సరాలు వెనక్కి వెళ్ళాలి. మా స్వగ్రామం ప్రకాశం జిల్లాలోని కె. బిట్రగుంట. నాన్న గారి పేరి ముత్యాల శంకరయ్య , అమ్మ పేరు ముత్యాల శేషమ్మ. మాది దిగువ మధ్య తరగతి వ్యవసాయాధారిత కుటుంబం. నాకు 10 సంవత్సరాల వయసు వచ్చేవరకూ ఆ ఊళ్ళోనే వున్నాను. తరువాత నాన్నగారి వ్యవసాయం రీత్యా నెల్లూరు దగ్గరలోని పార్లపూడి అనే వూరికి మారాము. ఇంట్లో నేనే పెద్ద వాడిని. నాతరువాత ఇద్దరు చెల్లెళ్ళూ, ఒక తమ్ముడు..నా హైస్కూలు చదువూ, కాలేజీ అంతా ఈ వూరునుంచే సాగింది. పి.యు.సి అయ్యాక, బి.కామ్ లో చేరాను. మావూరికి పక్కనే ఉన్న ఇడవలూరులో కాలేజీ. రోజూ సైకిల్ మీద వెళ్ళి వస్తుండేవాడిని. హైస్కూల్లో ఉండగానే అంటే 8 వ తరగతి నుంచే నాటకాలమీద ఆసక్తి ఉండేది.

కాలేజీకి వచ్చే సరికి అది పరాకాష్టకి చేరుకుంది. కాలేజీ పూర్తయే సరికి దాదాపు 100 నాటకాల్లో నటించడం, ఉత్తమనటుడిగా, ఉత్తమ దర్శకుడిగా బహుమతులు తెచ్చుకోవడం జరిగింది. ఊళ్ళో ఉన్న కుర్రవాళ్ళతో కలిసి రవీంద్ర ఆర్ట్ థియేటర్స్ అని ఒక నాటక సమాజాన్ని స్థాపించి చుట్టుపక్కల జరిగే పరిషత్ నాటకాల్లో కూడా పాల్గొంటూ ఉండేవాళ్ళం. వీటన్నింటితోనూ చదువులో వెనకబడే వుండేవాడిని. కాలేజీలో రెండేళ్ళు ఫైన్ ఆర్ట్స్ సెక్రటరీగా పనిచేశాను కానీ డిగ్రీ పాసవడం మాత్రం జస్ట్ ఏవరేజ్ మార్కులతోనే..

డిగ్రీ అయ్యాక ఏం చెయ్యాలి? నాకొచ్చిన మార్కులకి ఉద్యోగం వచ్చే సూచనలేమీ కనిపించలేదు. ఏ ఉద్యోగానికీ, అప్లై కూడా చెయ్యలేదు ఈ లోగా ఫ్రెండ్స్ అందరూ 'నాటకాల్లో ఇంత అనుభవం ఉందిగదా..సినిమాల్లో ఎందుకు ప్రయత్నించకూడాదూ..' అని ప్రోత్సహించారు.

అమ్మా, నాన్నలకి చదువులూ, ఉద్యోగాలూ ఎక్కువ తెలీదు కాబట్టి నా భవిష్యత్తు గురించిన నిర్ణయాన్ని నాకే వదిలేశారు.

మొత్తానికి స్నేహితుల సలహా నా మీద చాలా ప్రభావాన్ని చూపించింది. సినిమాల్లోకి ఎలా వెళ్ళాలి? మా ఊరిలో కొంతమందికి సినిమా పరిశ్రమలో ఉన్న వాళ్ళతో బంధుత్వం ఉండేది. రాజేంద్ర కుమార్ అనే కళాదర్శకుడికీ, సీనియర్ కమేడియన్ రమణారెడ్డి గారికీ, వారి బంధువూ అప్పటికే అసిస్టెంట్ డైరెక్టర్ ఐన ఎం.ఎస్.కోటా రెడ్డి గారికీ మా ఊళ్ళో బంధువులున్నారు.



వీళ్ళే కాకుండా నా స్నేహితుల కుటుంబసభ్యులకి మద్రాసులో హోటల్ నవయుగ ( సవేరా ఎదురుగుండా ఉండేది), ద్వారకా లాడ్జి, ఉండేవి..ఏలాగైతే ఈ లింకులన్నీ ఉపయోగించి మద్రాసులో అడుగుపెట్టా 1973 ప్రాంతాల్లో. అప్పటికి రాజేంద్ర కుమార్ గారు ఒక సినిమాకి పనిచేస్తున్నారు. మానాపురం అప్పారావు గారి దర్శకత్వంలో సావిత్రి , హరనాథ్ తారాగణంతో మొదలైన సినిమాకి అప్రెంటిస్‌గా చేరాను. సినిమా మొదలైన కొద్ది రోజులకే ఆగిపోయింది!ఈ విధంగా సినిమా వాతావరణాన్ని నాకు పరిచయం చేసిన మొదటిసినిమా పేరు పెట్టుకోకుండానే మధ్యలో ఆగిపోయింది..!

నేనూ రోడ్డున పడ్డాను. ఎలాగైనా సినీఫీల్డ్‌లోనే స్థిరపడాలని నిర్ణయించుకున్నాను కాబట్టి, మళ్ళీ ప్రయత్నాలు కొనసాగించి ఎలాగైతే అక్కినేని సంజీవిగారి దర్శకత్వంలో రవీంద్ర ఆర్ట్ పిక్చర్స్ నిర్మిస్తున్న సిసింద్రీ చిట్టిబాబు సినిమాకి అప్రెంటిస్‌గా కుదురుకోగలిగాను. తెరమీద నాపేరు 'ఎమ్. సుబ్బయ్య'గా చూసుకోగలిగిన మొదటి సినిమా 'సిసింద్రీ చిట్టిబాబు' అని చెప్పుకోవచ్చు.

తరువాత సుప్రియా హోటల్ రెడ్డి గారి సలహా, రికమండేషన్ మేరకు అప్పటికే బడిపంతులు లాంటి సూపర్ హిట్స్‌తో మంచి పేరులో వున్న పి.చంద్రశేఖర రెడ్డి గారి వద్ద తల్లీకొడుకులు సినిమాకి అప్రెంటిస్‌గా చేరడంతో నా సినీ జీవితానికి ఒక మార్గం దొరికింది. పి.సి.రెడ్డి గారి వద్దనే దాదాపు 10 సినిమాల వరకూ పనిచేశాను. ఆయనవద్దనే అప్రెంటీస్ నుంచీ అసిస్టెంట్ డైరెక్టర్ నుంచీ, అసోసియేట్ డైరక్టర్ నుంచీ, కోడైరెక్టర్ దాకా ఎదిగాను. ఆ విధంగా 6-7 సం వత్సరాలు గడిచాయి. మధ్యలో కొంత కాలం గాప్ వస్తే మృణాల్‌సేన్ గారి " ఒక వూరి కథ" కి ( దీన్ని సుప్రియా హోటెల్ పరంధామ రెడ్డిగారు నిర్మించారు) కో-డైరెక్టర్ గా పనిచేసి మళ్ళీ పి.సి.రెడ్డి గారి వద్దకి వచ్చేశాను.



ఆయనప్పుడు కృష్ణంరాజు శ్రీధర్‌లతో "రాముడు - రంగడు" చేస్తున్నారు. దానికీ నేనే కోడైరెక్టర్. ఆ సినిమాకి ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్న పొన్నతోట రఘురాం గారు ఒక రోజు "సుబ్బయ్యా...నేను ఇండస్ట్రీకి వచ్చి చాలా రోజులైంది. ఏదైనా సొంతంగా సినిమా తియ్యాలని ఉంది" అన్నారు. ఎన్నాళ్ళు గానో నేననుకుంటున్న ఒక కథ థ్రెడ్ చెప్పాను. 18 ఏళ్ళ అమ్మాయి మెడలో 8 ఏళ్ళ అబ్బాయి అనుకోకుండా తాళి కట్టడం..తద్వారా జరిగే పరిణామాలూ. కథ వినగానే రఘురాం గారు 'చేస్తే ఇలాంటి ఆఫ్ బీట్ సినిమానే చెయ్యాలి..లెటజ్ గో హెడ్ ' అన్నారు. ఐతే నేను చెప్పాను ' ఈ సినిమా కనుక సూపర్ హిట్ చెయ్యాలంటే బాలకృష్ణ, వాణిశ్రీ కాంబినేషన్‌లోనే చెయ్యాలి' అని. కానీ ఆయన అనుకున్న బడ్జెట్‌కి ఇద్దరూ అందుబాటులో లేరు. ఐనా కథ వదులుకోవాలని లేదు. ఏ ఇమేజీ లేని కొత్తవాళ్ళతో తీద్దామనుకుని అప్పలాచార్య గారిని మాటలు వ్రాయడానికీ, సత్యం గారిని మ్యూజిక్ డైరెక్షన్‌కి ఎన్నుకుని ఏర్పాట్లలో తీవ్రంగా మునిగిపోయాం. ఈ లోగా రఘురాంగారు ఫైనాన్సింగ్ కోసమని ధర్మవరానికి చెందిన అచ్చప్ప గారిని కలవడం, కథ విన్నాక ఆయనా సినిమాలో భాగస్వామిగా చేరతాననడం జరిగింది. ఐతే ఈ కథతో సినిమా సేఫ్ ప్రోజెక్ట్ కావాలంటే ప్రధాన పాత్రలకైనా పేరున్న వాళ్ళని తీసుకోవాల్సిందేనని అయన పట్టుబట్టారు. నాకేమో వాణిశ్రీ బాలకృష్ణ కానప్పుడు కొత్తవారితోనే చెయ్యాలని అభిప్రాయం. అప్పటికే సినిమా ప్రయత్నాలు చాలా దూరం వచ్చాయి. ఆ పరిస్థితిలో నేను కొంత రాజీపడి, హీరోయిన్ పాత్రకి మాధవిని, హీరో పాత్రకి రాజేంద్ర ప్రసాద్‌నీ ( అప్పటికి తను స్నేహం లో మాత్రమే చేసి ఉన్నాడు) తీసుకున్నాం.

షూటింగ్ అంతా రాజమండ్రి దగ్గరే మొత్తం 20 రోజులలోగా ముగిసింది. దర్శకుడిగా నా మొదటి సినిమా అది 'మూడు ముళ్ళ బంధం'. హీరోయిన్ పెళ్ళి పీటల మీద వుండగా, పెళ్ళి కొడుకు చనిపోతాడు. అందరూ హీరోయిన్ నష్టజాతకురాలు అంటూ నిందిస్తారు. సవతి తల్లి కూడా శాపనార్థాలు పెడుతుంది.

ఇదంతా చూస్తున్న 8 సంవత్సరాల కుర్రాడికి 'పాపం..ఈ అమ్మాయిని అందరూ తిడుతున్నారు. నేనే వెళ్ళి తాళికడితే బావుంటుంది కదా.. ఆటల్లో బొమ్మల పెళ్ళిళ్ళు ఎన్ని సార్లు చెయ్యలేదూ?" అనుకుని తనకంటే 10 సంవత్సరాలు పెద్దదైన హీరోయిన్ మెడలో తాళి కడతాడు. ఆ తరువాత ఆ కుర్రాడు పెద్దవాడవడమూ, అతను మరో అమ్మాయిని ప్రేమించడామూ.. ఇలా నడుస్తుందా కథ.

సెన్సార్‌కి వెళ్ళినప్పుడు సినిమా ప్రివ్యూ ముగిసిన 3 గంటల వరకూ సెన్సార్ ఆఫీసర్లు ఎవరూ థియేటర్ లోంచి బయటికి రాలేదు. మాకేమీ అర్థం కాలేదు.. మూడు గంటల తర్వాత మమ్మల్ని లోనికి పిలిచి

" నీకెంత ధైర్యమయ్యా ఈ కథని సినిమాగా తియ్యడానికి? ఎనిమిదేళ్ళ కుర్రాడేమిటి..పద్దెనిమిదేళ్ళ అమ్మాయికి తాళి కట్టడమేమిటి..ఈ సినిమాని బాన్ చెయ్యాలసలు" అన్నారు.

"ఎందుకు సార్?" అన్నాను.

"శారదా యాక్ట్ ప్రకారం బాల్య వివాహాలు నేరం..వాటిని సినిమాల్లో ఎంకరేజ్ చెయ్యకూడదు"

"ఇది బాల్య వివాహం అలా ఔతుందండీ.. కుర్రాడు చిన్నవాడే కానీ, అమ్మాయి పెద్దదే కదా..!" అని నా వాదన.

చివరికెలాగైతే సెన్సార్ సర్టిఫికెట్ వచ్చింది. 'మూడు ముళ్ళ బంధం' డైరెక్టర్‌గా నా మొదటిసినిమా!! ప్రివ్యూ చూసిన సినీ ప్రముఖులంతా మా ధైర్యానికి షాక్ తిన్నారు. రిలీజ్‌కి ముందుకూడా డివైడెడ్ టాక్ వచ్చింది "ఇదేదో ఎక్స్పెరిమెంట్ సినిమా, యాంటీ సెంటిమెంట్ సినిమా.." అంటూ..! మొత్తానికి రెండు, మూడు నెలల తర్వాత 1980 అక్టోబర్ ప్రాంతాల్లో విడుదలైంది. మా అంచనాలకి విరుద్ధంగా ప్రేక్షకులు సినిమాని తిరగ్గొట్టారు. మేము ఆఫ్‌బీట్ అనుకున్న కథని ఏ మాత్రం రిసీవ్ చేసుకోలేదు. ఎంతో ఎడ్వాన్స్‌డ్ కథని మరీ ఎర్లీగా తీశామనిపించింది..! 'తొందరపడి ముందే కూసిన కోయిల' రాగాన్ని ఎవరూ వినలేదు..!



ఐతే 'మూడుముళ్ళ బంధం' డైరెక్టర్‌గా నాకు మంచి పేరే తెచ్చిపెట్టింది. టేకింగ్‌ని కూడా అంతా మెచ్చుకున్నారు. ఎటొచ్చీ కథే ఎవరికీ నచ్చలేదు.. కిందామీదా పడి 3-4 వారాలు ఆడిందంతే.. నాకు చాలా బాధ వేసింది. "అరే..మంచి సినిమా అన్న పేరు తెచ్చుకుంది కానీ ప్రేక్షకుల్ని చేరలేకపోయిందే. ప్రేక్షకుల్ని మెప్పించే సినిమా తియ్యలేక పోయానే.." అని దిగులుగా వుండేది. ఒకరిద్దరు నాతో సినిమా తీద్దామని వచ్చారు కానీ నేనే ఒప్పుకోలేకపోయాను..

ఐతే..ఏం చెయ్యాలిప్పుడు? ఆర్థిక పరిస్థితులుకూడా బాగా లేవు. అప్పటికే ముగ్గురు పిల్లల తండ్రిని. వాళ్ళ క్షేమం చూడడం కూడా నాకు ముఖ్యమే.. ఒక సంవత్సరం తర్జన, భర్జనల అనంతరం మళ్ళీ కోడైరెక్టర్‌గా నైనా సరే చేద్దామని నిర్ణయించుకున్నాను. ఆ సమయంలోనే టి.కృష్ణ గారు 'నేటి భారతం' సినిమాని తొలి ప్రయత్నంగా తీస్తూ కో-డైరెక్టర్ కోసం చూస్తున్నారని బి.గోపాల్, పి.సి.రెడ్డిగార్ల ద్వారా నాకు కబురొచ్చింది.. అప్పటినుంచీ మొదలుపెట్టి టికృష్ణ గారు తీసిన ఆరు సినిమాలకీ నేనే కో-డైరెక్టర్ గా పనిచేశాను..

టి.కృష్ణ గారితో వందేమాతరం, దేవాలయం సినిమాలు తీసిన హరికృష్ణగారు మైనంపాటి భాస్కర్ గారు రాసిన వెన్నెలమెట్లు నవల్ని చదివి సినిమాగా తీద్దామని నిర్ణయించుకుని నన్ను పిలిచారు. అది చదివి దాన్ని చక్కటి సినిమాగా తియ్యొచ్చని చెప్పగానే ' మీరే డైరెక్ట్ చెయ్యండి.." అన్నారు. అప్పటికే విజయశాంతి, రాజశేఖర్‌లతో ఎక్కువసినిమాలకి పనిచేసి ఉండడంతో, నవలలో కేరక్టర్స్‌కి వాళ్ళే సరిపోతారని నిర్ణయించుకుని 'అరుణకిరణం' గా ఆ నవలని తీశాం. 1986 లో రిలీజ్ ఐంది.. 150 రోజుల సినిమా ఐంది అది..! ఈ విధంగా విజయవంతమైన ఈ 'అరుణకిరణం' నాకు పునర్జన్మనిచ్చిన మొదటి సినిమా..! ఇంక అప్పటినుంచీ వెనక్కి తిరిగి చూసుకునే అవసరం రాలేదు.. !

**Featured in February 2007**



# లయ

*అందం, అభినయం సమపాళ్ళలో కలబోసుకున్న అచ్చమైన తెలుగింటి ఆడపడుచు, కుటుంబ చిత్రాల కథానాయకిగా పేరుతెచ్చుకున్న లయ తన చిన్ననాటి తీపి గుర్తుల్నీ, మొదటి సినిమా జ్ఞాపకాల్నీ 'కౌముది' పాఠకులతో పంచుకుంటున్నారు.*

నా చిన్నతనంలో నాన్నగారి వృత్తి(ప్రస్తుతం నెఫ్రాలజిస్ట్)రీత్యా మద్రాసులో వున్నప్పుడు నేను ప్రి-నర్సరీ, నర్సరీ చదువుకున్నాను. తరువాత విజయవాడకి మారి ఎల్.కె.జి నుంచీ నేను సినిమా రంగానికి వచ్చేవరకూ(ఇంటర్మీడియట్) విజయవాడలోని నిర్మలా కాన్వెంట్లో, హైస్కూల్లో చదువుకున్నాను. అమ్మా నాన్నలకి నేను ఒక్కర్తెనే సంతానం. నాన్నగారు హాస్పిటల్ డ్యూటీ ఐపోగానే ఎప్పుడూ ఇంటికి వచ్చేసి మాతోటే గడిపేవారు. అమ్మా, నాన్నా, నేనూ స్నేహితుల్లా ఉండేవాళ్ళం ,చిన్నప్పటినుంచీ.

నేను రెండో తరగతిలో వున్నప్పుడే చెస్ నేర్చుకోవడం మొదలుపెట్టాను.. చాలా సీరియస్‌గా ప్రాక్టీస్ చేసి చెస్‌లో మంచి ప్రావీణ్యం సంపాదించాను. స్టేట్ లెవెల్లో ఏడుసార్లూ, నేషనల్ లెవెల్లో ఒకసారీ ఛాంపియన్ షిప్స్ కూడా గెలుచుకున్నాను. చెస్ పోటీలకి బయటి స్కూళ్ళకి వెళ్ళేప్పుడు నాన్న గారు వెంటబెట్టుకుని వెళ్ళేవారు. ఎప్పుడేనా నాన్నగారికి వీలు కాకపోతే అమ్మ నాతో వచ్చేది. రెండో తరగతి నుంచీ ఏడో తరగతి వరకూ చాలాసీరియస్‌గా చెస్ పోటీల్లో పాల్గొనే దాన్ని. ఐతే ఇంక తరువాత చెస్ ప్రాక్టీసు చేసే సమయం పెరగడం, దాదాపు రెగ్యులర్ క్లాసులకి వెచ్చించేటంత సమయం అవసరం కావడంతో వీలుకాక ఆ ప్రాక్టీస్ మానేశాను. ఐనా పదో గ్రేడ్ వరకూ అడపాదడపా చెస్ పోటీల్లో పాల్గొనే దాన్ని.

5వ తరగతి నుంచే సంగీతం, కూచిపూడి నృత్యం నేర్చుకోవడం కూడా మొదలుపెట్టా ను. అంత చిన్న వయసులోనే నా దినచర్య ఎలా వుండేదంటే పొద్దున్నే సంగీతం క్లాసు, తరువాత స్కూలు, సాయంకాలం డాన్స్ ప్రాక్టీసు ముగించుకుని ఇంటికి వచ్చి మళ్ళీ వెంటనే చెస్ ప్రాక్టీసుకి వెళ్ళడం తిరిగి రాగానే మళ్ళీ హోమ్ వర్క్..5వ తరగతినుంచే ఇలా బిజీగా వుండేదాన్ని. వీకెండ్స్‌లోనూ, శెలవు రోజుల్లోనూ మాత్రమే చుట్టుపక్కల పిల్లలతో కలిసి ఆ-డుకునే దాన్ని.

8వ తరగతినుంచీ కూచిపూడి మానేసి భరతనాట్యం నేర్చుకోవడం మొదలుపెట్టాను. విజయవాడలో జోస్యుల రామచంద్రమూర్తిగారి వద్దా, ఐదేళ్ళ క్రిందట హైదరాబాదు వచ్చాక పసుమర్తి రామలింగ శాస్త్రి గారి వద్దా భరతనాట్యం నేర్చుకున్నాను.

మరొక చిన్నప్పటి జ్ఞాపకం ఏమిటంటే నేను నాలుగో తరగతిలో వుండగా, హైదరాబాదు ఎక్స్‌కర్షన్‌కి వెళ్ళినప్పుడు అక్కినేని కుటుంబరావు అంకుల్ ఆయన తీయబోయే బాలల చిత్రం 'భద్రం కొడకో' లో నటించడం కోసం పిల్లల్ని వెదుకుతూ మా బృందాన్ని చూడడం , అందులో చలాకీగా వున్న నన్ను చూసి 'సినిమాల్లో వేషం

చేస్తావా' అని అడగడం జరిగింది. నాలుగో తరగతి లోవున్న నాకు సినిమా అంటేనూ, నటించడం అంటేనూ అప్పట్లో ఏమీ తెలీదు. అమ్మా , నాన్న గార్లే ఆలోచించి ఎలానూ శెలవలే కదా సరదాగా వుంటుంది చెయ్యమన్నారు. అందులో ఒక ముఖ్యపాత్ర వేసే అబ్బాయి వాళ్ళ నాన్నగారు, మా నాన్నగారూ మిత్రులవడం కూడ ఒక కారణం.. కుంటుంబరావు అంకులే ఒక 20 మంది పిల్లలకి వర్క్‌షాప్ లాగా నిర్వహించి , నటించడం, స్క్రిప్టు చదవడం అన్నీ నేర్పించి అందులోంచి కొంతమందిని ఫైనల్‌గా సినిమాకోసం సెలక్ట్ చేసుకున్నారు. అందులో నన్ను బాలికల్లో మెయిన్ పాత్రకి సెలక్ట్ చేశారు. ఆ సినిమాకి చాలా అవార్డులొచ్చాయి కూడా. అందులో నాతోబాటు నటించిన ఒక అబ్బాయికి నేషనల్ ఎవార్డు వచ్చిందికూడా. కాకపోతే మామూలు సినిమాగా రిలీజ్ అవ్వకపోవడం వల్ల ఎక్కువమందిని చేరలేకపోయింది.



ఇది అయ్యాక నేను విజయవాడ వచ్చేసి మామూలుగా చదువులో పడిపోయి,ఇంతకు ముందే చెప్పినట్లు చెస్, సంగీతం, డాన్సు ,రెగ్యులర్ స్కూలుతో బిజీగా ఐపోయాను.

అప్పట్లో ఆంధ్రజ్యోతికి అనుబంధంగా నవీన అనే పత్రిక వచ్చేది. దానిలో పబ్లిష్ చేయడానికని ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ సీతారామ్‌గారు ( ప్రస్తుతం కెనడాలో ఉంటున్నారు), నన్నూ, మా సీనియర్ ఒకమ్మాయినీ ఫోటోలు తీసి నవీనకి పంపించేవారు. ఆ విధంగా మా ఫోటోలు ప్రతి శనివారం నవీనలో వివిధ శీర్షికల కింద వచ్చేవి. .

అలా వుండగా నేను 10వ తరగతిలో వున్నప్పుడు (1996) , హాఫ్ ఇయర్లీ శెలవల్లో అనుకుంటాను నేనూ , నా సీనియర్ ఫ్రెండు కలిసి ఒకరోజు మా ఇంట్లో టి.వి చూస్తున్నాము. జెమిని టి.వి.లో రాఘవేంద్రరావు గారి కొత్త సినిమాకి నటీనటులకోసం స్టార్ 2000 పోటీల గురించి ప్రకటన చూశాం. ఆంధ్రజ్యోతి కోసం అంతకుముందే తీయించుకున్న ఫోటోలు ఉన్నాయి కదా, అవీ ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ తీసినవే కదా, ఇంక బయోడాటా రాసి పంపించి చూద్దామని మేమిద్దరం అనుకున్నాం. మళ్ళీ అంతలో అనుమానం వచ్చింది' మేమిలా పంపిస్తే ఎవరు చూస్తారు..ఎన్నో వందల ఫోటోలు వస్తాయి కదా వాళ్ళకి, ఎక్కడో పారేస్తారులే' అని మాలో మేమే అనుకుని ఆ ఆలోచన విరమించుకున్నాం.

ఐతే ఈ విషయాన్ని విన్న మా అమ్మ 'నీకు నిజంగా ఆసక్తి ఉంటే ప్రయత్నించి చూద్దాం' అంది. 'ఐనా కానీ వద్దులే అమ్మా అన్ని వేల ఫోటోల్లో ఎవరు చూస్తారు' అన్నాం . ఐతే ఒకరోజు నేను స్కూల్లో ఉండగా అమ్మ ఫోన్ చేసి 'జెమిని స్టార్ 2000 పోటీలకోసం నువ్వు సెలెక్ట్ అయ్యావు, రాత్రికే బయలుదేరి హైదరాబాదు వెళ్ళాలి, వెంటనే వచ్చెయ్యి' అన్నారు. అప్పుడే తెలిసింది, నాకు తెలీకుండానే అమ్మ పోటీలకి నా ఫోటో పంపించారని. అందులో వివిధ

దశలు దాటి రెండో స్థానాన్ని చేరుకోవడం జరిగింది. ఐతే కేవలం మొదటి స్థానం వచ్చిన వాళ్ళకే సినిమాలో వేషం ఇస్తానన్నారు కాబట్టి నాకు 'పరదేశీ' సినిమాలో వేషం వేసే అవకాశం రాలేదు.సినిమాలో వేషం లేకపోయినా టి.వి లో యాంకర్‌గా అవకాశం ఇస్తామన్నారు కానీ ఎందుకనో అదీ జరగలేదు. ఇతే రాఘవేంద్రరావు గారు నాలో ఉత్సాహాన్ని గమనించి 'హీరోయిన్ వేషాం వెయ్యాలంటే నువ్వు ఇంకొన్ని రోజులు ఆగాలి. సీరియస్‌గా సినిమా కెరీర్‌ని ఎంచుకోదలిస్తే నువ్వు కొన్ని రోజులు ఆగు. చాలా సన్నగా ఉన్నావు. ఇంకా కొంచెం లావు అవ్వాలి. అలానే ఈ వయసులో నీకు చెల్లెలు వేషాలు ఇస్తామనీ , చిన్న చిన్న పాత్రలు ఇస్తామనీ వస్తారు . వాటికి అంగీకరించకు. ఈ ఫీల్డ్‌లో ఒక తరహా పాత్రలకి ఒప్పుకుంటే ఆ మూసలోంచి బయటికి రావడం చాలా కష్టం.. ఎప్పుడే సలహా కావాలన్నా నన్ను అడగండి' అని చెప్పారు

మళ్ళీ విజయవాడ వచ్చేశాము. టీవిలో నేను పాల్గొన్న ఎపిసోడ్స్ వచ్చినప్పుడు చూసి చాలా ఆనందించాము.. లక్షమంది కంటెస్టెంట్స్‌లో రెండో స్థానం రావడమే గొప్పకదా అనుకుని కానీ ఇంక విషయం అప్పుడే మరిచిపోయి ఇంటర్మీడియట్‌లో చేరిపోయాను. రాఘవేంద్ర రావుగారు చెప్పినట్లే చాలా మంది చిన్న చిన్న పాత్రలు చెయ్యమని అడిగారు కానీ మేమే ఒప్పుకోలేదు.

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చివరలో ఉండగా విజయవాడలో మాకు తెలిసిన అంకుల్ వాళ్ళింటికి ఓరోజు వెళ్ళినప్పుడు అక్కడికి ఎస్.పి.ఎంటర్‌టెయిన్‌మెంట్స్‌కి సంబంధించిన వాళ్ళొచ్చారు. వాళ్ళు కొత్తగా మొదలుపెట్టబోయే స్వయంవరం సినిమాలో హీరోయిన్ కోసం చూస్తున్నారట. నన్ను చూడగానే ' మా సినిమాలో హీరోయిన్ వేషం వేస్తావా?' అని అడిగారు. ఔననీ, కాదనీ నేనేమీ చెప్పలేదు. మా అమ్మా నాన్నలని అడగమని చెప్పాను. వాళ్ళు వెంటనే మా ఇంటికి వచ్చారు. అమ్మకూడా ముందు ఒప్పుకోలేదు. నాన్నగారు అప్పుడు తిరుపతిలో వుంటే వాళ్ళు ఆయన్ని సంప్రదించారు. నాన్న గారు కూడా 'మా అమ్మాయికి టాలెంట్ ఉందని ఒప్పుకుంటాను కానీ హీరోయిన్ లక్షణాలు ఉన్నాయని నేననుకోను..' అంటూ ముందుగా ఒప్పుకోలేదు. వాళ్ళు చాలా సేపు కన్విన్స్ చేసాక ఒక షరతు మీద ఒప్పుకున్నారు. అదేమింటంటే సినిమాని రెండు నెలల్లో నా జూనియర్ ఇంటర్ శెలవుల్లో పూర్తి చేయాలి అని. దానికి వాళ్ళు అంగీకరించారు

ఆ విధంగా 'స్వయంవరం'లో నేను హీరోయిన్ గా ఎంపిక కావడం జరిగింది. నాకింకా గుర్తుంది. హైదరాబాదులో ముహూర్తం షాట్ కాగానే, ప్రెస్ మీట్ కూడా ముగించుకుని ఆ రాత్రే శాతవాహనా ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి విజయవాడ వచ్చి జూనియర్ ఇంటర్ మాథ్స్ -2 పరీక్ష రాశాను. సినిమా అన్నాక అన్నీ మనం అనుకున్నట్లు జరగవు కదా.. ఆ సినిమా పూర్తి కావడానికి దాదాపు సంవత్సరం పట్టింది. 1999 ఏప్రిల్లో రిలీజైంది. కొత్త నిర్మాత , కొత్త దర్శకుడు, కొత్త హీరో, కొత్త హీరోయిన్, కొత్త రచయితా - ఇలాంటి కాంబినేషన్‌లో రూపుదిద్దికున్న ఆ సినిమా ఎంత విజయవంతమైందో మీ కందరికీ గుర్తుంది కదా..! ఇవీ నా మొదటి సినిమా జ్ఞాపకాలు.

తెలుగు సినిమా రంగంలో నాకు మంచి మంచి పాత్రలిచ్చిన వారందరికీ నా కృతజ్ఞతలు. అలానే నేను చిత్రరంగంలో వుండగానే ఎం.సి.ఎ వరకూ చదువుకో గలిగాను. ఏ నిర్మాతలైనా నా చదువు గురించి అర్థం చేసుకుని పరీక్షల సమయంలో షెడ్యూల్స్ లేకుండా ఎడ్జస్ట్ చేసుకునే వారు. ఈ విషయంలో కూడా నాతో సహకరించిన సీనియర్ నటీనటులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.

**Featured in March 2007**

# భీమినేని శ్రీనివాస రావు

*తన దర్శకత్వంలోని మొట్టమొదటి సినిమా 'శుభమస్తు' తోనే విజయవంతమైన దర్శకుడిగా పేరు తెచ్చుకుని మొన్నటి 'అన్నవరం' వరకూ తీసినవి 9 సినిమాలే ఐనా అందులో ఆరింటిని సూపర్ హిట్ చెయ్యడమే కాకుండా అనతికాలంలోనే నిర్మాతగా కూడా మారి అందులోనూ విజయంసాధించిన యువదర్శకుడు భీమినేని శ్రీనివాసరావు గారి మొదటి సినిమా అనుభవాలు.*




మాది గుంటూరు జిల్లాలో తాటపూడి అనే చిన్న పల్లెటూరు. అమ్మ తిరుపతమ్మ, నాన్న రాఘవయ్య,అన్నయ్య వెంకట్రావు. ఇదీ మా కుటుంబం.

మాది మధ్యతరగతి రైతు కుటుంబం. తాతలు సంపాదించిన ఆ-స్తిపాస్తులేం లేవు. అమ్మ,నాన్నలు ఇద్దరూ చిన్నప్పటి నుంచి కష్టపడి సంపాదించి మమ్మల్ని పెంచి పెద్దవాళ్ళని చేశారు. సాధారణంగా అందరూ కష్టపడి చదువుకుంటారు. కానీ, మేము చదువుకోవటానికి కష్టపడాల్సివచ్చింది.!! ఎందుకంటే ఎలిమెంటరీ స్కూల్ వరకూ మాఊళ్ళోనే ఉన్నా, హైస్కూల్ చదువు కోసం పక్కనే ఉన్న మురికిపూడి వెళ్ళాల్సివచ్చింది. కొంతకాలం కాలినడక, మరికొంతకాలం సైకిల్ ప్రయాణం.!!

ఉదయం క్యారేజీ తీసుకెళ్తే, మళ్ళీ ఇంటికి తిరిగొచ్చేది మరుసటి రోజు ఉదయమే. సాయంత్రం వరకూ స్కూలు, రాత్రి ట్యూషన్ - మధ్యలో ఖాళీ దొరికితే లైబ్రరీ. హైస్కూల్ వరకూ చదువు బాగానే సాగింది.

టీనేజ్ లో మనల్ని ప్రభావితం చేసే అంశాలే మన జీవితగమనాన్ని నిర్దేశిస్తాయంటారు. ఎలిమెంటరీ స్కూల్ మాస్టర్ జీవరత్నం గారబ్బాయి బుల్లిబాబు నా క్లాస్ మేట్. తెలిసీతెలియని వయసులో సినిమా అనే బీజాక్షరాలు నాలో నాటుకోవడానికి మొదటి కారకుడిగా అతన్నే చెప్పుకోవాలి. వాళ్ళ మేనమామ రాజారెడ్డి హైదరాబాద్ లో సినీపరిశ్రమ వేళ్ళూనకముందునుంచే ప్రయత్నాలు చేస్తుండేవాడని చెవిలో ఇల్లు కట్టుకొని చెబుతుండేవాడు. అలా ప్రారంభమైన ఇంటరెస్టు తప్పటడుగులేసుకుంటూ కథల్లోకి, కవితల్లోకి, నవలల్లోకి ఎంటరై నాటకాల్లోకి నడుచుకుంటూ వెళ్ళిపోయింది. చదువు తడబడి అత్తెసరు మార్కులతో స్కూల్ ఫైనల్ అయిందనిపించాం. అసలు ప్రస్థానం ఇప్పుడే ఆరంభం అయింది.

అప్పుడే రెక్కలొొచ్చిన పక్షులు ఎగరడంలో ఉన్న ఆనందాన్ని, స్వేచ్ఛలో ఉన్న అనుభూతిని ఫీలయినట్టే అనిపించింది కాలేజ్ కి వెళ్ళిన కొత్తలో. మా సినిమా వాళ్ళమీద కొన్ని జోకులున్నాయిలెండి. వాటిలో ఒకటి డాక్టరవ్వబోయి యాక్టర్నయ్యాననేది. జోకనుకోకపోతే నేను నిజంగానే డాక్టర్నవుదామనుకొని డైరక్టర్నయ్యాను - ఒట్టండీ.. దానికి నిదర్శనం నేను ఇంటర్ లో బైపీసీ తీసుకోవడమే. ఇంకా అసలు విషయానికొస్తే ఇక్కడినుంచీ చదువేమో బ్యాక్ బెంచీకి సినిమా ఫ్రంట్ సీటుకీ షిఫ్టయ్యాయి. మా ఇంట్లో వాళ్ళకి నా పరిస్థితి అర్థమయింది. చాలా తర్జన భర్జనల తర్వాత నా మకాం మద్రాసుకి నా ప్రస్థానం సినిమాల్లోకి. దీనివెనక సోదరతుల్యులు శ్రేయోభిలాషి కందిమల్ల నారాయణమూర్తి గారి ప్రోత్సాహం అన్నయ్య వెంకట్రావు పెదనాన్న కొడుకు స్వాములు అన్నయ్య సహకారం ఎంతోఉంది.



ఆరోజు మార్చి 25,1984 ఎర్రబస్సు కాదుగానీ ఆర్టీసీ లోనే మద్రాసు ప్రయాణం. అదేమో మహానగరం, మనదేమో మిడిమిడి జ్ఞానం. అందుకే ముందు జాగ్రత్తగా మావూరి వాత్సవ్యుడు, మాకు సీనియర్ ఇంటూరి రామారావు రూంలో అరంగేట్రం. ఇక్కడి డ్రీములకీ అక్కడి ప్రాక్టికాలిటీకీ పొంతన కుదరలా. అభిమాన దర్శకుడు రాఘవేంద్రరావు గారు స్వాగతం పలుకుతారనుకుంటే అక్కడ నోవేకెన్సీ. ఓ ఫైనాన్షియర్ దగ్గర పనిచేసే సూర్యనారాయణ గారేమో నాకు రిఫరెన్సు, రికమండేషనూ. ఐనాపని గాలే. అప్పుడు కలల్లోంచి వాస్తవంలోకొచ్చి మనం కావాలనుకున్నది మనకు దొరకనప్పుడు దొరికినదాన్ని మనకనుకూలంగా మార్చుకోవాలనుకున్నా.

టి.కృష్ణ గారు నేటిభారతంతో వెలుగులోకొచ్చిన కొత్త. కే నారాయణమూర్తి గారితో ఆయన పరిచయం పరిషత్తుల కాలం నాటిది. 'దేశంలో దొంగలు పడ్డారు' టైంలో కలిస్తే నెక్స్ట్ పిక్చర్ కి పెట్టుకుంటానని ప్రామిస్ చేశారు. ***అలా 'వందేమాతరం' అసిస్టెంట్ డైరక్టర్ గా నామొదటి సినిమా.*** సైమల్టేనియస్ గా 'దేవాలయం' కు కూడా పనిచేశాను. అప్పుడక్కడ ముత్యాల సుబ్బయ్యగారు కోడైరక్టర్. పని నేర్చుకోవడానికి ఆయన సహకారం నాకు బాగా హెల్ప్ అయింది. 'రేపటిపౌరులు' నామూడోచిత్రం. అప్రెంటిస్ అసిస్టెంట్ నుంచి అసోసియేట్‌గా ప్రమోషనూ.

అంతా సవ్యంగా వుందనుకునేలోపు అపశృతి టి.కృష్ణ గారి మరణం. నాకేకాదు తెలుగుసినిమా ఇండస్ట్రీకే అది తీరనిలోటు. డిప్రెషను, ఏమిచేయాలో పాలుపోని స్థితి. అదే పరిస్థితి ఆయన మిత్రుడు,పార్టనర్ పోకూరి బాబూరావు గారిదికూడా. కష్టాల్లో ఉన్న ఇద్దరం ఒకరికొకరు తోడు. అప్పుడే ఈతరం ఫిలింస్ లో పరచూరి బ్రదర్స్ డైరెక్షన్‌లో 'ప్రజాస్వామ్యం' ఆరంభం. అక్కడినుంచి ఈతరం ఫిలింస్‌లో కోడైరక్టర్ నేనే. కొన్నిచిత్రాలకి ముప్పలనేని శివ,నేను ఇద్దరం కలసి పనిచేశాం. గ్యాపొచ్చినప్పుడల్లా బయటి దర్శకులదగ్గర కొన్నిచిత్రాలకు పనిచేశాను.

బి. గోపాల్ గారిదగ్గర 'అశ్వత్థామ','స్టేట్ రౌడీ', 'చినరాయుడు', ఐవీ శశి దగ్గర 'మాఆయన బంగారం', ఏ మోహనగాంధీ గారిదగ్గర 'కర్తవ్యం' అలాచేసినవే. అప్పట్లోనే బాబూరావు గారు తన మేనకోడలు సునీతతో పెళ్ళిగురించిన ప్రపోజల్ చెప్పడం, చూడ్డం, నచ్చటం వెంటనే పెళ్ళి జరిగిపోయాయి. ముత్యాల సుబ్బయ్య గారితోకలసి 'మామగారు' అనే చిత్రానికి పనిచేస్తున్నప్పుడే ఎడిటర్ మోహన్ గారితో పరిచయం. ఆసినిమాలో ఒక నైట్ సాంగ్ షూట్ చేస్తున్నప్పుడు ఆయన నన్ను పిలిచి ' ఫుల్ మూన్ చాలా బాగుంది మాష్టారుతోచెప్పి మూన్ కూడా ఫ్రేం లోవచ్చేలా కంపోజ్ చెయ్యి' మని నాతోచెప్పారు. ' నేను అదేంటిసార్ ఇది అమావాస్య రోజు వచ్చే దీపావళి సాంగ్

కదా దీనిలో మూన్ ఎలా కంపోజ్ చేస్తాం' అన్నాను. ఆయన నవ్వేసి ' నీకో చిన్న టెస్ట్ పెట్టానయ్యా' అన్నారు. అలా ఆ చిత్రం జరిగేటప్పుడు నాప్రవర్తన, పనితీరు గమనించి ' నిన్ను నాబ్యానర్ లో డైరక్టర్‌ని చేస్తానయ్యా' అని ప్రామిస్ చేశారు.

మళ్ళీ బి.గోపాల్ గారిదగ్గర పని చేయడానికెళ్ళాను. అప్పుడే వెంకటేష్ బాబు గారితో పరిచయం. ఆయన నా వర్క్ చూసి ఇంప్రెస్ అయి రామానాయుడి గారితో చెప్పడంతో ఆయన నాకు కబురుచేశారు. ' నీగురించి చాలా విన్నానయ్యా, మనిద్దరికీ అండర్ స్టాండింగ్ రావడానికి నాబ్యానర్ లో ఓ పిక్చర్ కి కోడైరక్టర్ గా పనిచెయ్యి నెక్స్ట్ పిక్చర్ కి నిన్ను డైరక్టర్ ని చేస్తాన' ని చెప్పారు. అలా పరువు ప్రతిష్ఠ కి పనిచేశాను. గుహనాధన్ గారు దానికి డైరక్టర్. అలాగే ఆసినిమా హిట్టవడం, నా వర్క్ నాయుడుగారికి నచ్చడం, ఆయన 'సబ్జెక్ట్ చూసుకోవయ్యా' అని చెప్పడం జరిగిపోయాయి.

నేను ఆప్రయత్నాల్లో ఉండగానే ఎడిటర్ మోహన్ గారి దగ్గర్నుండి కబురు. ముత్యాల సుబ్బయ్యగారి దర్శకత్వంలో 'పల్నాటి పౌరుషం' అనే సినిమాకి పనిచెయ్యమని. ఆయన నెక్స్ట్ పిక్చర్ ప్రామిస్ చేశారు. చేశాను కానీ ఆసినిమా దెబ్బతినటంతో ఆయన అప్‌సెట్ అయ్యారు. నేను కొంతకాలం ఆయన్ని ఫేస్ చెయ్యలేకపోయాను. అసలే ఇప్పుడు సినిమా దెబ్బతింది దానికి తగ్గట్టు కొత్త డైరక్టర్ తో సినిమా అంటే కష్టం గదాని. కాని ఆయన ఇచ్చిన మాట మీద నిలబడి నాకు కబురుచేసి సబ్జెక్ట్ చూడమన్నారు. ఈవిషయంలో వాళ్ళ పెద్దబ్బాయి రాజా నాకు చాలా సపోర్ట్ చేశాడు. ఆయన కూడా ఇప్పుడు డైరక్టర్ అయ్యాడనుకోండి. అలా వెతికి పట్టుకున్నదే 'శుభమస్తు' సబ్జెక్ట్.



రెండు పెద్ద బ్యానర్లు ఇద్దరు మంచి నిర్మాతల మధ్య నా మొదటి సినిమా అలా దోబూచులాడింది. మోహన్ గారి సబ్జెక్ట్ ఓకే అవ్వడంతో విషయం నాయుడిగారికి చెప్పాను. ఆయన 'ఏంటయ్యా నాబ్యానర్ లో డైరక్టర్ నిచేస్తానంటే ఇంతవరకూ ఎదురు చెప్పినవాళ్ళు లేరు నువ్వేమో వేరే ప్రపోజల్ గురించి చెబుతున్నావు నీయిష్టం ఆలోచించుకో' అన్నారు. సబ్జెక్ట్ నచ్చడంతో ఆయనకు సారీ చెప్పి 'శుభమస్తు' మొదలు పెట్టాను. జగపతిబాబుగారు హీరో. ఆమని, ఇంద్రజ హీరోయిన్స్. దాసరిగారు, సత్యనారాయణ గారు కీ రోల్స్. అలా ప్రారంభమైన నా మొదటి సినిమా ప్రస్థానం ఆ సినిమా హిట్‌తో సక్సెస్ ఫుల్ గా 'శుభాకాంక్షలు', 'సుస్వాగతం', 'సూర్యవంశం' లాంటి చిత్రాలతో కొనసాగింది. ఆతర్వాత కెరీర్ లో ఒడిదుడుకులు. 'సుప్రభాతం', 'స్వప్నలోకం' అనుకున్న ఫలితాల్నివ్వలేదు. పడిన కెరటం మళ్ళీ లేస్తుంది. అలా పుంజుకుని సొంత బ్యానర్ స్థాపించి 'నీతోడు కావాలి' అనే చిత్రం చేశాను. అది



బాక్సాఫీస్ సక్సెస్ సాధించలేకపోయినా నాలో కొంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఆ తర్వాత రవితేజ హీరోగా సొంతబ్యానర్ గుడ్‌విల్ సినిమాలో 'దొంగోడు' సక్సెస్. ఇప్పుడు సూపర్ గుడ్ ఫిలింస్ లో పవన్ కల్యాణ్ హీరోగా 'అన్నవరం' సక్సెస్. చేసింది మొత్తం 9 సినిమాలు వాటిలో 6 సూపర్ హిట్స్. నెక్స్ట్ పిక్చర్ స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. నాకు పెద్ద టార్గెట్స్ ఏమీలేవు. దర్శకుడిగా కావాలనుకున్నాను అయ్యాను. ఇలా మీరు ఆదరిస్తున్నంతకాలం నాకు ఓపికున్నంతకాలం ఫీల్డ్ లో కొనసాగుతూ మంచి చిత్రాలు చేయాలన్నదే నాతపన. ఎందుకంటే నాకు తిండి తిప్పలు నీళ్ళు నిద్ర విశ్రాంతి సర్వం సినిమాలే.

**Featured in April 2007**

# ఆర్.నారాయణ మూర్తి

*ఆవేశం అతని మారుపేరు..విప్లవపంథా అతని జీవన మార్గం.. ప్రజా సమస్యలే అతని సినిమాకి కథా వస్తువులు..మామూలు ప్రజలే అతని సినిమాలో పాత్రధారులు..జేబులో చిల్లిగవ్వ లేకుండానే నిర్మాతా, దర్శకుడుగా మొదటి సినిమా నిర్మించిన కళాజీవి.. ఆర్. నారాయణ మూర్తి. తెలుగు సినిమా చరిత్రలో తనకంటూ ఒక అధ్యాయాన్ని రాసుకోగలిగిన నిబద్ధత గల కళాకారుడు.. ఆయన మొదటి సినిమా అనుభవాలు.. ఆయన మాటల్లోనే..*



మాది తూర్పుగోదావరి జిల్లాలోని మల్లంపేట. అమ్మ పేరు రెడ్డి చిట్టెమ్మ నాన్న పేరు రెడ్డి చిన్నయ్య నాయుడు.. మాది అతి సాధారణ రైతు కుటుంబం. మా అమ్మానాన్నలు నాకిచ్చిన పెద్ద వరం నన్ను బి.ఎ. చదివించడం. మా వూరునుంచీ బి.ఎ చదివింది నేను ఒక్కడినే రోజుల్లో..

చిన్నప్పటినుంచీ సినిమాలంటే మహా పిచ్చి. అలానే విద్యార్థి దశలోనే వామపక్ష సిద్ధాంతాలవైపు ఆకర్షించబడ్డాను. ఇప్పటికీ నా భావాల్లో ఏ మాత్రం మార్పులేకుండా అవే నమ్మిన సిద్ధాంతాలకి కట్టుబడి జీవిస్తున్నాను. నా కాలేజీ చదువు పెద్దాపురం ఎమ్.ఆర్ కాలేజీలో సాగింది. హైస్కూలు నుంచీ కూడా క్లాసులీడర్ గానూ, కల్చరల్ కమిటీ సెక్రటరీ గానూ ఏదో ఒక పదవిలో వుంటూ తోటి విద్యార్థులని ముందుకి నడిపించడంలో ముఖ్య పాత్ర వహిస్తూ ఉండేవాడిని.

సినిమా పిచ్చి తోటి 1972 లోనే ఇంటర్మీడియట్ పరీక్షలవ్వగానే ఎలాగైనా పరీక్షలో తప్పేది ఖాయం అనుకుని మద్రాసు వెళ్ళిపోయాను. 17-18 ఏళ్ళ వయసు. మహానగరంలో ఎవరూ తెలీదు. మనసులో ఉందల్లా సినిమాల్లో వేషాలు వెయ్యాలని అంతే.. పక్కా సినిమా కష్టలు మొదలయ్యాయి..తిండి లేదు..వసతి లేదు.. ఐనా ఏదో - ఆశ..అక్కడక్కడ తింటూ, లేని రోజు పస్తుంటూ, రోడ్డు పక్కనే ఏ చెట్టుకిందనో పడుకుంటూ..రోజులు గడుస్తుండగా, ఒక రోజు హఠాత్తుగా పేపర్ లో పరీక్షా ఫలితాలు చూసి ఇంటర్మీడియట్ లో పాసయ్యానని తెలుసుకున్నాను. సరే ఇక్కడా ఏమీ అవకాశాలు రావడంలేదుకదా.. పాసయ్యాను కాబట్టి వెనక్కి




వెళ్ళి బి.ఎ. చదువుదామని నిర్ణయించుకుని తిరిగి పెద్దాపురం వెళ్ళిపోయాను. సినిమా పోస్టర్లలో ఎన్.టి.రామారావు బి.ఎ అని చదివినప్పుడల్లా ఎలాగైనా బి.ఎ డిగ్రీ చదివి తరువాత సినిమాల్లోకి వెళ్ళాలని అనుకునేవాడిని.

ఆ విధంగా పెద్దాపురం కాలేజీలోనే బి.ఎ మొదలుపెట్టాను. ఎక్స్ట్రా కల్చరల్ యాక్టివిటీస్‌లో మహా చురుకుగా పాల్గొనేవాడిని. కాలేజీలో ఏ కార్యక్రమం జరిగినా మా బృందం కార్యక్రమం ఒకటి ఉండాలంతే.. మరో పక్క కమ్యూనిస్ట్ పుస్తకాలు కూడా బాగా చదువుతుండే వాడిని.. సినిమా పిచ్చి మాత్రం లోపల తొలుస్తూనే ఉండేది. ఒకసారి కాలేజీలో అప్పటి హీరోయిన్ మంజుల గారి నృత్య కార్యక్రమం ఏర్పాటు చెయ్యడంలో నేను ముఖ్యపాత్ర వహించాను. ఏదో ఒక రోజు నేనుకూడా సినిమాల్లోకి వెళ్ళి, సినిమా తారలకున్న క్రేజ్ కొంచెమైనా తెచ్చుకోవాలనుకునే ఆలోచన మాత్రం నాలో నుంచీ చెరిగిపోలేదు. అలానే రాజకీయ కార్యక్రమాలు కూడా. ఎమర్జన్సీ రోజుల్లో ఎమ్మెల్లే డా.సి.వి.కె రావు గారూ నేనూ ఒకే వేదికమీదనుంచీ మాట్లాడిన సందర్భం కూడా వుంది.

ఇంక బి.ఎ పూర్తి కావడమే తరువాయి.. మద్రాసు ప్రయాణం కట్టాను.. ఎప్పుడో మూడు నాలుగేళ్ళ క్రిందట వచ్చిన అనుభవమే మద్రాసుకి. ఐతే ఈ సారి బి.ఎ డిగ్రీ ఉంది కాబట్టి నాకు వేషాలు చాలా ఈజీగా దొరుకుతాయి..ఏముందీ ఎవరు పడితే వాళ్ళు పిలిచి నాకు హీరో వేషం ఇస్తారు అనుకుంటూ మద్రాసులో అడుగుపెట్టాను..పరిస్థితిలో ఏమీ మార్పులేదు.. ఎవ్వరూ నన్ను పలకరించిన పాపాన పోలేదు. ఎందుకు పలకరించాలీ..నేనేమంత గొప్ప పర్సనాలిటీనీ..? ఐనా వయసు , సినిమా మత్తు అలాంటిది.. పంపునీళ్ళే కడుపు నింపేవి.. పాండి బజారు చెట్లే రాత్రిపూట ఆశ్రయమిచ్చేవి.. అలా కష్టాలు పడుతూనే రోజూ స్టూడియోల చుట్టూ తిరిగితే ఒకటి అరా జూనియర్ ఆర్టిస్ట్‌గా అవకాశాలు దొరికాయి..పొలాల్లో పనిచేసేవాళ్ళల్లో ఒకడిగా, కాలేజీ స్టూడెంట్స్ లో ఒకడిగా, ఊరేగింపు లో వెనకాలా..ఇలా అన్నీ గుంపులో గోవిందా వేషాలే.. అవి కూడా షూటింగ్ రోజు మాత్రమే తిండి పెట్టగలిగేవి.. ఆ రోజుల్లోనే దాసరి నారాయణరావు గారి పరిచయం నా బ్రతుకుని ఒక మలుపు తిప్పింది.



ఆ మహానుభావుడు నాలోని కళాతృష్ణని ఎలా కనిపెట్ట గలిగారో కానీ పరిచయం కాగానే రమేష్ బాబు హీరోగా ఆయన తీస్తున్న 'నీడ' చిత్రంలో నాకు ప్రాధాన్యత ఉన్న వేషాన్నిచ్చారు. రామినేని సాంబశివరావు, డాక్టర్ రామకోటేశ్వర రావు గార్లు నిర్మాతలు నన్ను చాలా ఆత్మీయంగా చూసుకునే వారు. ఆ సినిమాలో పాత్ర నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. తరువాత రామానాయుడు గారు, జయ కృష్ణగారు ..లాంటి వారు ఆదరించి వారి సినిమాల్లో చిన్న, చిన్న పాత్రలనిచ్చి ప్రోత్సహించారు. అదే రోజుల్లో మళ్ళీ దాసరిగారే తను తీసిన 'సంగీత ' సినిమాలో హీరో కి సరితూగే వేషాన్నిచ్చారు.. సినిమా బాగానే ఆడింది కానీ ఎందుకో నాకు ఎక్కువగా గుర్తింపు వున్న వేషాలు రాలేదు. సినిమాల్లో వేషాలు వేసినన్ని రోజులూ ఫరవాలేదు కానీ లేని రోజుల్లో పస్తులు





మామూలే అయ్యాయి.. మళ్ళీ చిన్న, చిన్న వేషాలు వెయ్య బుద్ధి కాలేదు..అలాగని పెద్ద వేషాలు రావడంలేదు..ఇంటికి తిరిగి వెళ్దామా అంటే మొహం చెల్లలేదు. పూటగడవడమా కష్టంగా వుంది.. ఏమి చెయ్యాలా అని ఆలోచించాను..

ఎలాగైనా హీరోగా నిలబడాలంటే..నేనే డైరెక్టర్ నైతే బావుంటుందని ఆలోచన వచ్చింది. జేబులో చిల్లి గవ్వలేదు.. డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో కూడా ఎక్కడా పనిచెయ్యలేదు.. ఏం చెయ్యాలి..ఎలా సాధించాలి !? నిర్మాతగా ఎవరు ముందుకొస్తారు.. సరే నేనే నిర్మాతని అవుదామని 1984 లో స్నేహచిత్ర బానర్‌ని మొదలుపెట్టి మిత్రుల సహాయంతో, ఇండస్ట్రీలోని కొంతమంది పెద్దల సహకారంతో కొంతపెట్టుబడిని సమకూర్చుకుని నేనే నిర్మాత. దర్శకుడు, హీరోగా మొదటి సినిమా మొదలుపెట్టాను. ..అప్పట్లో నా సాహసానికి చాలా మంది నివ్వెరపోయారు.. నేను సినిమా పూర్తిచేస్తానన్న నమ్మకం ఎవరికీ లేదు.. నేను నమ్ముకున్న మిత్రులు మాత్రం నాకు పూర్తి అండగా నిలబడ్డారు. గురువు దాసరి నారాయణరావుగారి పనితనాన్ని గమనించిన జ్ఞానం, ఆదుర్తి సుబ్బారావు, కె.వి.రెడ్డి గార్ల సినిమాలు విపరీతంగా చూసిన అనుభవంతో దర్శకత్వానికి పూనుకున్నాను. కథాంశం విషయానికొస్తే ముందే చెప్పినట్లు ప్రజా ఉద్యమాలన్నా, వామపక్ష సిద్ధాంతాలన్నా ఆసక్తి, అనుభవం ఉన్నవాడిని కాబట్టి ప్రజలకి దగ్గరగా వుండే కథనే సినిమాగా తియ్యాలని నిర్ణయించుకుని, నక్సల్‌బరీ ఉద్యమం నేపథ్యంలో **'అర్ధరాత్రి స్వతంత్రం'** మొదలుపెట్టడం జరిగింది. ప్రారంభమైతే జరిగింది కానీ..ఒక్కో దశనీ దాటుకుంటూ సినిమా పూర్తి చెయ్యడానికి ఒక సంవత్సరంన్నర పాటు పట్టింది.

అప్పుడు మొదలైంది అసలు కథ సెన్సారు సమస్య.. దాదాపు ఆరునెలలు పట్టింది సెన్సారు కత్తెర నుంచీ బయట పడడానికి.. ఇందుకోసం ఎంతోమంది నాకు సహాయం చేశారు. సినిమా 1986 నవంబర్ లో విడుదలైంది. సినిమాకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇండస్ట్రీలోని పెద్దలుకూడ నన్ను అభినందించారు.. ఐతే రిలీజ్ ఐన కొత్తలో కొన్ని రోజులు సినిమా కథ నక్సలైట్ ఉద్యమాన్ని బలపరిచేలా వుందని చాలా కాంట్రవర్సీలు వచ్చాయి. కొన్ని రాజకీయపార్టీలైతే రీ-సెన్సారు చెయ్యాలని కూడ ఒత్తిడి తెచ్చారు. ఐతే నిర్ణయం ప్రేక్షకులదేనని వాళ్ళు వదిలేశారు.. సినిమా దాదాపు సంవత్సరం పాటు ఆడింది.. కొంతమంది 'ఆంధ్రా సత్యజిత్ రాయ్ ' అని పిలిచేవాళ్ళు.. అదీ నా మొదటి సినిమా అనుభవం. నా మీద నమ్మకంతో నాకు ఆర్థిక సహకారం అందించిన మిత్రులూ, పరిశ్రమలోని పెద్దలని మాత్రం ఎప్పటికీ మరచిపోలేను..గత 20 సంవత్సరాలుగా మధ్య మధ్యలో కొన్ని సినిమాలు దెబ్బతిన్నా, ఏ మాత్రం నా ఆశయాలని వదులుకోకుండా, అవే భావాలతో సినిమాలు నిర్మిస్తూ వస్తున్నాను.. ప్రేక్షకులు ఆదరించినంత కాలం నా సినీ ప్రస్థానం కొనసాగుతూనే ఉంటుంది.



**Featured in May 2007**

# సాగర్

తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ కి అధ్యక్షుడిగా ఉన్న సాగర్ తెలుగు చలనచిత్రసీమలో సీనియర్ డైరెక్టర్. దాదాపు ३० సినిమాలకు దర్శకత్వం వహించిన సాగర్ లిస్టులో 'అమ్మదొంగా', 'అమ్మ నాకోడలా', ఓసి నా మరదలా. లాంటి హిట్ సినిమాలు చాలా వున్నాయి. ఆయన నిర్మించి దర్శకత్వం వహించిన రామసక్కనోడుకి మూడు నంది అవార్డులు కూడా వచ్చాయి. సాగర్ గారు దర్శకత్వం వహించిన పైసాలో పరమాత్మ విడుదలకి సిద్ధంగా వుంది. ఆయన నిర్మాతగా రూపొందిన 'ఆశల పల్లకి' ఫిల్మ్ ఫెస్టివల్స్ లో మంచి పేరు తెచ్చుకుంది. ఈ తరం దర్శకులైన శ్రీను వైట్ల, రవి కుమార్ చౌదరి లాంటి వారు చాలా మంది సాగర్ గారి వద్ద శిష్యరికం చేసిన వారే.. ఆయన మొదటి సినిమా జ్ఞా పకాలు ఈ నెల కౌముది కోసం ప్రత్యేకం..



మాది మంగళగిరి వద్ద నిడమర్రు అనే గ్రామం. నాన్న నాగిరెడ్డిగారు వూరికి మున్సబుగా పనిచేస్తుండే వారు. నేను మార్చి 1, 1952 న పుట్టాను. మాకు విజయవాడలో గవర్నర్ పేటలో ప్రోపర్టీలు వుండేవి అప్పట్లో. మద్రాసు లో చదువులు బావుంటాయన్న వుద్దేశంతో అమ్మ, అమ్మమ్మా, నన్నూ, అన్నయ్యా, చెల్లెళ్ళూ, తమ్ముళ్ళనీ తీసుకుని మద్రాసు లో కాపురం పెట్టారు. మద్రాసులో తేనాంపేట లో వుంటూ నేను కేసరి హైస్కూల్లో చదువుకుంటూ వుండేవాడిని. స్కూల్లో ఉండగా బయట యాక్టివిటీస్ లో చాలా చురుకుగా పాల్గొంటూ వుండేవాడిని. అప్పట్లో తెలుగు వాళ్ళకీ, తమిళ పిల్లలకీ పెద్దగా పడేది కాదు. పైగా ఆంధ్రా నుంచీ వచ్చే తెలుగు వాళ్ళని లోకల్స్ బాగా ఏడిపించడానికి ప్రయత్నించేవాళ్ళు. అలాంటి వాటిని వ్యతిరేకిస్తూ అక్కడికి వచ్చిన మన తెలుగు పిల్లలకి భరోసాగా వుండేవాళ్ళం. అల్లు అరవింద్ గారు అప్పట్లో మాకు సీనియర్... ఇంకా చాలా మంది సినిమా వాళ్ళ పిల్లలు మా స్కూల్లోనే చదువుకుంటూ వుండేవాళ్ళు.

1969 మే నెలలో ఎస్సెల్సీ పాసయ్యాను. ఐతే తరువాత చదువుల మీద అంత ఆసక్తి చూపించలేదు.. అలా ఖాళీ గా తిరుగుతున్న నన్ను ఎక్కడైనా సెటిల్ చెయ్యాలని మా కుటుంబానికి సన్నిహితుడైన ఒక 'పెద్ద మనిషి' ని అమ్మ ఓ రోజు అడిగిందట..' బాబూ..నువ్వేదో సినిమాల్లో ఎడిటింగ్ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్నావట గదా.. మా సాగర్ ఖాళీ గా వున్నాడు.. వాడికి నీతోబాటు ఎక్కడైనా చిన్న అవకాశం ఇప్పించరాదూ?' అని. దానికతను ' అమ్మా. ఎడిటింగ్ డిపార్ట్మెంట్ లో చేరాలంటే చాలా మంచి గుణాలు ఉండాలి. సహనం, ఓర్పు, అందరితో కలిసిపోయే మనస్తత్వం ఉండాలి. మీవాడిలా దూకుడు స్వభావం వున్నవాళ్ళు అక్కడ ఇమడలేరు..' అని నా గురించి ఒక ఉచిత సర్టిఫికెట్ ఇచ్చి వెళ్ళాడట..


ఆ రోజు రాత్రి నేను ఇంటికి తిరిగివచ్చాక అమ్మని చూస్తే ఎందుకో చాలా దిగులుగా వున్నట్లనిపించి అడిగాను ..'' అమ్మా ఏం జరిగింది..ఎందుకలా డల్ గా వున్నావు'' అని. '' ఇంతకాలం నీగురించి తెలీని విషయాలు చాలా తెలుసుకున్నానురా.. '' అంటూ జరిగిన విషయం చెప్పి '' నీకు అవకాశం రాలేదన్న బాధకంటే నిన్ను అతను నానా మాటలు అన్నందుకు చాలా బాధ వేసింది'' అంది.

ఆ మాటలు నాలో పట్టుదల పెంచాయి. నేను ఎందుకూ పనికిరానన్న పెద్ద మనిషి పనిచేసే సినీ ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్ లోనే చేరిమంచి పేరు తెచ్చుకుని ఆ 'పెద్ద మనిషి' కి గుణపాఠం నేర్పాలి అనుకున్నాను. నాకున్న పరిచయాలతో అప్పట్లో ప్రముఖ నిర్మాణ సంస్థ మధు పిక్చర్స్ మల్లికార్జునరావు తమ్ముడు శ్రీహరి గారి వద్ద ఇంటి గౌరవం అనే సినిమాకి ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్ లో సహాయకుడిగా చేరాను.సరిగ్గా చెప్పాలంటే చలన చిత్ర రంగంలో నా మొట్టమొదటి సినిమా ఈ 'ఇంటిగౌరవం' ఔతుంది..! పట్టుదలతో చేరాను కాబట్టి రోజుకి దాదాపు 18 గంటలు కష్టపడి పనిచేసేవాడిని. అక్కడే ఎడిటింగ్ రూమ్ ఇన్-ఛార్జ్‌గా కూడా నన్ను ఉండమనడంతో కేవలం శ్రీహరి గారి చేసే సినిమాలే కాకుండా లాబ్ లో ఎడిటింగ్ జరిగే అన్ని సినిమాలకీ నేను సహాయకుడిగా వుంటూ అన్ని మెలకువలూ నేర్చుకుంటున్నాను అనుకుంటున్న సమయంలో ఒక ఆటంకం ఎదురైంది. ఒకప్పుడు నేను ఎందుకూ పనికిరానన్న పెద్ద మనిషే మళ్ళీ మా గురువు గారి వద్దకు వచ్చాడు. నాకూ, మా గురువు గారికీ మధ్య రెండు మెట్లు ఉన్నాయి. మధ్యలో ఇతడు వచ్చి చేరి మంచి పేరు తెచ్చుకుంటున్న నన్ను ఎలా అణగదొక్కాలా అని ప్రయత్నాలు మొదలు పెట్టాడు.. నాలో



రోషం పెరిగింది. స్కూలు సమయంలోనే ఎన్నో పోలిటిక్స్ లో తిరిగిన వాడిని, చివరికి వీడి పోలిటిక్స్ కి బలికావడమా..అనిపించి ఆ పనికి ఉద్వాసన చెప్పేశాను. ఆ విధంగా నా మొదటి చలన చిత్ర రంగప్రవేశం 18 నెలల తర్వాత తాత్కాలికంగా ఆగిపోయింది..!

మళ్ళీ రోడ్డుమీద పడ్డాను. ఇంటి వద్ద నుంచీ డబ్బులు వస్తాయీ, అమ్మా వాళ్ళంతా మద్రాసులోనే ఉన్నారు కాబట్టి దేనికీ ఇబ్బంది అంటు ఏమీ లేదు.. అలా వుండగా..అప్పటి ప్రముఖ నిర్మాత పుండరీకాక్షయ్య గారి అబ్బాయి నాకు మిత్రుడు. ఒకసారి కనబడి 'సాగర్..ఏం చేస్తున్నావు' అని అడిగాడు.. విషయం చెప్పాను. 'ఖాళీ గా ఎందుకూ నాన్నగారు ఒక సినిమా ప్లాన్ చేస్తున్నారు. అందులో డైరెక్షన్ డిపార్ట్‌మెంట్ లో చేరు' అని సలహా ఇచ్చి నన్ను డైరెక్టర్ వద్దకి తీసుకెళ్ళాడు. సినిమా పేరు 'మహమ్మద్ బిన్ తుగ్లక్'. దర్శకుడు బి.వి.ప్రసాద్ గారు. అప్పటికే మా అన్నయ్య బి.హెచ్. రెడ్డి బి.వి.ప్రసాద్ గారు వద్ద 'అమ్మకోసం' అనే సినిమాకి సహాయకుడిగా పనిచేసి ఉన్నాడు కాబట్టి నాకు ఆయన వద్ద సహాయకుడిగా పనిచేసే అవకాశం తేలికగానే దొరికింది. ఒక విధంగా చెప్పాలంటే దర్శకత్వ శాఖలో నాకు మొదటి సినిమా ఈ 'మహమ్మద్ బిన్ తుగ్లక్'.



ఆ విధంగా దర్శకత్వ శాఖలో నా ప్రస్థానం మొదలైంది. మా గురువుగారు బి.వి.ప్రసాద్ గారి వద్దనే 'నీడ లేని ఆడది' మొదలుకొని చాలా సినిమాలకి సహాయకుడిగా చేస్తూ కో-డైరెక్టర్ స్థాయి కి చేరుకున్నాను. వారి వద్ద నేను కో- డైరెక్టర్ గా చేసిన చివరి సినిమా 'నాయుడు గారి అబ్బాయి' అలానే కోదండరామి రెడ్డి గారి వద్ద 'కిరాయి కోటిగాడు' నేను కో-డైరెక్టర్ గా చేసిన చివరి సినిమా. విధంగా 12-13 ఏళ్ళు గడిచాయి. ఇన్ని సంవత్సరాల్లో చాలా సార్లు చాలామంది మిత్రులు నాతో సినిమాలు తీయాలని నా వద్దకి వచ్చారు కానీ నేనే వాళ్ళని 'ఇంకా నాకు సొంతంగా డైరెక్షన్ చేసే మెచ్యూరిటీ రాలేదు..సేఫ్ గా వుండడానికి వేరే పెద్ద డైరెక్టర్ తో తీయండి' అని రికమెండ్ చేసే వేరే వాళ్ళతో డైరెక్ట్ చేయించి మొత్తం ప్రోజెక్ట్ లో సహాయం చేస్తుండే వాడిని..

1980 మొదట్లో కృష్ణగారితో ఎక్కువ సినిమాలకి చేస్తున్నప్పుడే నేనూ డైరెక్షన్ చెయ్యగలనన్న నమ్మకం కలిగాక నటశేఖర సవాల్ అనే స్క్రిప్టు సిద్ధం చేసుకుని కృష్ణగారిని కలవడం జరిగింది. 'కిరాయి కోటిగాడు' హిట్ తర్వాత ఆయన చాలా బిజీ అవడంతో కొంతకాలం ఆగమని చెప్పారు. ఇంతలో విజయనిర్మల గారి వద్ద సహాయకుడిగా వుండే. విఠల్ గారు వచ్చి 'సాగర్ ..నువ్వు కృష్ణగారితో సినిమాకి ప్రయత్నిస్తున్నావని తెలిసింది.. ఆ-యన ఇంకా డేట్స్ ఇవ్వలేదు కాబట్టి ఈ లోగా నరేష్ హీరోగా నాకో సినిమా చేసిపెట్టు' అని అడిగారు. ఆ విధంగా మొదలైంది నా దర్శకత్వంలో మొదటిసినిమా 'రాకాసిలోయ'. నరేష్, విజయశాంతి, రాజేష్, అరుణ, రంగనాథ్, దీప.. మొదటిది ఎలాంటి సినిమా తీయాలి అనుకున్నప్పుడు కమ్మర్షియల్ గా సేఫ్ కావాలంటే యాక్షన్ సినిమానే బెటర్ అనే నిర్ణయానికి వచ్చాం. ఐతే యాక్షన్ తో బాటు, ఎడ్వెంచర్ కూడా తోడైతే బావుటుందని రాకాసి లోయ సినిమా ఎన్నుకోవడం జరిగింది.



ఈ రాకాసి లోయ కథ వెనుక ఒక చిన్న తమాషా వుంది. మేము స్కూలు రోజుల్లో చదువుకునేప్పుడు చందమామ లో చదివిన సీరియల్ పేరు రాకాసిలోయ..సినిమా, దర్శకత్వం ఇలాంటివే మీ తెలీని రోజుల్లోనే స్కూలు పిల్లలం అంతా కల్సి 'అరే ఎప్పటికైనా మనం పెద్ద వాళ్ళమయ్యాక ఈ సీరియల్ ని సినిమాగా తియ్యాలి రా..' అనుకునే వాళ్ళం. ఐతే

చిన్నవయసులో మాకో అనుమానం వచ్చింది..మరి రాకాసిలోయ సినిమా తియ్యాలంటే చందమామ బొమ్మల్లో వున్న దృఢకాయులైన రాక్షసులు కావాలి కదా , మరి వాళ్ళని వెదికి తెచ్చినా వాళ్ళని ఎలా మచ్చిక చేసుకుని యాక్షన్ చేయించాలో' అని అనుమానం వస్తే మాలో ఒకడు..'ఒరేయ్ ..మనం విజయా గార్డెన్ మొత్తం అద్దెకి తీసుకుని పైన మొత్తం రూఫ్ వేయించేద్దాం. ఈ రాకాసిలోయ రాక్షసుల్ని అందులో పెట్టి పైనుంచీ హెలి కాప్టర్స్ తో ఫుడ్ వేయిద్దాం. కెమేరాలు కూడా పైనుంచీ లోనికి పంపించి షూట్ చెయ్యాలి..' అన్నాడు.. అలా వుండేవి చిన్నతనంలో మా ఆలోచనలు..

ఐతే మా రాకాసిలోయకీ చిన్నప్పటి చందమామ రాకాసిలోయ కథకీ సంబధం లేదులెండీ.. సినిమా విజయవతంగా పూర్తై 1983 లో విడుదలై కమ్మర్షియల్ గా విజయాన్ని నమోదు చేసుకుంది. అదీ దర్శకుడిగా నా మొదటిసినిమా అనుభవం. తరువాత వెంటనే సుమన్, భాను చందర్ కాంబినేషన్ తో 'డాకు' అనే సినిమా తీశాను. ఒక ఆంగ్లసినిమా స్ఫూర్తిగా తీసిన ఆ సినిమా కూడా సక్సేసే కమ్మర్షియల్ గా. అప్పుడు ఒక పొరబాటు చేశాను.. నేనే నిర్మాతగా కూడా మారి నరేష్, మనోచిత్రల కాంబినేషన్ తో 1986 లో 'మా వారి గోల' అనే కామెడీ సినిమా తీశాను. అట్టర్ ఫెయిల్యూర్ ఐన ఆ సినిమా నాకు పెద్ద సెట్ బాక్. నిర్మాతని కూడా నేనే అవడం వల్ల తరువాత చాలా ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. సినిమా ఫెయిలైతే నిర్మాత బాధలు ఎలా వుంటాయో అప్పుడు తెలిసింది.. సినిమా ఫెయిలైతే దర్శకుడు కష్టపడి ఎలాగైనా మరో ఛాన్స్ తెచ్చుకోవచ్చు కానీ, నిర్మాత దెబ్బతింటే కోలుకోవడం చాలా కష్టం అని స్వయంగా తెలుసుకున్నాక ఇంక నేను సినిమాలు ఎలానూ తియ్యలేను, కాకుంటే డైరెక్షన్ చేసి మరొకర్ని ఇరుకున పెట్టడం మంచిది కాదని ఒక నిర్ణయానికి వచ్చి అస్త్ర సన్యాసం చేశాను..!

అలా మూడేళ్ళు గడిచాక జయసింహా రెడ్డి అని చాలా మంచి మిత్రుడూ, నాకు శ్రేయోభిలాషీ, ఒకసారి కల్సి 'సాగర్..నువ్వు యాక్షన్ సినిమాలు తీసి సక్సెస్ అయ్యావు. అనవసరంగా కామెడీ తీసి చేతులు కాల్చుకున్నావు.. మళ్ళీ యాక్షన్ ఎందుకు ట్రై చెయ్యకూడదూ.." అని నాలో ఆత్మవిశ్వాసాన్ని నూరిపోశాడు.. ఆ ఇన్స్పిరేషన్ తో 1989 ప్రాంతాల్లో భానుచందర్ తో 'స్టూవర్టుపురం దొంగలు' అనే సినిమా తీశాను.. ఒక విధంగా చెప్పాలంటే నా సెకండ్ ఇన్నింగ్స్ లో మొదటి సినిమా ఈ 'స్టూవర్ట్ పురం దొంగలు'. 1990 జనవరి 9న రిలీజైంది. అంతకు వారం ముందే చిరంజీవి గారి 'స్టూవర్ట్ పురం పోలీస్ స్టేషన్' విడుదలైంది. ఆ సమయంలో అటూ ఇటూ గా అదే టైటిల్ తో వున్న మా చిన్న సినిమా రిలీజ్ చెయ్యడం సాహసమే కానీ అనూహ్యంగా మా సినిమా ఘన విజయం సాధించింది, అప్పట్లో ఒక పేపర్ వాళ్ళు ' దొంగల్ని చూసి పారిపోయిన పోలీసులు' అని రాసింది కూడా.. ఈ విధంగా 1990 లో సెకండ్ ఇన్నింగ్స్ లో లభించిన 'స్టూవర్ట్‌పురం దొంగలు' విజయం తరువాత వెనక్కి తిరిగి చూసుకునే అవసరం రాలేదు.. తరువాత నేను తీసిన సినిమాలన్నీ అసభ్యతకి తావు లేకుండా ఫేమిలీ కథా చిత్రాలు గా పేరు తెచ్చుకోవడం నాకెంతో తృప్తినిచ్చింది. అలానే నా వద్ద శిష్యరికం చేసి ఈ తరంలో ఘన విజయాలు సాధిస్తున్న యువ దర్శకుల్ని గమనించినప్పుడు కూడా నాకు ఎంతో ఆనందంగా వుంటుంది.

**Featured in June 2007**

# శ్రీను వైట్ల

ఏడేళ్ళ క్రిందట 'నీకోసం' సినిమాతో దర్శకుడిగా తెలుగు ప్రేక్షకులకి పరిచయమై, మొదటి సినిమాకే ఏడు నంది బహుమతుల్ని గెలుచుకుని, 'ఎవరీ సరికొత్త టేకింగ్ ఉన్న కుర్రాడూ.. !?' అని అందరి దృష్టినీ అకర్షించిన శ్రీను వైట్ల 'ఆనందం' తో ఎంత సక్సెస్ సాధించారో అందరికీ తెలుసు. అప్పటినుంచీ ఇటీవలే విడుదలైన ఢీ, దుబాయ్ శీను వరకూ తన విజయ యాత్ర (మధ్యలో వచ్చిన అందరివాడు, సొంతం మినహాయించి) కొనసాగిస్తున్న శ్రీను వైట్ల గారు తన మొదటి సినిమా జ్ఞా పకాల్ని ఇలా పంచుకుంటున్నారు.



మాది తూర్పు గోదావరి జిల్లా లో రామచంద్రాపురం దగ్గర ఉన్న కందులపాలెం అనే పల్లెటూరు. నాన్నగారు వ్యవసాయం చేసేవాళ్ళు. నాన్న వాళ్ళు ఐదుగురు అన్నదమ్ములు..వాళ్ళు, అత్తయ్యలూ.అందరూ కలిసి చాలా పెద్ద ఫేమిలీ. అందరి మధ్యలో నా బాల్యం సరదాగా గడిచిపోయింది. ఎప్పుడు ఎలా మొదలైందో తెలీదు కానీ చిన్నప్పటినుంచీ సినిమాలంటే విపరీతమైన పిచ్చి. ఎప్పటికైనా సినిమాల్లోకి వెళ్ళిపోయి ఏదో చెయ్యాలనే అలోచన చిన్నప్పటినుంచే ఉండేది.. ఏమి చెయ్యాలో తెలీదు, అది ఎలా సాధ్యపడుతుందో కూడా ఆ- లోచించలేని వయసు. పైగా మాదొక చిన్న పల్లెటూరు, సినిమా రంగమంతా ఉండేది మద్రాసులో..అస్సలు ఎక్కడా పొసగని దూరాలు. ఐనా నా అలోచనలన్నీ సినిమాలచుట్టూనే తిరుగుతుండేవి..

ఇంటర్మీడియట్‌కి వచ్చే సరికి, 1984లో, కాకినాడ వెళ్ళి చదువుకుంటానని ప్రపోజల్ పెట్టాను. పక్కనే రామచంద్రాపురంలో కాలేజీ ఉన్నా, కాకినాడ ఎందుకు వెళ్తానన్నానంటే అక్కడైతే మనల్నెవరూ

చూడరూ, విడిగా రూమ్ లో వుంటూ ఇష్టమొచ్చినన్ని సినిమాలు చూడొచ్చు అనీ.. ఆ విధంగా 1984-86 మధ్యలో కాకినాడలో ఇంటర్మీడియట్ చదువుతూ ఎడాపెడా సినిమాలు చూస్తూ కాలక్షేపం చేసే వాడిని. ఫ్రెండ్స్ అందరూ హీరోల్ని అభిమానిస్తుంటే నేను మాత్రం మణిరత్నం గారిని అభిమానిస్తుండేవాడిని. డైరెక్టర్ కావాలన్న ఆలోచన అప్పట్లోనే ఉండేదోమో అంతగా గుర్తులేదు. చదువు విషయానికొస్తే, మరీ తప్పితే తిడతారు కాబట్టి పాసవడానికి కావల్సినంత చదివి ఎలాగైతేనేం ఇంటర్మీడియట్ పూర్తిచేశాను. కథలు వ్రాయడం, నాటకాలు వేయడం..ఇలాంటివేమీ లేవు. ఉన్న టైమంతా సినిమాలు చూడ్డమే.!

తరువాత బి.ఎస్సీ చదవాడినికి మళ్ళీ కాకినాడకే వచ్చాను. ఐతే ఇంక అప్పటికే సినిమా జ్ఞానమంతా ఒంటబట్టేసింది కాబట్టి మద్రాసు వెళ్ళిపోవాలని నిర్ణయానికివచ్చేశాను . బి.ఎస్సీ లో చేరిన నాలుగైదు నెలలకే ఫీజులు కట్టడానికని ఇంట్లో ఇచ్చిన డబ్బులు జేబులో పెట్టుకుని బొకారో ఎక్స్‌ప్రెస్ ఎక్కేశాను మద్రాసుకి..!



మద్రాసు ఎలా ఉంటుందో తెలీదు.. ఎక్కడికి వెళ్ళాలో తెలీదు..ప్రయాణం మొదలైంది. ట్రైన్‌లో ఒక కుర్రాడు పరిచయమయ్యాడు. అతనిది మద్రాసు దగ్గరలోనే ఏదో ఒక వూరు. అతని స్నేహితుడు జాస్తి చౌదరి అనే అతను మద్రాసులో ఉంటాడని చెప్పి ఎడ్రసు ఇచ్చి, ఎప్పుడేనా వీలైతే కలుసుకోమని చెప్పాడు.. మన బుర్ర వేగంగా పనిచేసింది, ముక్కూ మొహం తెలీని మద్రాసులో దిగగానే ఏం చెయ్యాలో అప్పుడే నిర్ణయించుకున్నాను.

మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో దిగగానే తెలిసిందేమిటంటే అక్కడ సిటీ బస్సులన్నీ సమ్మె ఆ రోజు. చేతిలో జాస్తి చౌదరి అనే అపరిచిత స్నేహితుడి చిరునామా ఉంది. పాండీ బజార్.. ఎంతదూరం ఉంటుందో తెలీదు. నడవడం మొదలెట్టాను. అలా దాదాపు 15 కి.మీ. దూరం నడిచి వెళ్ళి జాస్తి చౌదరి రూమ్ తలుపు తట్టాను. రైల్లో కలిసిన కుర్రాడు నాకు బాగా ఫ్రెండ్ అనీ, అతనే ఇక్కడికి వెళ్ళమన్నాడనీ నమ్మకం కుదిరేలా చెప్పాను. అతను సరేనని నేను తనతో మూడు రోజులు ఉండడానికి ఒప్పుకున్నాడు.. అదిచాలు. మిగతా విషయాలు మూడు రోజుల తర్వాత - ఆలోచిద్దాంలే అని అక్కడ తాత్కాలికంగా సెటిలయ్యాను.

ఆ మూడు రోజుల్లోనే బయటికి భోజనానికి వెళ్ళినప్పుడు కృష్ణవంశీ పరిచయమయ్యాడు. 'నాకు వసతి కావాలని' అడిగితే తన రూమ్‌లో ఉండమని అన్నాడు. అలా కృష్ణవంశీ రూమ్మేట్‌గా సెటిలయ్యాను. చేతిలో డబ్బులున్నాయి కాబట్టి తిండికేమీ ఇబ్బంది లేకుండా గడిచిపోయింది. అలా మద్రాసు వచ్చిన పదిహేను రోజులకి ఇంటికి ఉత్తరం రాశాను.. 'ఇలా మద్రాసులో ఉన్నాను, నాకోసమేమీ బెంగపడకండి, నేను క్షేమంగానే ఉంటున్నాను. నేనే మళ్ళీ ఉత్తరం రాస్తాను' అని. అప్పటికే ఇంట్లో వాళ్ళు నాకోసం తీవ్రంగా వెదుకుతున్నారంట.. నా అడ్రసు తెలిస్తే వచ్చి

నన్ను లాక్కెళ్ళి పోవడం ఖాయం..అందుకే అడ్రసు లేకుండా అప్పుడప్పుడూ నేనే ఉత్తరాలు వ్రాస్తుండే వాడిని.. ( ఓ ఆరునెలల తరువాత ఇంటికి వెళ్ళి అందరినీ ఒప్పించి మద్రాసు చేరుకోవడం..అదంతా మరో కథా).

అలా కృష్ణవంశీ రూమ్‌లో చేరిన రెండునెలలకే తను హైదరాబాదు వెళ్ళిపోయాడు. ఇంక రూమ్‌లో ఒక్కడినే మిగిలిపోయాను. ఎలాగైనా సినిమా రంగంలో చిన్న అవకాశం రావాలి అని తిరుగుతుండేవాడిని. అలా ఉండగా తూర్పుగోదావరి జిల్లాకే చెందిన ఒక డిస్ట్రిబ్యూటర్ ద్వారా గోగినేని సుబ్బారావు గారు అనే ప్రొడ్యూసర్ గారు పరిచమయ్యారు (చిన్ని కృష్ణుడు, పడమట సంధ్యారాగం అనే సినిమాల నిర్మాణంలో ఆయనకి భాగస్వామ్యం ఉంది). నా ఆసక్తి తెలుసుకుని చలసాని రామారావు అనే డైరెక్టర్‌కి నన్ను పరిచయం చేశారు. అప్పుడాయన బాలకృష్ణగారితో 'ప్రాణానికి ప్రాణం' అనే సినిమా తీస్తున్నారు. ఆ విధంగా చలసాని రామారావు గారి వద్ద ఆ సినిమాకి అప్రెంటిస్‌గా చేరాను. అలా 1989 మార్చిలో సినిమా రంగంలో నన్ను అడుపెట్టనిచ్చిన మొదటి సినిమా 'ప్రాణానికి ప్రాణం.'! సినిమా పూర్తయినంత వేగంగానూ అట్టర్ ఫ్లాప్ ఐంది. ఇదేంట్రా బాబూ పని చేసిన మొదటి సినిమానే ఇలా బాల్చీ తన్నేసిందని అనుకుంటుండగా శివ రిలీజై రామ్‌గోపాలవర్మగారి పేరు ఆంధ్ర దేశమంతా మార్మోగిపోవడం మొదలైంది. ఆయన దగ్గర అసిస్టెంట్ గా చేరదామని నేనూ హైదరాబాదు చేరుకున్నాను..



ఐతే అప్పటికే ఆయనదగ్గర అసిస్టెంట్లుగా చేరడానికి వచ్చిన వాళ్ళ క్యూ కొండవీటి చాంతాడంత ఉంది.. అక్కడ వీలు కాకపోవడంతో ఏంచెయ్యాలా అని వెదుకుంతుండగా 'ప్రాణానికి ప్రాణం' రోజుల్లో పరిచయమైన డైరెక్టర్ సాగర్ గారు ఎదురయ్యారు. ఆయన్ని ఒప్పించి అసిస్టెంట్ గా చేరాను.. ఆ సినిమా పేరు 'నక్షత్ర పోరాటం.' నన్ను అసిస్టెంట్‌ని చేసిన మొదటి సినిమా అది..! ఆ విధంగా సాగర్ గారి వద్దనే 'అమ్మ దొంగా' సినిమా వరకూ పనిచేశాను. 'అమ్మ దొంగ ' తరువాత ఇంక సొంతంగా డైరెక్షన్ చెయ్యగలననేనమ్మకం కలిగి, అసిస్టెంట్ గా మానేసి, కథలు తయారు చేసుకోవడం మొదలుపెట్టాను.

తొందరలోనే సాంబిరెడ్డి అనే ఆయన నాకు మొదటి సినిమా అవకాశం ఇచ్చారు. సినిమా పేరు 'అపరిచితుడు' , రాజశేఖర్ హీరో. మొదటి షెడ్యూలు అవగానే హీరోగారికీ నిర్మాత గారికీ వచ్చిన అభిప్రాయ బేధాల వల్ల ఆ ప్రోజెక్ట్ ఆగిపోయింది. మళ్ళీ కథ మొదలైంది..! ఏం చెయ్యాలీ..నిరాశ పడి లాభంలేదు. ప్రయత్నాలు కొనసాగించాల్సిందే ననుకుని మళ్ళీ కథలమీద కూర్చోవడం మొదలెట్టాను. అప్పుడు తయారైందే 'నీకోసం' కథ.



నాతో బాటు పనిచేసిన కెమేరామేన్ నా గురించి కొత్తగా సినిమా తీద్దామనుకుంటున్న బాల్‌రెడ్డి

మిత్రబృందానికి చెప్పడంతో వాళ్ళే నా దగ్గరికి సినిమా తీద్దామని రావడం, 'నీకోసం' మొదలు పెట్టడం జరిగింది. రవితేజ, మహేశ్వరి కాంబినేషన్. సినిమా మొదలైతే ఐంది కానీ ఆది నుంచీ అన్నీ కష్టాలే. నిర్మాతలు తలా ఒక రెండు , మూడు లక్షలు వేసుకుని ప్రోజెక్టు మొదలెట్టారు, కానీ మధ్యలో బడ్జెట్ ఐపోవడం..మళ్ళానేనే ఎలానో మరికొంత పెట్టుబడి పెట్టడం..అలా అష్ట కష్టాలూ పడి సినిమాని పూర్తిచేశాను. 38 లక్షల్లో 28 వర్కింగ్ డేస్‌లో తీసిన సినిమా పూర్తి కావడానికి మొత్తం సంవత్సరంన్నర పట్టింది.

ఆ సినిమా ప్రివ్యూ చూసిన నాగార్జున గారు నాకు డైరెక్షన్ ఆఫర్ ఇస్తానన్నారు. అలానే ఆ సినిమా చూసిన రామోజీ రావు గారు మొత్తం ఆంధ్రాకి దాన్ని కొనుగోలుచేసి రిలీజ్ చేశారు. 1999 డిసెంబర్ 3న రిలీజైంది. సినిమా బ్రహ్మాండమైన హిట్ కాకపోయినా కోటిరూపాయలు వసూలు చేసి కమ్మర్షియల్‌గా సక్సెస్ అవడమే కాకుండా డైరెక్టర్‌గా నాకు మంచి పేరు తీసుకొచ్చింది. అదే సంవత్సరం 7 నంది అవార్డుల్ని కూడా గెలుచుకుంది.. ఉత్తమ కొత్త దర్శకుడిగా నాకు, ఉత్తమ స్క్రీన్‌ప్లే కీ, ద్వితీయ ఉత్తమ చిత్రంగా సినిమాకీ కూడా ఎవార్డులొచ్చాయి. ఆ విధంగా నా దర్శకత్వంలో విడులైన మొదటి సినిమా 'నీకోసం'.

ఆ సినిమా విజయంతో నామీద నమ్మకంతో రామోజీ రావు గారు నాకు 'ఆనందం' సినిమా కి అవకాశం ఇచ్చారు.. అదెంత కమ్మర్షియల్ సక్సెస్ ఐందో మీ అందరికీ తెలుసు. ఇలా చెప్పాలంటే నన్ను దర్శకుడిగా అగ్రస్థాయిన నిలిపిన మొదటి సినిమా 'ఆనందం'!

*ఇన్నాళ్ళ అనుభవంలో తెలిసిందేమిటంటే.. ' కేవలం సినిమాల మీద ఆసక్తి మాత్రం ఉంటే సరిపోదు. బాగా కష్టపడే మనస్తత్వం ఉండాలి. ఎలాంటి క్లిష్టమైన పరిస్థితులనైనా తట్టుకునే ఓర్పు ఉండాలి. ఎదురు దెబ్బలు తగిలినప్పుడు బెదిరిపోకుండా నిలిస్తేనే ఎప్పటికైనా విజయం లభిస్తుంది..కష్టపడే వాళ్ళకి అద్భుతమైన అవకాశాల్నిస్తుంది చిత్రసీమ..! ఇదొక వండర్ ఫుల్ ఫీల్డ్'!*

**Featured in July 2007**

# వి.ఎన్. ఆదిత్య

*తన మొదటి సినిమా 'మనసంతా నువ్వే' తోనే ఘన విజయం సాధించిన వి.ఎన్.ఆదిత్య గారి అనుభవాలూ - జ్ఞా పకాలూ.. ఇటీవలే వచ్చిన 'ఆట' ఆయన లేటెస్ట్ సినిమా.*



నా చిన్నతనంలో నాన్నగారి ఉద్యోగరీత్యా చాలా వూళ్ళు తిరిగాం. నాన్నగారు స్టేట్ బాంక్ లో పనిచేసే వారు. నేను 1972 ఏప్రిల్ 30న ఏలూరులో పుట్టాను. నాకు చాలా కాలం తెలీనిదీ, నేను సినిమా రంగంలోకి వచ్చాకనే తెలిసిందీ ఏమిటంటే.. మానాన్న గారికి ఆయన చిన్నతనంలోనే ఆదుర్తి సుబ్బారావు గారి వద్ద అసిస్టెంటుగా పనిచేసే అవకాశం వచ్చిందనీ, కానీ మా తాత గారు ఒప్పుకోకపోవడం వల్ల ఆయన సినిమా రంగానికి వెళ్ళలేక పోయారనీ! అలానే మా అమ్మ వాళ్ళు భీమవరంలో ఉండగా, సింగీతం శ్రీనివాసరావు గారి మరదలు(ఆయన భార్య చెల్లెలు) గారింట్లో అద్దెకి వుండేవారట. వాళ్ళిద్దరూ బాగా ఫ్రెండ్స్ అట. అలానే సింగీతం గారి పెళ్ళికూడా భీమవరంలోనే జరిగిందట.. అంటే నేను పుట్టకముందే అమ్మకీ నాన్నకీ కొద్దో గొప్పో సినిమా రంగానికి చెందిన వాళ్ళతో పరిచయాలున్నాయన్న మాట. మరి నాకు తెలీకుండానే ఆ ఆసక్తి చిన్నతనం నుంచీ కలిగిందేమో చెప్పలేను కానీ బాగా బాల్యం నుంచే సినిమాలంటే విపరీతమైన ఆసక్తి వుండేది. 'ఆసక్తి' అనేది చాలా చిన్నమాట కావొచ్చు..'సినిమా పిచ్చి' అన్నా అనుకోవచ్చు.

అప్పట్లో అంటే 1980 దశకం మొదట్లో సినిమా తప్ప వేరే వినోద సాధనమేమీ ఉండేది కాదు. సాయంకాలం ఆరు దాటిందంటే సినిమా చూడడం ఒక్కటే పెద్ద వినోద కార్యక్రమం..! చిన్నప్పటినుంచే సినిమాలు విపరీతంగా చూసే వాడిని. నాన్న గారు బేంకు ఫీసర్ అవడం మూలాన, ఏ వూరు వెళ్ళినా సినిమా హాలు వాళ్ళకి లోను ఇవ్వడం మూలానో, మరే విధంగానో వాళ్ళతో మంచి పరిచయాలుండేవి. ఇంక మాకు సినిమా చూడడం అతి సులభమయ్యేది. ఒకే థియేటర్‌లో ప్రతి రోజూ అదే ఆటని అదే సీటులో కూర్చుని చూసిన సంఘటనలు కోకొల్లలు. జంగారెడ్డి గూడెం అనే వూళ్ళో ఐతే వరుసగా 18 రోజులు 'లవకుశ' సినిమాని, ప్రతిరోజూ మొదటి ఆటని ఒకే సీటులో కూర్చొని చూశాను, దానికి వరుసనే 'అల్లుడు పట్టిన భరతం' మరో 4 రోజులు. మొత్తం 22 రోజులు వరుసగా ప్రతి ఫస్ట్ షోకీ ఆ హాలు దగ్గరే వున్నానన్నమాట. అమ్మ ఏదైనా పనిమీద వూరెళ్తే ఇంక నాన్న గారు మమ్మల్ని (నేనూ, అన్నయ్యలిద్దరూ) హేండిల్ చెయ్యలేక సినిమా హాలుకి తీసుకెళ్ళి కూర్చో బెట్టేవారు..!

ఇలా సినిమాలు చూసీ , చూసీ సినిమాలు తప్ప మరో ప్రపంచం వున్నట్లు తెలిసేది కాదు. పోలిక చెప్పాలంటే ‘ఆట’ లో చిన్నప్పటి సిద్ధార్థ కేరక్టరే నాది. నోరు తెరిస్తే సినిమా మాటలు, కూని రాగం తీస్తే సినిమా పాటలు..ఏడవ తరగతిలో ఉండగా నాగభూషణం గారనే మాస్టారి వద్ద ట్యూషన్ చదువుతుండేవాడిని. ఆయనే మా స్కూల్లో మాస్టారు కూడా. సాధారణంగా స్కూలు మాస్టారి వద్దనే ట్యూషన్ కూడా చదివితే కాస్త చనువుగా ఉంటారు కదా.. ఒకసారి లెక్కలు ట్యూషన్ క్లాసులో, మధ్యలో ఖాళీ వస్తే, నోట్‌బుక్ లో ఒక బొమ్మగీశాను. అమ్మా. నాన్నా పేర్లు పెట్టి అటూ ఇటూ పార్వతీ పరమేశ్వరుల బొమ్మలు గీసి , కింద పూలూ, కొబ్బరిచిప్పలూ, పండ్లూ..వెండితెరా..గీసి ఒక బేనర్ లాగా గీశాను. మేస్టారు చూసి ‘ఇదేమిట్రా’ అంటే ‘ఇది నా సినిమా బేనర్ మాస్టారూ..’ అన్నాను. ‘సినిమాలంటే అంత



పిచ్చి ఏమిట్రా..ఏం చేస్తావు సినిమాల్లోకి వెళ్ళి?’ అన్నారు. ‘ఏమిటేమిటి సార్..సినిమా తీస్తాను..’ అన్నాను రెట్టిస్తూ. ‘సినిమా తీయడమంటే ఏమిట్రా’ అంటే..‘అదే మాస్టారూ..సినిమా తియ్యడమంటే తీసెయ్యడమే..’అ న్నాను. ఏడవ తరగతిలో అంతకంటే ఏం తెలుస్తుందీ.‘ఒరేయ్..సరే పద.. నిన్ను సినిమాకి తీసుకెళ్ళి సినిమా తియ్యడమంటే ఏమిటో చెప్తాను’ అని నన్ను ఆయన సైకిల్ మీదనే కోర్చోబెట్టి ‘అప్పుచేసి పప్పుకూడు’ సినిమాకి తీసుకెళ్ళారు.(అఫ్‌కోర్స్.. ఆ తరువాత అమ్మచేతిలో చివాట్లు కూడా తిన్నారనుకోండి..) టైటిల్స్ వచ్చేప్పుడు ఒక్కో పేరే ఫాలో అవుతూ..ఒక్కో డిపార్ట్‌మెంట్ ఏమి చేస్తుందో వివరంగా చెప్పారు. అప్పుడు డిసైడై పోయాను..ఎప్పటికైనా సినిమా దర్శకుడిగా పేరు తెచ్చుకోవాలని!

ఈ విధంగా మొదలైన సినిమా పిచ్చి, వయసుతో బాటు పెరిగిందే తప్ప ఎక్కడా తగ్గుముఖం చూపించలేదు. ఇంటర్మీడియట్, బి.ఎస్సీ విజయవాడలోని సిద్ధార్థ కాలేజీలో చదివాను.. ఇంటర్మీడియట్ అయ్యాక ఎం.సెట్ పరీక్షకి ముందు రోజు రాత్రి సెకండ్ షో ‘బేటా’ సినిమా చూసి పరీక్షలు కూడా డుమ్మా కొట్టేశాను. బి.ఎస్సీలో ఉండగా కూడా వ్యాస రచన, డిబేటింగ్ కాంపిటీషన్స్, నాటకాలు వెయ్యడం..అన్నింటిలోనూ ముందే ఉండేవాడిని. వందలాది ట్రోఫీలు గెలుచుకున్నాను. బి.ఎస్సీ చివరి సంవత్సరంలో ఉండగా.. ఇంక ఏమైనా సరే సినిమా రంగంలోకి దూకెయ్యాల్సి నిర్ణయించుకున్నాను.

నాన్నగారి పాత ఫ్రెండ్ రావి కొండలరావు గారిని కలిసి దాదాపు ఏడెనిమిది నెలల పాటూ స్వాతి ముత్యంలో కమల్ హసన్ లాగా వెంటపడి బతిమాలాను, ఎలాగైనా సినిమాల్లో దర్శకత్వ శాఖలో అవకాశం కల్పించమని. చివరికి బి.ఎస్సీ ఫైనల్ పరీక్షలు రాశాక, ఆయన రికమండేషన్‌తో, ‘బృందావనం’ సినిమాకి సింగీతం శ్రీనివాస రావుగారి వద్ద అప్రెంటిస్‌గా చేరాను. విజయా పిక్చర్స్ వారు మళ్ళీ సినిమాలు తీద్దామని నిర్ణయించాక మొదలైన ‘బృందావనం’ నాకు సినీ పరిశ్రమని పరిచయం చేసిన మొదటి సినిమా. ఆ సినిమా నిర్మాణంలో ఎప్పుడూ కెమేరా వెనకాలే ఉండి, సింగీతంగారు ఏ షాట్ ఎలా తీస్తున్నారో పరిశీలించేవాడిని. నా ఆసక్తికి, కష్టపడే మనస్తత్వానికీ ఆయన చాలా అభినందించి నా మీద ప్రత్యేక అభిమానం చూపించేవారు. ఆ సినిమా అయ్యాక విజయవాడ వచ్చేశాను.

బి.ఎస్సీ పరీక్షలు తెలిసే రోజు వచ్చింది.. పరీక్షలో పాసైతే ఇంట్లో వాళ్ళని ఒప్పించి, లేదంటే ఇంట్లో చెప్పకుండానూ మద్రాసు వెళ్ళిపోదామని బ్యాగులో అన్నీ సర్దుకుని కాలేజీకి వెళ్తే, ఫస్టుక్లాసులో పాసయ్యానని తెలిసింది. ఇంటికి వచ్చేసి, అమ్మకీ నాన్నకీ నా నిర్ణయం చెప్పాను, సినిమాల్లో దర్శకత్వ శాఖలో సెటిలవ్వాలని ఉందని. నాన్నగారైతే 'నీ భవిష్యత్తు..నీ ఇష్టం..' అన్నారు కానీ అమ్మకి నన్ను సివిల్ సర్వీసెస్ ఆఫీసర్ గా చూడాలని ఉండేది. ఎలాగైనా సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాయమని నచ్చజెప్ప చూసింది..

"ఈ సినిమాలు అనేవి మనకేమీ తెలీదు. మనకెవరూ గాడ్ ఫాదర్స్ కానీ, లోతుపాతులు తెలిసి త్రోవ చూపించే వాళ్ళు కానీ ఎవరూ లేరు. పైగా అక్కడ బోలెడన్ని రాజకీయాలు ఉంటాయంటారు. నువ్వు ఎంత వరకూ సక్సెస్ ఔతావో తెలీదు. అక్కడ సక్సెస్ ఔతావనడనికి ఆధారాలేమీ లేవు. అదే సివిల్ సర్వీసెస్ రాస్తే ఒకటి కాకపోతే మరోటి ఖచ్చితంగా ఉద్యోగం దొరుకుతుంది. నీ భవిషత్తుకి భరోసా ఉంటుంది.." అని అమ్మ నన్ను ఒప్పించాలని చూసింది. కానీ నా నిర్ణయం మారలేదు. ఎంతమంది చెప్పినా నా మనసు మాత్రం వాళ్ళ మాట వినలేదు.. చివరికి అమ్మతో ఒక ఒప్పందానికి వచ్చాను " అమ్మా నా కిప్పుడు 20 ఏళ్ళు కదా. ఖచ్చితంగా 5 సంవత్సరాలు నన్నొదిలెయ్. నాకు 25 సంవత్సరాలు వచ్చే సరికి డైరెక్టర్ని కాలేకపోతే, వెనక్కి వచ్చేసి నువ్వన్నట్లే సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాస్తాను. అప్పటికి ఇంకా మూడేళ్ళు ఛాన్సు ఉంటుంది కాబట్టి ఏదో ఒక ఉద్యోగం తెచ్చుకోగలను" అని చెప్పి మద్రాసు వెళ్ళిపోయాను.

మళ్ళీ సింగీతంగారి వద్దనే 'భైరవద్వీపా'నికి అసిస్టెంట్గా చేరాను. 1993 లో **అసిస్టెంట్ డైరెక్టర్గా తెరమీద నా పేరు పడిన మొదటి సినిమా 'భైరవద్వీపం'..!** అక్కడినుంచీ ఐదు సంవత్సరాలపాటు వివిధ దర్శకుల వద్ద దర్శకత్వశాఖలో సహాయకుడిగా చేశాను. కె.ఎస్. సేతుమాధవన్ గారి వద్దకమల్ హసన్ 'నమ్మవారు' సినిమాకి అసోసియేట్ గానూ , పి.వాసుగారి వద్ద రజనీ కాంత్ 'ఉళైపాళి' కి అప్రెంటిస్ గానూ, చేశాను. తరువాత జయంత్ సి.పరన్జీ గారి వద్ద 'ప్రేమించుకుందాం రా', 'బావగారూ బాగున్నారా', 'ప్రేమంటే ఇదేరా' సినిమాలకీ పనిచేశాను.



చివరికి 1998 లో సరిగ్గా అమ్మకి మాట ఇచ్చిన ప్రకారం సొంతంగా దర్శకత్వం వహించే అవకాశం తెచ్చుకోగలిగాను.. మొట్టమొదటగా **నా దర్శకత్వంలో మొదలు కావాల్సిన సినిమా పేరు 'నువ్వంటే నాకిష్టం'** (ఇటీవల వచ్చిన ఇ.వి.వి.గారి సినిమాకీ, అప్పట్లో నేను ప్లాన్ చేసిన సినిమాకీ ఏమీ పోలికలు లేవు). అప్పట్లో 'సీతారాముల కల్యాణం' సినిమాలో హీరో గా చేసిన వెంకట్ హీరోగానూ, ప్రస్తుతం కన్నడ, మళయాళీ సినిమాల్లో నటిగా స్థిరపడిన మాన్య హీరోయిన్గా సిన్మా ప్లానింగ్ జరిగింది. 'లో బడ్జెట్ లో, సింగిల్ షెడ్యూల్ లో, 50 లక్షలకి సినిమా పూర్తి చేసి, 30 లక్షలు పబ్లిసిటీకి ఖర్చు పెట్టి సిన్మా ఎలాగైనా సూపర్ హిట్ అయేలా చూసే బాధ్యత నాదీ' అని నిర్మాత కి భరోసా ఇచ్చాను. కథని పరుచూరి బ్రదర్స్కీ , త్రివిక్రమ్ శ్రీనివాస్కీ కూడా చెప్పి వారి సలహాలతో మెరుగులుదిద్ది పకడ్బందీగా తయారు చేసుకున్నాను. మొదటి సినిమా చిన్నదే ఐనా నిర్మాతకి లాభాలు తెచ్చిపెట్టేలా తీస్తే

దర్శకుడిగా నేను తొందరగా నిలదొక్కుకోగలను అని నా అంచనా. ఆర్.పి. పట్నాయక్ కి అదే మొదటి సినిమా కావల్సింది. చక్కటి ట్యూన్స్ కూడా సిద్ధంచేసుకున్నాం (దానికోసం చేసిన 'నువ్వంటే నా కిష్టమనీ..' అనే పాటను తరుణ్ హీరోగా వొచ్చిన 'నువ్వు లేక నేను లేను' అనే చిత్రంలో ఉపయోగించడం జరిగింది).అన్నింటికీ ముందు సరేనన్న నిర్మాత షూటింగ్ వారం రోజులున్నందనగా కొత్త షరతు పెట్టారు. అదేమిటంటే "ముందుగా ఒక వారం షూటింగ్ చెయ్యండి. ఎలావస్తుందో చూసి , బాగా ఆడుతుందనుకుంటే కంటిన్యూ చేస్తాను" అన్నారు. సినిమా పూర్తయ్యాక చూస్తేనే రిలీజ్ ఐతే తప్ప ఎలా ఆడుతుందో ముందుగా ఎవ్వరూ అంచనా వెయ్యలేరు. అలాంటిది వారం రోజుల షూటింగ్‌తో బాగుందో లేదో ఎలా చెప్పగలరు? పైగా చిన్న సినిమాల లైఫ్ ఎలా ఉంటుందో గమనిస్తున్నాను. ఒకసారి ఆగిందంటే మళ్ళీ మొదలు కావడం కష్టం. అందుకే ఆ ప్రోజెక్ట్ తో ముందుకి వెళ్ళలేదు. ఆ విధంగా మొదలు కాకుండానే గిపోయింది, నా మొదటి సినిమా ఔతుందనుకున్న 'నువ్వంటే నాకిష్టం' !

ఆగిపోయినా కానీ సినిమాకి ముందుగానే సినిమా న్యూస్ పత్రికల్లో వచ్చింది. అమ్మకిచ్చిన మాట ప్రకారం 5 సంవత్సరాల్లో (1993-1998) దర్శకుడిగా పేపర్లలో పేరు చూసుకోగలిగాను. ఇంటికి వెళ్ళినప్పుడు అమ్మకి ఇదే చెప్పి అన్నమాట నిలబెట్టుకున్నానని సమర్ధించుకున్నాను.. అప్పటికే ఇంక నన్ను సినిమా వాడిగా జమ కట్టేశారు కాబట్టి ఇంట్లో వాళ్ళు నేనేం చెప్పినా విని ఊరుకున్నారే తప్ప అంత సీరియస్‌గా తీసుకోలేదు..

మళ్ళీ సంవత్సరంన్నర గాప్ వచ్చింది. హైదరాబాదులోనే ఉంటూ కథలు తయారు చేసుకోవడం ప్రారంభించాను. ఆ సమయంలో దాదాపు ఒక డజన్ మంది ప్రొడ్యూసర్స్‌కి నేను తయారు చేసిన కథలు వినిపించడం జరిగింది. మధ్యలో ఇండస్ట్రీతో టచ్ పోకుండా వుంటుందని 'రావోయి చందమామ ' సినిమాకి మధ్యలో నుంచీ జయంత్ గారి వద్ద జాయిన్ అయ్యాను. అలానే అమెరికా ఆంధ్రులు తీసిన 'అటు అమెరికా ఇటు ఇండియా' అనే సినిమాకి కూడా సిరివెన్నెల గారి



రికమండేషన్ మీద సహాయకుడిగా గుమ్మలూరి శాస్త్రి గారి వద్ద చేశాను. ఆ సినిమాకి అమెరికాలో పనిచేయడం ఒకమంచి అనుభవం. కెమేరా మేన్ టామ్ ఏంజలో తో కలిసి సినిమా స్కోప్ సినిమాకి యాంగిల్స్ సెట్ చేయడం, లైటింగ్ సెన్స్ లాంటివన్నీ సరిగా వుండేలా చూడడం..అదొక గొప్ప అనుభవం..

ఆ సినిమా ఐపోయాక తిరిగి ఇండియా వచ్చేశాను. అప్పటికి ఎమ్. ఎస్ రాజు గారు దేవీపుత్రుడు సినిమా తీసి, కొత్తగా ఫేమిలీ ఓరియెంటెడ్ లౌ స్టోరీ తియ్యాలని చూస్తున్నారు. లోగడ మహేష్ బాబు, వెంకటేష్‌ల కోసం కథలు తయారుచేసేప్పుడు ఎస్.గోపాల రెడ్డి గారితో మంచి అనుబంధం ఏర్పడింది. దానివల్ల ఆయన నన్ను ఎమ్.ఎస్ రాజు గారికి రికమండేషన్ చేయడం, ఆయనతో కలిసి 'మనసంతా నువ్వే' సినిమా చేయడంజరిగింది. కథకంటే ట్రీట్‌మెంట్ కి ఎక్కువ ప్రాధాన్యత వున్న మొదటి సినిమాని నేను ఛాలెంజింగ్ గా తీసుకున్నాను.. ఆ సినిమా ఘన

విజయం గురించి మళ్ళీ వేరే చెప్పనవసరం లేదనుకుంటాను.. **ఈ విధంగా నా దర్శకత్వంలోని మొదటి సినిమాగా మీ ముందుకి వచ్చింది ‘మనసంతా నువ్వే’!**

తరువాత ఎన్ని విజయవంతమైన సినిమాలు తీసి నన్ను నేను నిరూపించుకున్నా అమ్మకి మాత్రం ఇంకా మనసులో ఏదో మూల ఉంటుంది - నేను సివిల్ సర్వీసెస్ రాసి ఉంటేనే బావుండేదని ..!



**Featured in August 2007**

# కోడి రామకృష్ణ



మా స్వస్థలం పాలకొల్లు. నాన్నగారి పేరు నరసింహ మూర్తి, అమ్మగారి పేరు చిట్టెమ్మ. చిన్నప్పటినుంచీ నాకు తెలీకుండానే నాటకాల పట్ల అపరిమతమైన ఆసక్తి ఉండేది. చిన్నప్పుడే చుట్టుపక్కల పిల్లల్ని చేరదీసి, మంచాన్ని నిలువుగా నిలబెట్టి, దానిమీద దుప్పటి వేస్తే అదే తెర. వెనకనుంచీ ముందుకి వస్తే నటీనటులు స్టేజి మీదికి వచ్చినట్లే. పసుపూ, బొగ్గుముక్కలూ, ఫేస్ పౌడరూ..మాకు మేకప్ సామాగ్రి. నా ప్రాధమిక పాఠశాల చదువూ, హైస్కూలూ, కాలేజీ అంతా పాలకొల్లులోనే. హైస్కూలుకి వెళ్ళేసరికి నాటకాలలో అనుభవం పెరిగి కాలేజీకి వెళ్ళేసరికి మరింత రాటుదేలి నాటకాలాడ్డం అనేది చదువుతోబాటు సమాంతరంగా నడిచేది. నాటకాలతో బాటుగా కమ్మర్షియల్ పెయింటింగ్ కూడా నాకు ప్రవృత్తిగా ఉండేది.

అజంతా పెయింటింగ్స్ అనే పేరుతో ప్రొఫెషనల్ పెయింటింగ్ షాపుకూడా ఉండేది నాకు కాలేజీ రోజుల్లోనే. రోజూ రాత్రి పూట పెయింటింగ్ షాపులో సైన్ బోర్డులూ, హోర్డింగ్సూ పెయింట్ చేయడం, తరచూ నాటకాలు వేయడం, పగలు కాలేజీకి వెళ్ళడం..ఇలా వుండేది నా కాలేజీ జీవితం. పెయింటింగ్ షాపులో ఉన్నప్పుడుకూడా ఎప్పుడూ పదిమంది నాతోబాటు ఉండేవాళ్ళు. నాకు పెయింటింగ్ లో గురువు అనదగిన నాగేశ్వర రావు గారికి ఫోటో స్టూడియో కూడా ఉండేది. ఆయనే నా ఫోటోలు తీసి ఎక్కడైనా కొత్త నటులు కావాలని ప్రకటన పడితే వాళ్ళకి పంపిస్తుండేవారు. మా ఫ్రెండ్స్ కూడా సినిమాల్లో నటుడిగా ప్రయత్నించమని ప్రోత్సహించేవాళ్ళు.

మా నాన్నగారికి ఈ విషయం తెలిసి ' నీకు నచ్చిన ఏ పని ఐనా చెయ్యి. ఐతే ముందుగా డిగ్రీ పూర్తి చెయ్యి. ఎంచేతంటే మన వంశంలో డిగ్రీ చదివిన వాళ్ళెవరూ లేరు. కనీసం నువ్వైనా డిగ్రీ పూర్తి చేస్తే చూడాలని ఉంది' అనే వారు. నేను సరే నని ఒప్పుకుని డిగ్రీ పూర్తిచేసేవరకూ సినిమా ప్రయత్నాలు చెయ్యకూడదని అనుకున్నాను ఐతే మా నాన్నగారికి ఒక విషయం చెప్పాను..''మధ్యలో ఎప్పుడైనా తప్పితే మాత్రం ఇంక చదువు ఆపేసి మద్రాసు చెక్కేస్తాను..'' అని.

కాలేజీరోజుల్లో మా సొంత నాటకాల ప్రదర్శనతోబాటు, మద్రాసునుంచీ కాకరాల లాంటి ప్రొఫెషనల్స్ ని ఆహ్వానించి టిక్కెట్టు నాటకాలు కూడా ఆడేవాళ్ళం. నా నాటకాల్లో మా కాలేజీ లెక్చరర్లు కూడా నటించేవాళ్ళు. మా ఫ్రెండ్స్ లోకూడా వెరైటీ మానరిజమ్స్ ఉన్న వాళ్ళని ఎన్నుకుని వాళ్ళకోసం ప్రత్యేక పాత్రలు సృష్టించి నాటకాల్లో ప్రయోగాలు చేసేవాడిని.

మా కాలేజీ ప్రిన్సిపాల్ గారికి నేనంటే చాలా అభిమానంగా వుండేది. ఎప్పుడూ సెకండ్ క్లాసులోనే పాసవుతున్నా, నా పెయింటింగ్స్ ప్రతిభా, నాటకాల అనుభవమూ ఆయనకి నామీద ప్రత్యేక శ్రద్ధ కలిగేలా చేశాయి. పాలకొల్లు చుట్టుపక్కల ఏ ఫంక్షన్ జరిగినా ఆయన ఉపన్యాసం ఉండాల్సిందే ప్రేక్షకుల్ని ఆకర్షించేలా ఉపన్యాసమివ్వడం

ఆయన ప్రత్యేకత. ఆయన ఎక్కడికి వెళ్ళినా నన్ను కూడా తీసుకెళ్ళేవాళ్ళు. నేను 'సుడిగుండాలు' సినిమాలో కోర్టుసీన్ ఏకపాత్రాభినయం చేసేవాడిని. ఆయన ఉపన్యాసం, నా ఏకపాత్రాభినయం - ఒక కాంబినేషన్‌లా సాగేవి.

బి.కామ్ మొదటి సంవత్సరంలో ఉండగానే జై ఆంధ్రా ఉద్యమం మొదలైంది. ఆ ఉద్యమాన్ని బలపరిచిన వాళ్ళలో నేనూ ఒక స్టూడెంట్ లీడర్ ని. ఆ రోజుల్లోనే తాతా-మనవడు సినిమా విడుదలైంది. ఆ సినిమా విజయం చూశాక అంతవరకూ సినిమాల్లోకి నటుడిగా ప్రవేశిద్దామనుకున్నవాడిని, ఎప్పటికైనా దాసరి నారాయణరావు గారిలాగ దర్శకుడ్ని కావాలని నిర్ణయించుకున్నాను. 'నటుడైతే ఒక పాత్రకే పరిమితమై ఉంటాడు..అదే దర్శకుడైతే ఎన్నో పాత్రల్ని తీర్చి దిద్దవచ్చు'' అని అనిపించిందప్పుడే



'తాతా-మనవడు' 50 రోజుల పండుగకి ఆ యూనిట్ అంతా పాలకొల్లు వస్తున్నారనితెలిసి ఎలాగైనా ఆ సమయంలో గురువుగారిని (దాసరి నారాయణ రావు గారిని) కలిసి సినిమాల్లో ఛాన్సుకోసం రిక్వెస్ట్ చేద్దామనుకున్నాను. ఐతే ఇక్కడ ఒక చిన్న చిక్కు వచ్చింది. ఆ ఫంక్షను జరిగేది మా వూళ్ళోని 'మారుతీ టాకీస్' లో. (ప్రస్తుతం ఆ థియేటర్ నాదే.) ఆ ధియేటర్ యజమానికీ మా స్టూడెంట్స్ కీ సత్సంబంధాలు లేవు. కానీ నేనా ఫంక్షన్ కి హాజరై గురువు గారిని ఎలాగైనా కలవాలనేది నా ప్లాన్. నా మిత్రులందరినీ సమావేశపరచి చెప్పాను ..''ఎలాగైనా నేను సినిమాల్లో చేరాలనేది మీకూ కోరికే గదా. గురువుగారిని కలవడానికి ఇది మంచి అవకాశం. ఈ ఫంక్షన్ సమయంలో మనం ఏమీ గొడవచెయ్యొద్దు. ఇది మీరు నాకు చెయ్యాల్సిన సహాయం.'' అని వివరించాను. ''సరే రామకృష్ణా..ఇది నీ భవిష్యత్తుకు సంబంధించిన వ్యవహారం కాబట్టి మేము రాజీ పడి కాస్త తగ్గి ఉంటాం. ఐతే ఒక్క షరతు..మేము కూడా ఈ ఫంక్షన్ కి వస్తాము. ఆ థియేటర్ ఓనర్ మంచిగా ఉన్నంతకాలం ఏమీ ఫర్వాలేదు. ..అతను మమ్మల్ని రెచ్చగొట్టకుండా చూసే బాధ్యత నీది..'' అన్నారు. సరే పదమని అందరం కల్సి మారుతీటాకీస్ కి వెళ్ళాం.

అందరం స్టేజికి ముందరే కూర్చున్నాం. సభ వైభవంగా ప్రారంభమైంది. నిర్మాత రాఘవ గారు సినిమా నిర్మాణంలో తన అనుభవాల గురించీ, కొత్త దర్శకుడైనా దాసరి నారాయణ రావు గారు చూపించిన దర్శకత్వ ప్రతిభ గురించీ మాట్లాడారు. ఆ తరువాత దాసరి గారు మాట్లాడ్డానికి ముందుగా థియేటర్ ఓనర్ గారు మైకు పుచ్చుకున్నారు. నాకు కాస్త టెన్షన్ మొదలైంది, ఆయన ఏం మాట్లాడుతాడోనని. ఆయన కూడా సినిమా గురించీ, నిర్మాత రాఘవ గారి గురించీ, మా వూరివారే ఐన గురువుగారి గురించీ ప్రశంసిస్తూ మాట్లాడ సాగారు.. అమ్మయ్య అంతా సవ్యంగానే ఉంది అనుకుంటుండగానే ఆయన ఉన్నట్టుండి..'' యువకులంటే ఇలా అందరికీ ఆదర్శంగా వుండాలి.. అంతే గానీ మీలా రౌడీల్లా కాదు..ఎందుకు మీరూ ఉన్నారు..ఎందుకూ పనికిరాని వాళ్ళు..జై అంధ్రా అంటూ..పనీ పాటాలేకుండా రోడ్లంట

తిరుగుతారు..''అంటూ ఆయన విశ్వరూపాన్ని చూపించారు. అంతే! మావాళ్ళు రెచ్చిపోయారు. అంతా ఒక్కసారి కేకలేస్తూ లేచి కుర్చీలు విరగ్గొట్టి నానా రభసా చేశారు. ప్రోగ్రామ్ అంతా తల్లకిందులైంది. మా అల్లరిమూకని తప్పించుకుని గురువుగారూ, రాఘవ గారూ ఎలానో ఆ థియేటర్ ఓనర్ గారింటికి వెళ్ళిపోయారు. ఏం చేసేది..!? నేనూ దీనంగా ముఖం పెట్టుకుని అక్కడికి వెళ్ళి గురువుగారికి నన్ను పరిచయం చేసుకుని మా స్టూడెంట్స్ తరఫున క్షమాపణ చెప్పుకున్నాను. అప్పుడే నాకు సినిమాల్లో దర్శకత్వశాఖలో చేరాలని ఉందని కూడా చెప్పాను. నేను బి.కామ్ మధ్యలో ఉన్నానని తెలుసుకున్న గురువుగారు `ముందు డిగ్రీ పూర్తి చెయ్యి..ఆ తరువాత నన్ను కలువు` అన్నారు. ఆ సంఘటనతో రాఘువ గారికి మాత్రం నామీద ఒక అల్లరి విద్యార్థి నాయకుడిగా ముద్ర పడిపోయింది. అదే తరువాత నాకు ఉపయోగపడుతుందని అప్పట్లో ఊహించలేకపోయాను.

సరే.. మళ్ళీ నా నాటకాలు, పెయింటింగ్ షాపూ, కాలేజీ మామూలే. మళ్ళీ సంవత్సరం తరువాత అనుకుంటాను..`సంసారం - సాగరం` విడుదలకి గురువుగారు మా వూరు వచ్చారు. థియేటర్ లోకి వెళ్ళబోతూ గేటు దగ్గరే వేచి చూస్తున్న నన్ను గుర్తు పట్టి ''ఏం రామకృష్ణా బావున్నావా?'' అని పలకరించారు. సంవత్సరం తరువాత కూడా ఆయన నన్ను గుర్తుపట్టినందుకు చాలా ఆనందించాను. ''బి.కామ్ పూర్తయిందా?'' అనిఅడిగారు. ''ఇంకా ఒక సంవత్సరం ఉంది సార్..'' అన్నాను. ''అవగానే నన్ను కాంటాక్ట్ చెయ్యి'' అన్నారు. నాలో ఆశ బాగా బలపడింది.



మరికొన్ని నెలలకి గురువుగారే `రాధమ్మ పెళ్ళి` షూటింగ్ కి మావూరు దగ్గరికి వస్తే వెళ్ళి కలిశాను. '' నాటకాల్లో అనుభవం ఉందికదా..ఒక వేషం ఇస్తాను చేస్తావా.? '' అన్నారు. నాకు ఆశ్చర్యం, ఆనందం కలిగాయి. సరే నన్నాను. ఆ సినిమాలో శారద గారి పక్కనతిరిగే అసిస్టెంట్ కుర్రాడిగా వేషం ఇచ్చారు. ఆ షూటింగ్ సమయంలో గురువుగారికి బాగా దగ్గరయ్యాను. షూటింగ్ అయ్యాక వాళ్ళంతా వెళ్ళిపోయారు. నేనూ బి.కామ్ పరీక్షల్లో పడిపోయాను. పరీక్షలు అవగానే, పరీక్షా ఫలితాలు తెలియక ముందే, గురువు గారికి లెటర్రాశాను. ఆయన వెంటనే `స్టార్ట్ ఇమ్మీడియట్లీ` అని టెలిగ్రాం పంపించారు. నా ఆనందానికి అవధులు లేవు. కానీ అంతలోనే కాస్త దిగులు.. ఉన్నవూరినీ, ఈ స్నేహితుల్నీ అందరినీ వదిలి వెళ్ళాలా అని బెంగ గా అనిపించింది. మా ఫ్రెండ్స్ అందరితో చెప్పాను. మరి మద్రాసు వెళ్ళడానికి డబ్బులు కావాలి ఎలా..? మా వాళ్ళంతా కలిసి `పల్లెపడుచు` నాటకాన్ని టిక్కెట్టుకి ప్రదర్శించి అలా వచ్చిన డబ్బులతో నన్ను సర్కార్ ఎక్స్ ప్రెస్ ఎక్కించారు. ఇంకో సెంటిమెంట్ విషయం ఏమి జరిగిందంటే, నన్ను బాగా అభిమానించే మా కాలేజీ ప్రిన్సిపాల్‌గారు ట్రాన్స్‌ఫర్ ఐ వెళ్ళిపోతూ నాకో చిన్న సూట్‌కేస్ బహుమతిగా ఇచ్చారు. దానిలోనే బట్టలు సర్దుకుని మద్రాసు ప్రయాణమయ్యాను, 1972 వ సంవత్సరంలో.

మద్రాసులో దిగగానే మిత్రుడు వాకాడ అప్పారావు వొచ్చి నన్ను రిసీవ్ చేసుకున్నాడు. గురువు గారిని కలిసేందుకు ముందుగా ఆయన ఇంటికి వెళ్తే అక్కడలేరు. విక్రమ్ స్టూడియోలో ఉన్నారని చెబితే అక్కడికి వెళ్ళాము. నేను జీవితంలో అడుగు పెట్టిన మొట్టమొదటి స్టూడియో అదే మా దురదృష్టవశాత్తూ ఆయన అక్కడాలేరు. శివాజీ గార్డెన్స్ లో షూటింగ్ లో ఉన్నారంటే అక్కడికి వెళ్ళాము. అక్కడ, లోగడ మావూరు వద్ద నేను నటించిన రాధమ్మపెళ్ళి పాచ్ వర్క్ జరుతోంది. గురువుగారు బయటికి వెళ్ళారట. అక్కడ యూనిట్ వాళ్ళు నన్ను చూసి 'అరే భలే సమయానికి వచ్చేశావే..రారా.." అంటూ నన్ను మేకప్ రూమ్‌కి తీసుకెళ్ళారు. విషయమేమిటంటే నేను మా వూళ్ళో నటించిన సీన్ల పాచ్ వర్క్ కోసమని నా బదులు ఒక డూప్‌ని వాడుతున్నారట. సమయానికి నేను వెళ్ళేసరికి నాకే మేకప్ వేయడం మొదలెట్టారు. షాట్ రెడీ అయ్యే సరికి గురువుగారు వచ్చేశారు. సీన్లో నన్ను చూసి ఆశ్చర్యపోవడం ఆయన వంతైంది... విషయం తెలుసుకుని ఆయనా సంతోషించి నామీద షాట్స్ తీశారు. షూటింగ్ ఐపోగానే " నాకు తెలిసినంతలో మద్రాసులో అడుగుపెట్టిన రోజే మేకప్ వేయించుకున్న వాళ్ళెవరూ లేరు. నీకే ఆ అవకాశం ఒచ్చింది. నీకు లక్ ఉంది..తొందరలోనే పైకి వస్తావు .." అని తన కారులోనే ఎక్కించుకుని తీసుకెళ్ళారు.

తన నెక్స్ట్ పిక్చర్‌కే నన్ను అసిస్టెంట్‌గా తీసుకున్నారు. అప్పట్లో దాసరి నారాయణ రావు గారు రెండు, మూడు సినిమాలు ఒకేసారి షూటింగ్ చేస్తుండే వారు. ఆ విధంగానే మొదటి అవకాశం లోనే నాకూ ఒకేసారి ' ఎవరికి వారే యమునా తీరే ', ' స్వర్గం-నరకం ', ఎన్టీఆర్ గారి ' మనుషుల్లో దేవుడు ' - మూడు సినిమాలకి అసిస్టెంట్‌గా పనిచేసే వీలు కలిగింది. సినిమాల్లో అడుగుపెట్టగానే ఎన్టీఆర్ గారితో కలిసి పనిచేయడమనేది చాలా థ్రిల్లింగ్ గా అనిపించింది. నేను పనిచేసే సినిమాల్లో చిన్న, చిన్న వేషాలు వెయ్యడం కూడా అప్పుడే అలవాటైంది. ' స్వర్గం-నరకం ' లో అక్కినేని ఫాన్స్ అసోసియేషన్ లీడర్ గా వేషం వేశాను. ' ఎవరికి వారే యమునా తీరే ' లో కూడా ఒక చిన్న పాత్రవేశాను. అక్కడినుంచీ దాసరి గారు పనిచేసిన సినిమాలన్నింటికీ సహాయకుడిగా చేశాను. అఫీషియల్ గా కొన్ని సినిమాలకే అసిస్టెంట్ డైరెక్టర్ గా ఉన్నా, ఆయన తీసే సినిమాలన్నింటికీ హాజరవుతుండేవాడిని.



అలా ఐదారేళ్ళు గడిచాయి. గురువు గారు నన్ను చాలా ఆత్మీయంగా చూసుకునే వాళ్ళు. దేనికీ ఇబ్బందిలేకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకునే వాళ్ళు. నేను అసిస్టెంట్ గా వుండగానే ఒక చిన్న సంఘటన జరిగింది. నిర్మాత రాఘవ గారు రచయిత రాజశ్రీ గారి దర్శకత్వంలో తీస్తున్న చదువు-సంస్కారం సినిమాలో స్టూడంట్ లీడర్ పాత్ర వుంటే, నన్ను పాలకొల్లులో చూసిన దృశ్యం గుర్తు తెచ్చుకుని "వేరే ఎవరో ఎందుకూ.. నిజ జీవితంలో స్టూడెంట్ లీడర్ గా తిరిగిన కుర్రాడు దాసరి గారి వద్ద పనిచేస్తున్నాడు. అతన్నే ఈకేరక్టర్ కి పిలిపించండి.."అని ఆ పాత్ర నాతో వేయించారు. షూటింగ్ జరుగుతున్న రోజుల్లో రాత్రి పూట రాఘవ గారితో

కూర్చుని రకరకాల కథలు వినిపించే వాడిని. అప్పటివరకూ కేవలం ఆకతాయి స్టూడెంట్ లీడర్ గానే నన్ను భావించిన రాఘవ గారికి నాలోనూ కాస్త సత్తా ఉందని తెలిసింది.

ఎప్పటికైనా గురువుగారి లాగానే రాఘవ గారి బేనర్ లోనే దర్శకుడ్ని కావాలని ఉండేది. అప్పుడే గురువు గారికి రాఘవ గారు నిర్మించే 'తూర్పు-పడమర' సినిమాకి దర్శకత్వం వహించే అవకాశం వచ్చింది. నేనూ ఆ సినిమాకి అసిస్టెంట్ గా చేస్తానని గురువు గారిని అడిగాను. "లేదయ్యా..ఈ సినిమాకి ఇప్పటికే 8 మంది అసిస్టెంటులు ఉన్నారు. నీకూ వేరే సినిమాలు ఉన్నాయి కదా. రాఘవ గారు అసలే స్ట్రిక్ట్.. మరీ 9 మంది అసిస్టెంటులంటే ఒప్పుకోరు" అన్నారు. " సార్..సార్..ఈ సినిమాకి చెయ్యాలనేది నా చిరకాలకోరిక..పోనీ నేనే వెళ్ళి రాఘవ గారిని బతిమాలుకుంటాను.." అన్నాను. " సరే ..నీ ఇష్టం..రాఘవ గారితో జాగ్రత్తగా మాట్లాడు " అని సలహా ఇచ్చారు.

రాఘవగారి ఆఫీసుకి వెళ్ళాను. ఆయన బయట పచార్లు చేస్తున్నారు. నేను వచ్చిన పని చెప్పాను.." అబ్బే కుదరదయ్యా..ఇప్పటికే బోలెడంతమంది అసిస్టెంటులున్నారు. ఇంకా నువ్వు కూడా ఎందుకు?" అన్నారు ఊహించినట్లే. కానీ ఎలాగైనా ఆ అవకాశం సాధించాలని వెళ్ళాను కదా.. ఒక అరగంట సేపు ఆయన్ని బతిమాలి, కొన్ని కొత్త కథల ఐడియాలు చెప్పి ఇంప్రెస్ చెయ్యగలిగాను. ఏమీ జీతం కూడా తీసుకోకుండా చేస్తానని అన్నాను.

"సరే..రామకృష్ణా..ప్రతిభ ఉన్నవాడిలానే ఉన్నావు..సరే ఐతే నిన్ను తీసుకోమని దాసరి గారికి చెబుతాను. నీకు 100 రూపాయలు పేమెంట్ ఇస్తాను.." అన్నారు.

"చెప్పాను కదసార్..అస్సలు నాకు రెమ్యునరేషన్ ఏమీ వద్దు.."

"అలా నా దగ్గర ఊరికే పనిచెయ్యొద్దయ్యా.. వందరూపాయలు తీసుకుంటేనే పనిచెయ్యనిస్తాను.." అని గుమాస్తాని పిలిచి 100 రూపాయలకి చెక్కు ఇచ్చారు.

ఆ చెక్కు రూపాయలతో సమానమని, దాన్ని బాంకులో వేసుకుంటే డబ్బులు వస్తాయని కూడా తెలీదప్పటికి. అదే నేను అందుకున్న మొదటి చెక్కు. సంతోషంగా గురువు గారి వద్దకి వచ్చాను.."ఏమయ్యా..రాఘవ గారు కుదరదని చెప్పేశారా?" అన్నారు.

"లేదు సార్.. ఒప్పుకున్నారు. ఇదిగో 100 రూపాయల చెక్కు ఎడ్వాన్సుగా కూడా ఇచ్చారు.." అని చూపించాను.

"మొత్తానికి భలే సాధించావయ్యా. ఘటికుడివే.. ఇంకా డైరెక్టర్ నైన నేనే ఎడ్వాన్సు తీసుకోలేదు.."అంటూ ఆత్మీయంగా భుజం తట్టారు.

ఆ విధంగా ఎప్పటినుంచో రాఘవగారి ప్రొడక్షన్ లో పనిచెయ్యాలనే కోరిక తీరింది. ఆ సినిమా షూటింగ్ జరిగేప్పుడుకూడా ఖాళీ సమయాల్లో రాఘవ గారికి రకరకాల కథలు వినిపిస్తుండేవాడిని. ఆ సినిమా పూర్తయ్యాక డబ్బింగ్ జరిగే రోజుల్లో దాసరి గారూ, మిగతా అసిస్టెంట్లూ అంతా వేరే షూటింగ్‌కి కాశ్మీర్ వెళ్ళాల్సి వచ్చింది. మరునాడే నగేష్ గారితో డబ్బింగ్ చెప్పించాలి. రాఘవ గారి వద్దకెళ్ళి "నేను చెప్పిస్తాను సార్ నగేష్ గారితో.." అన్నాను.

"అసలే కొత్త ..సరిగా చెయ్యగలవా..నగేష్ గారు చాలా డిసిప్లిన్డ్ మనిషి. ఏమాత్రం తేడా వచ్చినా ఊరుకోరు.." అన్నారు.

"ఏం ఫరవాలేదు సార్ నేను చూసుకుంటాను.."అని ఆయనకి భరోసా ఇచ్చి మరురోజు నగేష్ గారితో డబ్బింగ్ చెప్పించాల్సిన పార్టు చూడ్డం మొదలుపెట్టాను. మొదట్లోనే 300 అడుగుల సైలెంట్ లూప్ ఉంది. షూటింగ్ లో సౌండ్

రికార్డ్ కాలేదు. ముందూ , వెనకా సీన్లుచూసి అక్కడ ఏమి ఉండాలో రాసుకుని ఎడిటర్ బాలు గారి సహాయంతో చాలా సార్లు రిహార్సల్స్ వేసుకుని రెడీగా వున్నాను.

మరురోజు రాత్రి వాసు స్టూడియోలో నగేష్ గారితో డబ్బింగ్‌కి అంతా సిద్ధమయింది. ఆయన వచ్చారు. మొదట్లోనే వచ్చిన సైలెంట్ లూప్ చూసి కయ్యిమన్నారు. "ఇదేంటయ్యా..ఇంత సైలెంట్ లూప్ ఐతే ఎలా చెప్పాలి.." అని విసుక్కున్నారు. ముందురోజే నేను బాగా ప్రాక్టీస్ చేసి ఉండడం వల్ల ఆయనకిఓపికగా వివరించి, ఒప్పించగలిగాను. అయిష్టంగానే "సరే.మొదలు పెట్టు చూద్దాం.." అన్నారు. ఒక సారి డబ్బింగ్ మొదలు పెట్టాక స్క్రిప్టు మీద నాకున్న గ్రిప్, సంభాషణలు చెప్పడంలో ఈజ్ గమనించి ఆయన చాలా ఇంప్రెస్ ఐ ఆ రాత్రంతా ఉండి డబ్బింగ్ పూర్తి చేశారు. ఈ వ్యవహారమంతా గమనించిన రాఘవ గారు " శెభాష్..రామకృష్ణా..నీ పట్టుదల నాకు బాగా నచ్చిందయ్యా...తప్పని సరిగా నిన్ను నా బేనర్ లోనే డైరెక్టర్ ని చేస్తాను.."అన్నారు 1978 ప్రాంతాల్లో వాసు స్టూడియోలో..!

ఆ సినిమా తరువాత మళ్ళీ గురువుగారి వద్దే అసిస్టెంట్‌గా కంటిన్యూ అవుతున్నాను. మరో ఏడాది కనుకుంటా రాఘవ గారు 'అంతులేని వింతకథ' అనే సినిమా తీశారు. ఐతే అట్టర్ ఫ్లాప్ ఐంది. రాఘవగారు చాలా అప్‌సెట్ అయ్యారు సహజంగానే. నేనప్పుడు గురువుగారితో ఒక హిందీ సినిమాకి పనిచేస్తున్నాను. ఒక సారి లాబ్ లో ఏదో పనిలో ఉండగా రాఘవగారు వొచ్చి "రామకృష్ణా నాతో రా.." అన్నారు. కారు ఎక్కి ఆయన ఆఫీసుకి వెళ్ళాము. ఆయన ఆఫీసులో డైరెక్టర్ రూమ్ అని ఒక రూమ్ ఉండేది. నన్ను అందులోకి తీసుకెళ్ళి అక్కడ కుర్చీలో కూర్చోమని "నా నెక్స్ట్ పిక్చర్‌కి నువ్వే డైరెక్టర్‌వి " అన్నారు. నాకు ఒక్క నిమిషం ఏమీ అర్థం కాలేదు. కలా..నిజమా అనిపించింది. ఆ కుర్చీలో కూర్చునే గురువుగారు 'తాతా-మనవడు' తో డైరెక్టర్ అయ్యారు. నా చిరకాల కోరిక నెరవేరబోతోంది. నా ఆనందానికి అవధులు లేవు. అంతలోనే కాస్త భయం. అప్పుడే ఫైయిల్యూర్ సినిమా తీసివున్న ఆయనకి మంచి హిట్ ఇవ్వాలి, నాకూ అదే మొదటి సినిమా. అదీ ఛాలెంజ్..

ఆయనకి ఎలా కృతజ్ఞతలు చెప్పానో కూడా గుర్తులేదు. ఇంక అప్పటినుంచీ వరుసనే కథలు తయారు చేసి ఆయనకి చెప్పడం మొదలుపెట్టాను. గురువుగారికి కూడా ఈ శుభవార్త చెప్పాను. ఆయనా చాలా సంతోషించి భుజం తట్టారు.. కొన్ని నెలల తరువాత 'తరంగిణి' స్క్రిప్టు  రాఘవ గారికి వినిపించడమూ ఆయన ఓకె అనడమూ జరిగాయి..

అన్ని పేపర్లలోనూ పబ్లిసిటీ వచ్చేసింది. సుమన్, భానుచందర్, శ్యామలగౌరి..అందరూ కొత్తవాళ్ళే. మ్యూజిక్ సిటింగ్స్ కూడా అయ్యాయి. ఆ రోజే రెండు పాటలు రికార్డింగ్ కూడా జరిగింది. ఆ రోజు సాయంకాలం రాఘవ గారి ఆఫీసులో ఉండగా, ఆయన ఫ్రెండ్సూ, శ్రేయోభిలాషులూ కొంతమంది ఆయన్ని కలవడానికి వచ్చారు. వాళ్ళంతా " రాఘవా..అసలే మొన్న సినిమాతో దెబ్బతిని వున్నావు. మళ్ళీ ఇప్పుడూ కొత్తవాళ్ళతో., కొత్త కుర్రాడితో తీయడం అంత మంచిది కాదేమో..మరో సారి ఆలోచించు.." అని చెప్పారు. రాఘవగారూ ఆలోచనలో పడ్డారు. ఆ రాత్రి తొమ్మిదింటికి పిలిచారు.."రామకృష్ణా.. ఫ్రెండ్స్ ఇలా అంటున్నారయ్యా.. ఈ సినిమా నిలిపేద్దాం.. నేనొచ్చి దాసరి గారికి సారీ చెప్పి నిన్ను మళ్ళీ అక్కడ అసిస్టెంట్ గా చేరుస్తాను.." అన్నారు.

నాకు ఒక్క నిమిషం మొదడు మొద్దుబారింది. కళ్ళముందు చీకటి కనిపించింది. కొంతసేపటికి తేరుకుని.." రాఘవ గారూ..పోనీ తరంగిణి కథ నచ్చకపోతే మరో మంచి కథ చెబుతాను. కాస్త పేరున్న స్టార్స్ ని పెట్టుకుందాం..

అన్ని పేపర్లలోనూ వచ్చేసింది. మళ్ళీ అసిస్టెంట్ గా ఎలా వెళ్తాను సార్.. మీకు నచ్చే కథ వినిపిస్తాను. ఇంకొక్క అవకాశం ఇవ్వండి.." అన్నాను.

అందుకాయన..'రామకృష్ణా..ఈ విషయం వినగానే నువ్వు కోపంతో నన్నేదో అంటావనుకున్నాను. అలా కాకుండ మళ్ళీ ప్రయత్నిద్దామనే నీ పట్టుదల నచ్చిందయ్యా..సరే కానీ...కొత్త కథ వెదుకు.." అన్నారు.

మళ్ళీ కథలకోసం వేట మొదలైంది. అలా మరికొన్ని నెలలు గడిచాయి.. నా పరిస్థితి గమనించిన మిత్రులు "రామకృష్ణా నిన్ను చూస్తే జాలేస్తోంది.. మీ గురువుగారికి అంత సర్కిల్ ఉండికూడా..ఇంకా నీకు అవకాశమే రాలేదు.." అనే వారు. ఐనా నేను నిరాశపడలేదు. ఎలాగైనా రాఘవగారికి నమ్మకం కలిగించే కథ తయారు చెయ్యాలి అనే పట్టుదలతోనే ఉన్నాను. రోజూ రాఘవ గారి ఆఫీసుకి కాలి నడకన వెళ్ళేవాడిని. అలా వెళుతుండగా డి.వి.నరసరాజు గారుండే వీధిలో గొల్లపూడి మారుతీ రావు గారు మోర్నింగ్ వాక్ కి వెళుతూ కనిపించేవారు. ఆయనతో వ్యక్తిగత పరిచయం లేకపోయినా, ఆయన నాటకాలు ఆడిన పరోక్ష పరిచయం ఉంది. ఒకరోజు నన్ను నేనే పరిచయం చేసుకుని " గురువుగారూ..ఇదీ నా పరిస్థితి..మళ్ళీ కొత్త కథ తయారు చేసుకుంటున్నాను. మీ సహాయం కాస్త కావాలి. అలానే నేను రాఘవ గారికి కథ వినిపించేప్పుడు మీరు పక్కన ఉండాలి" అని అభ్యర్థించాను. ఆయన నా పరిస్థితి గమనించి సరే అన్నారు. రాఘవ గారికి చదువుకున్న వాళ్ళంటే ప్రత్యేకమైన గౌరవం ఉండేది. గొల్లపూడి గారిని సహాయం అడగడానికి అదికూడా ఒక కారణం..

ఇంక ఆరోజునుంచీ నా కేరాఫ్ ఎడ్రసు గొల్లపూడి గారి ఇల్లే అయింది. అలా పుట్టిందే 'ఇంట్లో రామయ్య- వీధిలో కృష్ణయ్య' కథ. ఒక కొలిక్కి వచ్చాక మారుతీరావు గారిని తీసుకుని రాఘవ గారి వద్దకెళ్ళి కథ వినిపించాము. "కథ మొత్తంగా నాకేమీ నచ్చలేదయ్యా. ఐతే ఇందులో సంగీత కేరక్టర్ చాలా నచ్చింది. అందుకోసమైనా కథని ఓకె చేస్తాను " అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు..! "సార్..మాటలు వ్రాయడానికి కూడ మారుతీ రావుగారినే తీసుకుందాం.." అన్నాను. ఆయన వెంటనే అంగీకరించారు. ఇన్నాళ్ళ నిరీక్షణ ఫలించిందనుకుని ఆయనకి థాంక్స్ చెప్పి ఇంక రాత్రీ పగలూ మారుతీ రావుగారి వద్దనే ఉండి సీనులన్నీ డెవలప్ చేసి కొన్ని నెలలకి పూర్తి స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నాము. మారుతీ రావు గారికి స్క్రిప్ట్ పర్ఫెక్షన్ గురించి ఎంత శ్రద్ధంటే మొత్తం డైలాగ్ వెర్షన్ తీసుకుని విశాఖపట్నం వెళ్ళాం. అక్కడ యూనివర్సిటీ స్టూడెంట్స్‌ని సమావేశపరచి మొత్తం సీన్లు చెప్పారు మారుతీ రావు గారు. అది వినేప్పుడు వాళ్ళ రియాక్షన్లని జాగ్రత్తగా నోట్ చేసుకుని ఎక్కడెక్కడ ఏమి మార్చాలో నోట్ చేసుకున్నారాయన. అలానే తిరుగు ప్రయాణంలో విజయవాడలో ఆగి ఆలిండియా రేడియోలో ఆయన ఫ్రెండ్స్ వద్దకెళ్ళి వాళ్ళ సలహాలూ తీసుకున్నాం. మారుతీరావు గారు తీసుకున్న ఆ జాగ్రత్తే ఆ సినిమాలో ప్రతి పాత్రా గుర్తుండిపోయేలా చేసింది.

ఇంక కేస్టింగ్‌కి వచ్చే సరికి నేనే చిరంజీవి గారి పేరు సూచించాను. ఐతే రాఘవ్ గారెప్పుడూ పేరున్న ఏక్టర్స్ తో చెయ్యరు. అదే మాట అంటే ఆ కథకి చిరంజీవి గారే ఎలా సరిపోతారో వివరంగా చెప్పి, ఆయనతో సరే అనిపించుకుని చిరంజీవి గారి వద్దకెళ్ళి కథ చెప్పాను. అంతా విని "నాకంతగా నచ్చలేదయ్యా..కాకపోతే పూర్ణిమని రక్షించే సీన్ వల్ల ఆ కెరక్టర్ ఎలివేట్ అయింది..చేస్తాను.." అన్నారు. నా ఆనందానికి అవధులు లేవు. హీరోయిన్ ఐతే రాఘవగారి బేనర్‌లో పర్మినెంట్ ఆర్టిస్ట్ ఐన మాధవి గారే. ఇంక సుబ్బారావు వేషానికి వచ్చేసరికి ఎవరా అనుకుంటుంటే రాఘవ గారు తనకి తెలిసినాయన్ని ఒకరిని సజెస్ట్ చేశారు. ఐతే నాకు మాత్రం ఆ పాత్ర మారుతీరావు గారే చెయ్యాలని మొదటినుంచీ ఉండేది. కథ తయారు చేసేప్పుడు, సంభాషణలు వ్రాసేప్పుడూ ఆయన చెప్పే విధానమూ, ఆయన

ఎక్స్‌ప్రెషన్స్ చూశాక ఆ కేరక్టర్ ఆయన మాత్రమే సరిపోతారనిపించి రాఘవ గారితో చెబితే ఆయన సరే నన్నారు . కానీ మారుతీరావు గారు మాత్రం ససేమిరా చెయ్యనన్నారు.." రామకృష్ణా. అసలే నీకిది మొదటి సినిమా. ఆ పాత్ర కథకి ఆయువుపట్టు.. నాకా కెమేరా ముందు నిలబడిన అనుభవం అస్సలు లేదు. ఏమాత్రం తేడా వచ్చినా, నీ సినిమా ఫెయిలైతే నేను జీవితాంతం బాధపడాల్సి వస్తుంది.. వేరే ఎవర్నైనా చూసుకో.. " అన్నారు. "సార్...నాకు మీమీద బాగా నమ్మకం ఉంది. మీరే ఈ పాత్ర చెయ్యాలి. మీరు చేస్తేనే నా భవిష్యత్తుని నిలబెట్టిన వాళ్ళవుతారు.. మీరు లేకపోతే ఈ సినిమా చెయ్యలేను సార్.."అని బతిమాలి ఒప్పించాను.

మొత్తానికి అన్నీ సమకూరి షూటింగ్‌కి అందరం పాలకొల్లు చేరుకున్నాం. ముహూర్తం షాట్ చిరంజీవిగారి మీద తియ్యాలి. ఐతే ఆయన రావాల్సిన ట్రైన్ లేటవడం వల్ల ముహూర్త సమయం మించి పోకూడదని పూర్ణిమ మీద మొదటి షాట్ తీద్దామనుకున్నాం. పూర్ణిమ వాకిట్లో ఉంటే "లోపలికి రామ్మా" అనే డైలాగ్ వుండే సీను..క్లాప్ కొట్టడం ఐపోయింది.. 'యాక్షన్..' అన్నాను. కెమేరా పూర్ణిమ కేసి తిరిగింది...'కట్' చెప్పాను.. కెమేరామేన్ వంక చూశాను. ఆయన ముఖంలో భావాలేమీ లేవు. నాకు టెన్షన్ పెరిగింది. "సార్..కెమేరా ప్లగ్ పెట్టడం మరిచిపోయాను.." అన్నాడు.. మొదటి సినిమా..మొదటిస్ షాట్..ముహూర్తం షాట్..కెమేరా పనిచేయలేదు..సెంటిమెంటల్ గా పెద్ద దెబ్బ.! ఐతే ఇంతలో చిరంజీవి గారు వచ్చేశారు. ఒక పాటలో ఆయన మెట్లమీదనుంచీ దిగివస్తూ రియాక్షన్ ఇచ్చేషాట్..అదీ మొదటి షాట్ గా "ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య' మొదలైంది. గమ్మత్తేమిటంటే ..చివరకి ఆ షాట్ సినిమాలో లేదు. ఎడిటింగ్ లో ఎగిరి పోయింది..

గొల్లపూడి గారి కేరక్టర్ కి షూటింగ్ సమయంలోనే విపరీతమైన క్రేజ్ వచ్చింది.. ఆయన మీద మొట్టమొదటి షాట్ తెల్లవారు ఝామున మూడింటికి తియ్యాల్సి వచ్చింది.."రామకృష్ణా ఎందుకయ్యా నాతో రిస్క్ తీసుకుంటావు. అసలే కెమేరాకి కొత్త నేను..పైగా తెల్లవారు ఝామున మొదటి షాట్ తీస్తున్నావ్" అన్నారు.

"ఏం ఫరవాలేదు సార్.. తెల్లవారు ఝామున మొదటి షాట్ తీసిన వాళ్ళంతా సూపర్ స్టార్లు అయ్యారు మారుతీరావు గారూ.." అన్నాను.. (సినిమా రిలీజయ్యాక ఆయన ఎంతటి సూపర్ స్టార్ అయ్యారో మీకందరికీ తెలిసిందే.)

సినిమా షూటింగ్ జరిగినన్ని రోజులూ పాలకొల్లు అంతా పండుగ వాతావరణమే. ఊళ్ళో అందరూ 'మన రామకృష్ణ సినిమా రా..' అంటూ అన్ని పనుల్లోనూ చేదోడు వాదోడుగా ఉండేవారు. ఏ ఇల్లు కావాలంటే ఆ ఇల్లు, ఏ భవనం కావాలంటే ఆ భవనం ఇచ్చి షూటింగ్ మొత్తం ఏ అవాంతరాలూ లేకుండా సాగిపోడానికి చాలా సహకారం అందించారు..

షూటింగ్ చివరగా అంతర్వేది లో ఒక పాట పిక్చరైజ్ చేశాము. చివరి రోజు అక్కడ షూటింగ్ ఐపోగానే అందరం కలిసి మొగల్తూరులో చిరంజీవి గారింటికి భోజనాలకి వెళ్ళాలి. లాంచీలో వెనక్కి ప్రయాణిస్తుండగా చిరంజీవి గారు, క్రింద పడవలో ఉన్నారు. నేను లాంచి టాప్ మీద కూర్చుని ఉన్నాను..

"రామకృష్ణా.." అని పిలిచారు చిరంజీవి గారు..

ఏమిటా అని కిందికి చూశాను.

"ఇదిగో..ఈ నారింజకాయ పైకి విసిరేస్తాను..దీన్ని చేతులతో కాకుండా నీ నోటితో పట్టుకోవాలి.. అలా ఐతేనే ఈ సినిమా సూపర్ హిట్..సరేనా.." అన్నారు చిరంజీవి గారు.

"సార్..సార్..ఇలాంటి సెంటిమెంట్లతో నన్ను టెన్షన్ పెట్టకండి సార్.." అన్నాను.

"ఏమో అదేమీ నాకు తెలీదు. నాకలా అనిపిస్తోంది..నువ్వు పట్టుకోవాల్సిందే." అంటూ నారింజకాయ పైకి విసిరేశారు..భవిష్యత్తు ముందే తెలిసిందేమో..సరిగ్గా ఆ నారింజకాయ నా నోట్లోకే వచ్చింది.! అమ్మయ్య అనుకున్నాను.

ఈ విధంగా షూటింగ్ అంతా కోలాహలంగా, సంరంభంగా గడిచిపోయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులన్నీ ఐపోయాయి . అప్పుడు మొదలైంది సమస్య.. సెన్సారు వాళ్ళు టైటిల్ వద్దనుంచీ పేచీ పెట్టారు. ముందుగా టైటిల్ మార్చేయమనీ, ఆ పైన 4,000 అడుగుల సీన్లు తొలగించమనీ బోర్డుమెంబర్‌లలో ఒకాయన పట్టుబట్టాడు. మహిళల మనోభావాల్ని కించపరిచేలా ఉన్నాయని వారి వాదన. రాఘవ గారు ఒప్పుకోలేదు. "మనం తప్పుచేయలేదు..ఎంత సేపైనా సరే పోరాడుదాం.." అన్నారు. ఇండస్ట్రీలోని పెద్దలందర్నీ సమావేశపరచి సెన్సార్ బోర్డుకి ఒక విజ్ఞాపన పత్రం ఇచ్చారు. ఇదంతా జరుగుతున్నప్పుడే ఆ బోర్డుమెంబర్ ట్రాన్స్‌ఫర్ కావడమూ, పైగా కొత్త ఛైర్మన్ రావడమూ జరిగాయి. ఆయన మొత్తం సినిమాని మళ్ళీ పరిశీలించి పరిశ్రమ విజ్ఞప్తిని మన్నిస్తూ ఏమీ మార్పులు లేకుండానే సర్టిఫికెట్ ఇచ్చారు..

1982 మధ్యలో విడుదలైన నామొదటి సినిమా విజయం గురించి మళ్ళీ ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా.. సరిగ్గా సంవత్సరం ఆడింది. అప్పుడు మళ్ళీ తరంగిణి ప్రోజెక్టుని పైకి తీశాము. అదీ సంవత్సరం పాటు ప్రేక్షకుల ఆదరణ పొందింది..

ఇదండీ నా మొదటి సిన్మా అనుభవాల పరంపర.

నా మొదటి సినిమా కి రాఘవగారి లాంటి నిర్మాత, చిరంజీవి గారిలాంటి హీరో, గొల్లపూడి మారుతీరావు గారి కేరక్టరూ, మాటలూ, జె.వి.రాఘవుల గారి సంగీతమూ..అన్నీ నా అదృష్టానికి కలిసి వచ్చాయి. ఇప్పటికీ గురువుగారు దాసరి నారాయణ రావు గారినీ, రాఘవ గారినీ ప్రతి విషయానికీ సంప్రదిస్తుంటాను. వాళ్ళే నా మార్గ దర్శకులు. గొల్లపూడి మారుతీరావు గారిని ఒక పెద్దన్నయ్యగా, పితృ సమానులుగా గౌరవిస్తుంటాను..

మళ్ళీ పాతికేళ్ళ తరువాత ఈ సంఘటనల్ని నెమరేసుకునే అవకాశం కలిపించిన 'కౌముది' కి కృతజ్ఞతలు. 'కౌముది' పాఠకులకి నా అభివందనాలు.

**Featured in September 2007**

# రేలంగి నరసింహారావు

*గత పాతికేళ్ళలో 72 సినిమాలకి పైగా దర్శకత్వం వహించి సూపర్ హిట్ కామెడీ చిత్రాల దర్శకుడిగా పేరుతెచ్చుకున్నారు శ్రీ రేలంగి నరసింహా రావుగారు. పోలీస్ భార్య, ఎదురింటి మొగుడు పక్కింటి పెళ్ళాం, ఇద్దరి పెళ్ళాల ముద్దుల పోలీస్, రోటేషన్ చక్రవర్తి, చిక్కడు-దొరకడు, పరుగో పరుగు, సుందరి-సుబ్బారావు, పెళ్ళాం చాటు మొగుడు, సాహసం చేయరా ఢింభకా..లాంటి సినిమాలు ఆయన దర్శకత్వం వహించిన జాబితాలో ఉన్నాయి. కేవలం కామెడీ సినిమాలే కాక 'తెల్లగులాబీలు' లాంటి ప్రేమకథా చిత్రాలు, 'సంసారం', 'శిక్ష', 'మానస వీణ' లాంటి ప్రయోగాత్మక సినిమాలు కూడా రూపొందించారు రేలంగి నరసింహారావు గారు. ప్రస్తుతం ఈ టివి కోసం 'బుజ్జి-బుజ్జిగాడు' సీరియల్‌కి దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే సంవత్సరంలో దాసరి నారాయణ రావు గారి నిర్మాణతలో వేణుమాధవ్ హీరోగా 'కోతి బావకు పెళ్ళంట' అనే మరో హాస్య చిత్ర నిర్మాణం కోసం సన్నాహాలు చేస్తున్నారు.*

మా స్వగ్రామం పాలకొల్లు. పాలకొల్లు అనగానే అనేక మంది సినిమారంగ ప్రముఖులు గుర్తుకు రావడం సహజం.. ప్రముఖ నటులు స్వర్గీయ అల్లు రామలింగయ్యగారు, స్వర్గీయ చలంగారు, ప్రముఖ దర్శకులు దాసరి నారాయణరావు గారు, కోడి రామకృష్ణ గారు, రచయిత స్వర్గీయ పినిశెట్టి శ్రీరామమూర్తి గారు.. ఇలా అనేక మంది తెలుగు చిత్రసీమలో వివిధ రంగాల్లో పేరు తెచ్చుకున్న వాళ్ళంతా పాలకొల్లునుంచీ వచ్చిన వాళ్ళే. నేను 1951 లో పుట్టాను. నాన్నగారి పేరు శ్రీ రంగనాయకులు, అమ్మగారి పేరు శివరామమ్మ. నాన్నగారు పాలకొల్లులో పేరుపొందిన డాక్టరు. నాకు ఊహ తెలిసే సరికే నాన్న గారి ప్రాక్టీసు చాలా బిజీగా వుండేది. - ఆయన పేదలకి ఉచితంగా వైద్యం చేస్తుండేవారు. ధన సంపాదనకంటే ప్రజాసేవే పరమార్థం అన్నట్లు వైద్యం చేస్తుండేవారు. ఆయనకి నాటకరంగం మీద కూడా మక్కువ ఎక్కువ. పాలకొల్లులోని ఔత్సాహిక బృందాలు ఎక్కడైనా నాటక పోటీలకి వెళ్ళాలంటే ఆయనే వాళ్ళకి టిక్కెట్లన్నీ పెట్టుకుని పంపించేవారు. అలానే రాత్రి పూట తన క్లినిక్‌ని రిహార్సల్స్ కోసం ఇస్తుండే వాళ్ళు.



నాకు హైస్కూల్లో ఉన్నప్పటినుంచీ స్టిల్ కెమేరా అంటే ప్రాణంగా వుండేది. రకరకాల ఫోటోలు తీసి ఎక్స్‌పోజ్ చేసి అందరికీ చూపిస్తుండేవాడిని. ఒకే మనిషిని అటూ ఇటూ కూర్చోబెట్టి, మాస్క్ ఉపయోగించి ఒకే ఫోటోలో రెండు బొమ్మలు


చిన్నోడు, పెద్దోడు షూటింగ్ సమయంలో

వచ్చేలా ప్రయోగాలుకూడా చేస్తుండే వాడిని. ఈ హాబీ ఇలా ఉండగా నాన్నగారు నాటక రంగానికి, నటులకీ ఇస్తున్న ప్రోత్సాహం చూసి నాకూ నాటకాల్లో వేషాలు వెయ్యాలని ఉండేది. ఐతే డాక్టరు గారి అబ్బాయినవడం ఒక విధంగా అడ్డంకి ఐంది. మానాన్న గారిని బట్టి నన్ను గౌరవంగా చూసేవాళ్ళే తప్ప నాకు స్టేజ్ అవకాశమివ్వడానికి మాత్రం ఎవరూ ఉత్సాహం చూపించలేదు. ఎలాగైనా రంగస్థలం ఎక్కాలనే పట్టుదలతో ఏకపాత్రాభినయాలని వ్రాయించుకుని ఒక్కడినే స్టేజి ఎక్కి, అవి ప్రదర్శిస్తుండేవాడిని నా పధ్నాలుగో ఏట నుంచే. నైట్ వాచ్ మాన్ అప్పారావు, పోస్ట్‌మాన్, మట్టి బొమ్మలు.. ఇలా రకరకాల మోనోయాక్షన్స్ చేస్తుండే వాడిని.

ఆ విధంగా నాలోని నటుడ్ని పరిశీలించిన నాన్నగారి స్నేహితుడు రెడ్డి గారు అనే ఆయన నాకు మొదటి సారిగా రంగస్థల నాటకం 'బ్రహ్మచారి' లో అవకాశం కలిపించారు. అప్పటికే కాలేజీలో పి.యు.సి లో చేరాను. అప్పటినుంచీ విరివిగా నాటకాల్లో వేషాలు వేస్తుండేవాడిని. నాన్నగారికైతే సహజంగానే నన్ను డాక్టర్ కోర్స్‌కి పంపించాలని ఉండేది. నాటకాలు, కెమేరా హాబీగానే చేస్తున్నాననుకునేవాళ్ళు.

చిన్నప్పటినుంచీ, కాలేజీలో కూడా నాకు బెస్ట్ ఫ్రెండ్, క్లాస్ మేట్, బెంచ్ మేట్ కోడి రామకృష్ణ. అప్పటికే రామకృష్ణ పేరున్న నటుడు. నేను అపుడప్పుడే వేషాలు మొదలెట్టాను. ఇద్దరం చెరో ట్రూపులో వేస్తుండేవాళ్ళం. కాలేజీ డ్రమెటిక్ అసోసియేషన్‌కి కూడా ఇద్దరం పోటీ చేసేవాళ్ళం.. ఐతే నటనలోనూ, నాటక రంగంలోనూ ఎప్పుడూ కోడి రామకృష్ణదే అగ్రస్థానం. నేనెప్పుడూ రెండో ప్లేసులోనే ఉండేవాడిని. ఐనా మా మధ్యస్నేహం మాత్రం చాలా గాఢంగా ఉండేది. పియు.సి ఐపోయింది. బి.ఎస్సీ లోకూడా చేరాను. మెడిసిన్‌లో చేరడానికి సరిపడా మార్కులు రాలేదు. నాన్నగారు చాలా నిరుత్సాహ పడ్డారు. ఇంక నాకు చదువుమీద ఆసక్తిలేదని చెప్పి చదువుమానేసి ఇంట్లోనే ఉండిపోయాను. "సరేలే పోనీ..నీకు ఇంట్రెస్టు ఉన్న పనే చేద్దువుగాని, పోనీ సినిమా రంగానికి వెళ్తావా' అని అడిగారు. సరేనన్నాను.


ఎన్టీఆర్ నుండీ నంది అవార్డు అందుకుంటూ

నాన్నగారు తోడుగా 1971 లో మద్రాసులో అడుగుపెట్టాను. ఎన్టీ రామారావు గారి సినిమాలకి ఎక్కువగా పబ్లిసిటీ చేసే కేతా గారినీ, అప్పటికి సినిమారంగంలో నిలదొక్కుకోడానికి ప్రయత్నిస్తున్న దాసరి గారినీ, పినిశెట్టి గారినీ, సినిమాల్లో చిన్న చిన్న వేషాలు వేస్తున్న మావూరి నటులు కోల సత్యం , వంగ అప్పారావు గార్లనీ..ఇలా అందరినీ సంప్రదించి దర్శకత్వ శాఖ ఐతే బావుంటుందని నాన్నగారు నిర్ణయం తీసుకున్నారు, వీళ్ళందరి సహకారంతోనే 'మహమ్మద్ బీన్

తుగ్లక్' అనే సినిమాకి అప్రెంటిస్ గా చేరాను 1971 లో. స్వర్గీయ బి.వి.ప్రసాద్ గారు ఆ సినిమా దర్శకులు (మట్టిలో మాణిక్యం, బుల్లెమ్మ - బుల్లోడు లాంటి సూపర్ హిట్ సినిమాలని అందించారాయన). మా గురువు గారు దాసరి నారాయణరావు గారు దానికి మాటల రచయిత. విధంగా 1971 లో నా సినీ జీవితం మొదలైంది.

ఆ సినిమా అయ్యాక కె.ఎస్.ర్.దాసు గారి దర్శకత్వంలో, చలం హీరోగా, ఎమ్మెస్ రెడ్డిగారి కౌముది బేనర్‌లో తయారౌతున్న "ఊరికి ఉపకారి" అనే సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరాను. ఆ సినిమాకి పనిచేసినందుకు నాకు నెలకి 50 రూపాయలు జీతం వచ్చేది. అప్పటికి దాసరి నారాయణరావు గారు తన తొలి సినిమా 'తాతా-మనవడు' నిర్మించడంలో బిజీ గావున్నారు. నేను 'ఊరికి ఉపకారి" కి పనిచెయ్యడం అయ్యేసరికి, దాసరిగారి మొదటి సినిమా రిలీజవ్వడమూ, అది ఘన విజయం సాధించడమూ జరిగింది. ఆయన రెండో సినిమాగా ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్ బేనర్ లోనే 'సంసారం-సాగరం' మొదలుపెడుతున్నారు. ఒకరోజు గురువు గారు నన్ను పిలిచి 'నరసింహా రావ్. అక్కడా ఇక్కడా ఎందుకు నా డిపార్ట్‌మెంట్లోనే పనిచేద్దువు గాని నా వద్దకి వచ్చెయ్.' అని ఆహ్వానించారు.

అంతకంటే కావలసిందేముందీ..సరే నన్నాను

రాఘవ గారికి పరిచయం చెయ్య డానికని ఒక రోజు వారి ఆఫీసుకి తీసుకెళ్ళారు. రాఘవగారు కూర్చుని ఉన్నారు. గురువు గార్నీ, నన్నూ చూసి 'రావయ్యా..నారాయణ రావ్..రా..' అని ఆహ్వానించారు. ఆయన్ని కూర్చోమన్నారు. నేను నిలుచునే ఉన్నాను.

"రాఘవ గారూ..ఇతని పేరు నరసింహారావు.. మా వూరే. డాక్టరుగారి అబ్బాయి.. మన సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పెట్టుకుందామనుకుంటున్నాను." అని పరిచయం చేశారు గురువుగారు.



ప్రేమకు పది సూత్రాలు షూటింగ్‌లో

"ఓహో..అలాగా..బాబూ..బయట ఆఫీస్ బోయ్ వున్నాడు. వెళ్ళి రెండు కాఫీలు తీసుకురమ్మని చెప్పు" అన్నారు రాఘవగారు.

'అరె..ఇదేమిటీ ఇతడ్ని కూర్చోమనీ అనలేదు.. పైగా డాక్టర్ గారి అబ్బాయిని కాఫీలు తెమ్మంటున్నారు' అని గురువుగారు కాస్త కంగారు పడడం గమనించాను. ఐనా నేనేమీ ఫీల్ కాకుండా బయటికి వెళ్ళి గోపాల్ అనే ఆఫీస్ బోయ్ ఉంటే అతనికి చెప్పి, లోనికి వచ్చేశాను. కాఫీలు వచ్చాయి. వాళ్ళిద్దరూ తాగుతున్నారు. నేను చేతులు కట్టుకుని నిలబడి ఉన్నాను. గురువుగారు ఇబ్బందిగా ఫీల్ అవుతున్నారని తెలుస్తోంది. కాఫీలు పూర్తవగానే..

"ఈ కప్పులు బయట పెట్టిరా.." అన్నారు రాఘవగారు నాతో..

ఇంక ఆగలేక గురువుగారు.. "సార్..అతను మావూరి డాక్టర్ గారి అబ్బాయి.." అన్నారు. రాఘవగారు - ఆగమన్నట్టుగా చేత్తోనే సైగచేశారు. నేను ఖాళీ కాఫీ కప్పులు బయటపెట్టి వచ్చాను.

"శెభాష్..నరసింహారావ్.. సినిమాల్లో పైకి వస్తావయ్యా. ఒక్కటే గుర్తు పెట్టుకో, సినిమా ఫీల్డ్‌లోకి వచ్చాక నీ గతం మరచిపో. మానాన్న గారు డాక్టర్ గారు, చిటికేస్తే వందమంది వస్తారు. అలాంటిది నేను ఇలాంటి పనులు చెయ్యడమేమిటీ.. లాంటి భావాలు పెట్టుకోకూడదు. సినిమాలో డైరెక్టర్ కావాలనుకున్నప్పుడు రకరకాల వ్యక్తులతో డీల్ చెయ్యాల్సి వస్తుంది. అహం అనేది మనకి మొదటి శత్రువు" అని చెప్పారు రాఘవ గారు. అది నాకు పెద్ద సందేశం. ఆ మాట నామీద విపరీతమైన ప్రభావం చూపించింది. అది మొదలు ఏరోజూ నేను మావూళ్ళోని నా ఫేమిలీ హోదాని మనసులోకి రానివ్వలేదు.

అప్పటినుంచీ మొదలుకుని 1979 వరకూ గురువుగారు దాసరి గారి వద్దనే అనేక సినిమాలకి అసిస్టెంట్‌గా, అసోసియేట్ గా, కో-డైరెక్టర్ గా పనిచేశాను. సంసారం - సాగరం, రాధమ్మ పెళ్ళి, సీతారాములు, సర్కస్ రాముడు, తిరుపతి.. వగైరా సినిమాలన్నింటికీ గురువుగారి వద్దనే పనిచేశాను. మరో డైరెక్టర్ వద్దకి వెళ్ళలేదు.

ఆ అరేడు సంవత్సరాల్లో గురువుగారి వద్ద చాలా క్రమశిక్షణ నేర్చుకున్నాను. ఆయన వర్క్ హాలిక్. రోజుకి 20 గంటలు పనిచేసేవారు. నాటకాలనుంచీ వచ్చిన ఆ యనకి సినిమానే ధ్యాస. సినిమానే శ్వాస. అంత క్రమశిక్షణతో కష్టపడుతుండడంతో , నాకే కాదు, ఆయనతో పనిచేసిన చాలా మందికి ఒక తాగుడు కానీ, పేకాట కానీ, మరో దురలవాటు గానీ..అస్సలు దగ్గరికి రాలేదు.


చిక్కడు దొరకడు కాశ్మీరులో షూటింగు జరిగినపుడు

1979 ప్రాంతాల్లో గురువుగారే తారకప్రభు ఫిల్మ్స్ అనే బేనర్‌ని, స్థాపించి తన వద్ద పనిచేసిన అసోసియేట్స్‌తో వరుసగా సినిమాలు తియ్యాలని ప్లాన్ చేశారు. ముందుగా నా కొలీగ్ దుర్గానాగేశ్వర రావు గారికి అవకాశం ఇచ్చారు. రెండో సినిమాగా నాతో 'చందమామ' అనే సినిమా తియ్యాలని సంకల్పించారు. కానీ అనేక కారణాల వల్ల ప్రోజెక్టు మొదలు

కాలేదు.

ఇంతలో గురువుగారితో లోగడ సర్కస్ రాముడు సినిమా నిర్మించిన కోవై చరియన్ అనే తమిళ నిర్మాత మరో సినిమా చేసిపెట్టమని గురువుగారి వద్దకి వచ్చారు. అప్పటికే నాతో అనుకున్న సినిమా ఆగిపోవడం వల్లనూ, నాకు మంచి అవకాశం ఇప్పిద్దామని అనుకోవడం వల్లనూ, ఆయన నిజంగా బిజీగా వుండడం వల్లనూ.. గురువుగారే "నేను బిజీగా వున్నాను. ఐతే నా పర్యవేక్షణలో ఈ కుర్రాడు డైరెక్ట్‌చేస్తాడు..' అని ఆ నిర్మాతని ఒప్పించి మళ్ళీ నాతో 'చందమామ' సినిమా ప్రారంభింప చేశారు. ఆ సినిమాకి మాటలు గురువుగారే రాశారు. మురళీ మోహన్, సరిత, మోహన్ బాబు, ఫటాఫట్ జయలక్ష్మి.. వగైరా తారాగణం. నెలరోజుల్లో షూటింగ్ పూర్తిచేసి మరో నెలరోజుల్లో రిలీజ్ కి సిద్ధం చేశాను. కానీ 'చందమామ' ని అమావాశ్య చీకటి కమ్మేసింది. సినిమా రిలీజ్ కాలేదు..అనేక కారణాలు. నాతో బాటే గురువు గారు కూడా చాలా బాధ పడ్డారు. నా కెరీర్‌కి పెద్ద స్పీడ్ బ్రేకర్ పడింది..


1980 వ సంవత్సరం. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్న రోజుల్లో ఎన్టీరామారావుగారి బావమరిదికి బావమరిది రామ్మోహనరావు అనే ఆయన (ఈయన్నే రాంబాబు అనికూడా అనేవారు) తనకో సినిమా చేసిపెట్టమని గురువుగారి వద్దకి వచ్చారు. రాంబాబు గారు అప్పటికే రెండు సినిమాలు నిర్మించారు. ఎప్పటిలానే గురువుగారు ఒకేసారి అనేక సినిమాలతో బిజీగా వున్నారు. మళ్ళీ నన్నే రికమెండ్ చేశారు. అలా 1980 ద్వితీయార్థంలో మొదలైంది 'నేనూ - మా ఆవిడా' సినిమా. గురువుగారే అన్ని సలహాలు ఇచ్చారు, సినిమాలో ఒక పాట కూడా రాశారు. ఆ సినిమా రికార్డింగ్ ముహూర్తానికి పూజ చేసింది శ్రీ ఎన్టీఆర్ గారు. మొదటిషూటింగ్ ప్రకాష్ స్టూడియో లో జరిగింది. బాలకృష్ణగారు కెమేరా స్విచ్ ఆన్ చేశారు. గురువుగారు క్లాప్ కొట్టారు.



శ్రీ దిలీప్‌కుమార్, సుబ్బిరామిరెడ్డితో


మొదటి సీన్ చంద్రమోహన్, ప్రభ గార్ల మీద తీశాను. కథాంశం విచిత్రంగా మొదలౌతుంది. చంద్రమోహన్ బ్రహ్మచారి. ఎవరూ అద్దెకి ఇల్లు ఇవ్వకపోతే తనకో భార్య ఉందనీ, తొందరలోనే పుట్టింటినుంచీ వస్తుందనీ, ఏదో ఫోటో స్టూడియోలో ఒక అమ్మాయి ఫోటో సంపాదించి నిర్మలమ్మ ఇంట్లో అద్దెకి దిగుతాడు. ఒక రోజు ఫ్రెండ్స్ వస్తున్నారని గారెల పిండి రుబ్బుతుంటే తలుపు చప్పుడౌతుంది. తలుపు తీస్తాడు. ఎదురుగుండా సూట్ కేస్‌తో ప్రభ.! తను స్టూడియోనుంచీ తెచ్చిన ఫోటోలో ఉన్న అమ్మాయే.! అతనికేమీ అర్థం కాలేదు. నివ్వెరపోయి చూస్తున్న అతన్ని అడ్డుతప్పుకోమని "ఏమిటండీ అలా చూస్తారు. మీరేగా ఇల్లు అద్దెకి దొరికింది రమ్మని రాశారు..అడ్డం తప్పుకోండి.." అంటుంది. అదీ మొదటి షాట్..!

ఆ సినిమాని కూడా అతి తక్కువ సమయంలో పూర్తి చేసి నాలుగునెలల్లో 1981 లో రిలీజ్ చేశాం. ముందుగా మద్రాసులో ప్రివ్యూ చూశాక, విజయవాడ ప్రెస్ మీట్‌కి వెళ్ళి వినోద టాకీస్ లో ఆడియన్స్ మధ్య కూర్చుని చూశాను. సినిమా సూపర్ సక్సెస్ ఐంది. 100 రోజులు డింది. కామెడీ డైరెక్టర్ గా మొదటి సినిమా తోనే గుర్తింపు దొరికింది. స్పీడ్ బ్రేకర్ ని దాటి నా కెరీర్ ఊపందుకుంది.




మళ్ళీ అదే నిర్మాత, అదే హీరోతో 'ఏమండోయ్ శ్రీమతి గారూ..' సినిమా తీశాము. అదీ 100 రోజుల సినిమా. మళ్ళీ అదే బేనర్‌లో చంద్రమోహన్ , ప్రభలతో 'ఇల్లంతాసందడి' అనే సినిమా తీశాం. అదీ సూపర్ హిట్.. ఇంక నా కెరీర్ ఒక గాడిలో పడింది. కామెడీ సినిమాలకి ఇతనే సరైన వాడు అనే ముద్ర పడిపోయింది.

ఐతే నా నాలుగవ సినిమాగా మొదట్లో ఆగిపోయిన నా రిలీజ్ కాని మొదటి సినిమా 'చందమామ' విడుదలయ్యింది. కానీ అది ఫ్లాప్ ఐంది. ఐనా అప్పటికే మూడు సూపర్ హిట్ సినిమాలు ఇచ్చి ఉండడం వల్ల ఆ ఫ్లాప్ నా కెరీర్‌కేమీ అడ్డంకి కాలేదు. అప్పటినుంచీ ..ఇప్పటివరకూ ఇంక వెనక్కి తిరిగి చూసే అవసరం రాలేదు.




సినిమా రంగంలో గురువుగారి తరువాత నన్ను విపరీతంగా ప్రభావితం చేసింది కన్నడ కంఠీరవ శ్రీ రాజ్ కుమార్ గారు. కన్నడంలో ఏడు సినిమాలు నా దర్శకత్వంలో రూపొందాయి. రాజ్ కుమార్ గారి అబ్బాయిలతో కూడా సినిమాలు తీశాను. రాజ్ కుమార్ గారి వద్దనుంచీ క్రమశిక్షణలో, అందరితో మంచిగా వుండడంలో కొత్త పాఠాలు నేర్చుకున్నాను. నా కెరీర్ ని తీర్చిదిద్దుకోవడంలో సహకరించిన ఇలాంటి మహాను భావులందరికీ నేనెప్పుడూ ఋణపడి ఉంటాను.

**Featured in October 2007**



# సురేందర్ రెడ్డి

*మొట్టమొదటగా దర్శకత్వం వహించిన సినిమా 'అతనొక్కడే' తో, నిజంగా నూతన దర్శకుల్లో అతనొక్కడే అన్న పేరు తెచ్చుకుని సంచలనాత్మకమైన చరిత్ర సృష్టించిన యువ దర్శకుడు సురేందర్ రెడ్డి, రెండో సినిమా 'అశోక్' ఒక మోస్తరుగా ఆడినా మళ్ళీ మొన్ననే విడుదలైన 'అతిథి' తో మరో విజయాన్ని చేజిక్కించుకున్నాడు. ఆయన మొదటి సినిమా వరకూ జరిగిన జీవనపయనాన్ని ఇలా పంచుకుంటున్నారు.*

మాది కరీంనగర్ జిల్లాలోని మాచంపల్లి అనే గ్రామం. నాన్నగారు (వీరారెడ్డి) నా చిన్నతనంలో ఊరికి సర్పంచ్ గా వుండేవారు. మాది సంపన్న కుటుంబమే. మేము మొత్తం ఆరుగురం సంతానం. నేను నాలుగో వాడిని. నాకు ఒక అక్క, ఇద్దరు అన్నయ్యలు, ఇద్దరు చెల్లెళ్ళు. దేనికీ లోటులేని సంసారం. నాన్నగారికి రాజకీయంగా కూడా బాగా పలుకుబడి ఉంది. పదో తరగతి వరకూ నా చదువు సరస్వతీ గురుకుల విద్యాలయంలో సజావుగానే సాగింది. ఇంటర్మీడియట్ నుంచీ చదువు సరిగా సాగలేదు. ఎందుకో చదువుమీద ఆసక్తి పోయింది. డిగ్రీకి మధ్యలోనే గుడ్ బై చెప్పేసి హైదరాబాదు వచ్చేశాను. ప్రత్యేకంగా నాటకాలు, సాహిత్యం, సినిమాలు అనేవాటిమీద ప్రత్యేకమైన ఇంట్రెస్టు పెద్దగా ఏమీ లేదు కానీ మణిరత్నం గారి 'ఘర్షణ', 'వర్మ' గారి శివ నామీద చాలా ప్రభావం చూపించాయి. సినిమా విజయంలో దర్శకుడికి గల పాత్రనీ, దర్శకుడు తలచుకుంటే సృష్టించగల అద్భుతాలకీ అవి నిదర్శనాలు. అవి చూసినప్పుడే సినిమాల్లోకి వెళ్ళి దర్శకుడిగా పేరు తెచ్చుకోవాలని అనుకునేవాడిని.





హైదరాబాదు చేరుకున్నాక గానీ సినిమాల్లో అవకాశం అనేది అంత సులువుకాదని తేలీలేదు. హైదరాబాదు రావడానికి ఇంట్లో వాళ్ళేమీ ఎదురు చెప్పలేదు కానీ 'అన్నీ ఉన్న ఫేమిలీ కదా ఎందుకునువ్విలా వెళ్ళడం' అనే ఫీలింగ్ వుండేదేమో. నాతో ఎప్పుడూ అనలేదు. నన్ను డిస్కరేజ్ చెయ్యలేదు కూడా. హైదరాబాదులో మా బావగారి ఎపార్ట్‌మెంట్‌లో ఉండేవాడిని. చేతిలో డబ్బులుంటే అద్దె కట్టే వాడిని లేకుంటే లేదు. నేనంటూ నిరూపించుకోవాలనీ, సొంతంగా కాళ్ళ మీద నిలబడాలని వచ్చాను కాబట్టి ఇంట్లోంచి డబ్బులు అడిగి తెప్పించుకోవడం నామోషీగా వుండేది. ఫ్రెండ్స్ సహకారంతోనే రోజులు గడిపేవాడిని.

వాళ్ళనడగడానికి కూడా ఇబ్బందిగా ఉన్నప్పుడు చేతిలో డబ్బులు సరిపోక సరిగా భోజనం చెయ్యని రోజులుకూడా ఉన్నాయి. అందరూ 'అన్నీ ఉన్నవాడివి ..ఎందుకిలా ఇబ్బందులు పడడం..'అనేవాళ్ళు. కానీ నాలో పట్టుదల అన్నింటినీ భరించేలా చేసింది. అప్పట్లోనే తెలుగు చలనచిత్ర పరిశ్రమ మద్రాసునుంచీ హైదరాబాదుకి వచ్చింది. ఇప్పుడున్నంత సౌకర్యవంతమైన వాతావరణం అప్పట్లో లేదు. ఎవ్వరూ దగ్గరికే రానిచ్చేవారు కాదు.

ఆ విధంగా దాదాపు రెండేళ్ళు గడిచాక వర్ధమాన దర్శకులు టి.ప్రభాకర్ గారి వద్ద అసిస్టెంట్ గా పనిచేసే అవకాశం వచ్చింది. ఎవరో డిస్ట్రిబ్యూటర్ ని పట్టుకుని ఆయన రికమండేషన్ ద్వారా ప్రభాకర్ గారి వద్ద చేరాను. తరువాత రెండో సినిమా కూడా ఆయన వద్దనే అసిస్టెంట్‌గా చేశాను. ఆయనా తరువాత ఎక్కువ సినిమాలు చెయ్యలేదు. అప్పుడు క్రాంతికుమార్ గారి వద్ద అసిస్టెంట్ గా చేరి 'అరుంధతి', 'పాడుతా తీయగా','సుబ్బరాజుగారికుటుంబం','ప్రేమించేదిఎందుకమ్మా','9 నెలలు' వరకూ ఆయన వద్దనే చేశాను. ఆయనకి నేను ప్రియశిష్యుడ్ని. ఆ తరువాత ఉషాకిరణ్ వారి 'నీతో..' సినిమాకికూడా చేశాను. ఎప్పటినుంచో అనుకుంటున్న కథని పక్కాగా పూర్తిచేసుకుని సొంతంగా దర్శకత్వం చెయ్యాలని 2003లో ప్లాన్ చేసుకున్నాను. అప్పటికి హైదరాబాదు వొచ్చి ఏడెమినిది సంవత్సరాలు ఐంది. ఫీల్డ్ లోకి వచ్చి ఐదు సంవత్సరాలు అయింది. కానీ ఎవ్వరితోనూ ఎక్కువ పరిచయాలు ఉండేవి కాదు. ఇప్పటికీ అంతే.. సెట్ కి వెళ్ళడం, పనిపూర్తయ్యాక, ఇంటికి వెళ్ళిపోయి నా ఫ్రెండ్స్ తో సమయం గడపడం అంతే నా దినచర్య. అందుకే నేను ఇండస్ట్రీలో ఎక్కువమందికి తెలీదు, నాకూ ఎక్కువమందితో పరిచయంలేదు.





'అతనొక్కడే' స్క్రిప్టు అనుకున్నాక అప్పటి ఒక వర్ధమాన హీరో తండ్రిని కలిసి సినిమా ప్రపోజల్ చెప్పాను. ఆయన ఉత్సాహం చూపించలేదు. తరువాత కళ్యాణ్ రామ్ ని కలుసుకుని స్క్రిప్టు వినిపించగానే వెంటనే ఒప్పుకుని ఖచ్చితంగా తనే చేస్తానని చెప్పారు. ఐతే అప్పుడే ఆయన మొదటి సినిమా షూటింగ్ లో ఉంది. అప్పుడప్పుడే పైకి వస్తున్న ఒక నిర్మాత ఈ సినిమాని నిర్మించడానికి ఒప్పుకున్నారు. మొత్తం ప్రోజెక్ట్ అంతా చాలా తొందరగానే ఫైనలైజ్ అయిందనిపించింది. కళ్యాణ్ తన సినిమాలో ఉంటే నేను రోజూ ఆ నిర్మాతగారి ఆఫీసుకి వెళ్ళి స్క్రీన్‌ప్లే వగైరా మిగతా విషయాలన్నీ డిస్కస్ చేస్తుండేవాళ్ళం. ఎన్ని నెలలు గడిచినా నిర్మాత సినిమా మొదలు పెట్టడం గురించి మాట్లాడ్డం లేదు. రోజూ ఉదయం నుంచీ సాయంత్రం దాకా వాళ్ళ ఆఫీసులో నే కూర్చుండే వాడిని. దాదాపు ఏడు నెలలు గడిచాయలా..



ఇంతలో కల్యాణ్ రామ్ మొదటి సినిమా 'తొలిచూపులోనే' (అక్టోబర్ 2003) రిలీజయ్యింది. బాగా నడవలేదు. అంతే.. ఇంతకాలం తన చుట్టూ తిప్పించుకున్న నిర్మాత వెనక్కి తగ్గారు. తను ఈ సినిమా చెయ్యనని చెప్పారు. అదే సంవత్సరం డిసెంబర్ లో విడుదలైన కళ్యాణ్ రెండో సినిమా 'అభిమన్యు' కూడా బాక్స్ ఆఫీస్ వద్ద సరిగా పోలేదు. ఐతే నామీదా, నా స్క్రిప్టు మీదా నమ్మకం ఉన్న కళ్యాణ్ తనే నిర్మాతగా ఉంటానని ముందుకి వచ్చారు.. తనకి నిర్మాతగా మొదటి సినిమా, నాకు దర్శకుడిగా మొదటి సినిమా..

అన్నీ అనుకున్నాక కూడా సినిమా మొదలుపెట్టడానికి దాదాపు సంవత్సరం పాటు ఆగాల్సి వచ్చింది. అంటే మొత్తం మీద నేను కథా అన్నీ సిద్ధం చేసుకున్నాక కూడ నా మొదటి సినిమా సెట్స్ కి వెళ్ళడానికి సంవత్సరంన్నర పైగా పట్టింది,

ఎలాగైతేనేం.. 2004 నవంబర్ 15 న అన్నపూర్ణ స్టూడియోస్ లో ప్రత్యేకమైన పూజా కార్యక్రమంతో 'అతనొక్కడు' ప్రారంభమైంది. చంద్రబాబు నాయుడు గారు కెమేరా స్విచ్ ఆన్ చేయగా, మోహన్ బాబుగారు క్లాప్ కొట్టారు, బాలకృష్ణగారు మొదటి షాట్ కి దర్శకత్వం వహించారు. ఇంకా నాగార్జునగారు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారు, రామానాయుడు గారి లాంటి ప్రముఖులంతా ముహూర్తానికి హాజరయ్యారు. ఆ రోజే ప్రకటించాం 2005 వేసవి శెలవుల్లో రిలీజ్ చేస్తామని.



స్క్రిప్టు అనుకున్న వద్దనుంచీ కళ్యాణ్ కీ నాకూ సినిమా విజయం మీద పూర్తి నమ్మకం ఉంది. సినిమా పూర్తై, రిలీజ్ అవడానికి ఐదారు నెలలు పట్టింది. షూటింగ్‌లో కళ్యాణ్ మీద ఒత్తిడి ఎక్కువగా ఉండేది. ఎంతమంది వెనకాల ఉన్నా నిర్మాతగా అన్ని పనులూ చూసుకుంటూ హీరోగా కూడా చెయ్యడం..ఛాలెంజింగ్ గానే ఉండేది తనకి. దర్శకుడిగా నేను పెద్దగా టెన్షన్ పడలేదు. ముందునుంచీ పూర్తి క్లారిటీతో ప్రోజెక్ట్ మొదలుపెట్టాను కాబట్టి ఎక్కడా తడబాటు లేదు. ఐతే సినిమా షూటింగ్ జరుగుతున్నన్ని రోజులూ ఇండస్ట్రీలో ఎవరికీ మా సినిమా మీద నమ్మకాలు లేవు. ఎవరూ మా గురించి అంతగా పట్టించుకునే వాళ్ళు కాదు. మేమూ మా పనేదో మేము చేసుకుపోయే వాళ్ళం. సినిమా సక్సెస్ గురించి మాత్రం మా ఇద్దరికీ పూర్తి ధీమా ఉండేది.



2005 మే 7 న 'అతనొక్కడే' విడుదలైంది. రిలీజ్‌కి ముందు రోజు ప్రసాద్ లాబ్స్ లో ఎడిటర్ గారు, నేనూ కూర్చుని సినిమా చూశాము. సినిమా సక్సెస్ మీద మా కాన్ఫిడెన్స్ రెట్టింపు ఐంది. మరునాడు పొద్దునే, రిలీజ్ రోజు ఉదయం, మోర్నింగ్ షోకి హైదరాబాదులోనే సంధ్యా థియేటర్ కి వెళ్ళాను. సినిమా ఇంటర్వెల్‌కి ముందే తెలిసిపోయింది

సూపర్ సక్సెస్ అని. బయటి నుంచీ చాలా మంది అప్పుడే ఫోన్లు చెయ్యడం మొదలుపెట్టారు. ఆ ఆనందం మాటల్లో వర్ణించలేను. ఊహించిందే ఐనా అనుకున్నది సాధించాక కలిగే సంతోషం..దానికదే గ్రేట్ ఫీలింగ్. భవిష్యత్తులో ఇంకా మంచి హిట్లు ఇవ్వగలను కానీ ముందు ఎన్ని సాధించినా మొదటి సినిమా, మొదటి రోజు విజయాన్ని నిర్ధారించుకున్న క్షణం నా జీవితంలో ఒక మరపురాని జ్ఞాపకంగా మిగిలిపోతుంది..! ఆ ఫీలింగ్ గురించి ఇంతకంటే ఎక్కువగా వర్ణించలేను.

దాదాపు పది సంవత్సరాలు పాటు నేను ఒక్కడ్నే హైదరాబాదులో ఎలా వున్నా. ఏమి చేస్తున్నా నన్ను నిరుత్సాహ పరచని మా అమ్మా నాన్నలకీ మిగతా కుటుంబ సభ్యులకి నేను కృతజ్ఞతలు చెప్పుకోవాలి. నా విజయంలో వాళ్ళ పాత్ర ఎంతైనా ఉంది. అదే కనుక అప్పట్లో వాళ్ళు నామీద ఆంక్షలు పెట్టి 'ఎందుకలా ఒక్కడివే కష్టపడడం..హాయిగా ఇంటికి వచ్చెయ్యి..' అని ఒత్తిడి పెట్టి ఉంటే నా పరిస్థితి వేరుగా ఉండేదేమో.. అలా కాకుండా నామీద పూర్తి నమ్మకాన్నుంచిన మా వాళ్ళ ఆత్మీయతాను రాగాలు నాకు పెట్టని కోటలాగా ఉండి నన్ను ఇంతదూరం నడిపించాయి. అలానే మొదటి సినిమా దర్శకత్వానికి అవకాశం కల్పించిన కళ్యాణ్‌కీ, ఆదరించిన ప్రేక్షకులకి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

**Featured in November 2007**

# శ్రీనివాసరెడ్డి



మాది పశ్చిమగోదావరి జిల్లా, తణుకు తాలూకా, పెనుమంద్ర మండలంలోని వెలగలవారిపాలెం అనే పల్లెటూరు. నాన్న గారు సబ్బెళ్ళ కామిరెడ్డి అమ్మగారు బుల్లెమ్మాయి. నాన్నగారు వ్యవసాయం చేస్తుండేవారు. మాది మధ్యతరగతి కుటుంబం. అమ్మా, నాన్నలకి లేక లేక కలిగిన ఒక్కడే కొడుకుని నేను. 1969లో నేను పుట్టేటప్పటికి నాన్నగారి వయసు 45 ఏళ్ళు. నర్సాపూర్ లోని క్రిస్టియన్ మిషనరీ హాస్పిటల్లో నాకు జన్మనిచ్చింది అమ్మ. ఒక్కడినే అవడం వల్ల చిన్నప్పటినుంచీ అతి గారాబంగా చూసుకునే వాళ్ళు. ఎలిమెంటరీ స్కూలు చదువంతా మా పల్లెటూరులోనే సాగింది. తరువాత హైస్కూలు కోసం మూడు మైళ్ళ దూరంలో ఉన్న మండల కేంద్రంకి వెళ్ళాను. చదువులో పెద్ద చురుకుగా వుండేవాడిని కాదు. జస్ట్ ఏవరేజ్ స్టూడెంట్‌నే. ఐతే బయటి పుస్తకాలు ఎక్కువగానే చదువుతుండేవాడిని, వాటి ప్రభావం వల్ల పదో తరగతిలో ఉండగానే సొంతంగా కథలు వ్రాస్తుండేవాడిని. ఒకటి రెండు కథలు పత్రికల్లో వచ్చాయి కూడా. ఇది గమనించిన మిత్రులు 'ఒరేయ్..పత్రికల్లో పడే స్థాయి కథలు రాస్తున్నావు..నువ్వింక సినిమాల్లోకి వెళ్ళి పోవాల్సిందే.'అని చెవిని ఇల్లు కట్టుకుని పోరే వారు. వయసుచూస్తే 15 సంవత్సరాలు..రాసినవి ఏవో ఒకటి రెండు కథలంతే. అంత మాత్రానికే సినిమాల్లో అవకాశం వస్తుందా..!? అని ఆలోచించే వయసుకూడా కాదు.. అందరూ అంటున్నారు కాబట్టి సినిమాల్లోకి వెళ్ళాల్సిందే అనిపించింది. ఎందుకు అంటే దర్శకత్వం చెయ్యడానికి అప్పుడే అనుకున్నాను. కానీ సినిమా ఫీల్డు లోతెంతో అప్పటికి ఏమాత్రం తెలీదు.

1984 లో హైస్కూలు ఐపోయాక భీమవరం డి.ఎన్.ఆర్ కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేరాను. రెండు మూడు నెలలు మాత్రమే ఉన్నానక్కడ. సినిమా ధ్యాస నన్ను కాలేజీలో ఉండనివ్వలేదు. మధ్యలోనే మానేసి ఊరికి



వచ్చేశాను. సినిమాల్లోకి వెళ్ళాలి అంటే ఎలా అని వెతగ్గా, వెతగ్గా మా వూరికి దగ్గరలోనే వరుసకి చుట్టం అయే ఒక పెద్దాయన కనిపించారు. తనకి సినిమా రంగంలో చాలా మందితో పరిచయం ఉందనీ, తప్పని సరిగా నన్ను మద్రాసు తీసుకెళ్తాననీ ప్రోమిస్ చేశాడాయన.. రోజూ పొద్దున్నే ఐదింటికే వెళ్ళి ఆయన ఇంటి ముందు కూర్చునే వాడిని. ఆ మాటా, ఈ మాటా చెబుతుండే వాడు. సినిమా రంగం గురించి కథలు కథలుగా చెప్పేవాడు. ఆయన చెప్పిన మాటలు వింటూ, ఆ-యన చెప్పిన పనులన్నీ చేసేవాడిని. అలా ఆయన సేవలో రోజంతా గడిపి రాత్రి ఏ పొద్దుపోయాకో ఇంటికి చేరుకునే వాడిని. నా పట్టుదల గమనించిన అమ్మా నాన్నా కూడా నన్నేమీ అనలేదు. ఈ విధంగా

ఒకటీ..రెండూ..పదినెలలు..దాదాపు సంవత్సరం గడిచింది. ప్రతిసారీ ఏదో కథ వినిపించడమే తప్ప నన్ను మద్రాసు తీసుకెళ్ళే ప్రోగ్రాము గురించి ఆ పెద్దమనిషి ఏమీ ఇతమిత్థంగా తేల్చడం లేదు.. చివరలో బాగా నిరాశ వచ్చేసి కాస్త నిష్టూరంగా మాట్లాడే సరికి.. మరునాడే ఒక లెటర్ చూపించాడు..'ఇదిగోరా అబ్బాయ్..మద్రాసులో మనవాళ్ళు నిన్ను తీసుకుని రమ్మన్నారు..ఇంక బట్టలు సర్దుకుని వచ్చెయ్..' అని ఉత్తరం చూపించాడు. ఉత్తరంలో చాలా క్లియర్ గా వెంటనే వచ్చెయ్యమనీ దర్శకత్వ శాఖలో ఛాన్సు ఇప్పిస్తామనీ రాసి ఉంది. చాలా సంతోషించాను. కవర్ మూసేస్తూ ఎందుకో పోస్టల్ స్టాంపులు చూశాను.. అసలు గుట్టు తెలిసిపోయింది. ముందూ వెనుకా ఆ వూరి పోస్టు స్టాంపే ఉంది..అంటే అది ఆయన చేసిన మాయేనన్నమాట..!

ఇంక నా మనసు విరిగిపోయింది. అరే..సంవత్సరం పాటు ఇంట్లో పాలేరులా పనిచేయించుకున్నాడే..చివరికి ఇలా చేశాడా అని బాధతో ఇంటికి వచ్చేసి నాన్నకి చెప్పాను..'నాన్నా ఎలాగైనా మద్రాసు వెళ్ళి సినిమాల్లో చేరాల్సిందే..నువ్వే ఏదైనా చూడు..'అనిచెప్పాను. నా బాధనీ, పట్టుదలనీ గమనించిన నాన్న, మాకు దగ్గర బంధువే, వరుసకి నాకు బావ అయ్యే మల్లారెడ్డిగారిని (తాడేపల్లి గూడెం) సంప్రదించి, ఆయన్ని కూడా తీసుకుని నన్ను వెంట బెట్టుకుని మద్రాసు వెళ్ళారు 1986 ప్రాంతాల్లో . మాకు దూరపు బంధువు ఐన విజయారెడ్డి అనే ఆయనకి నన్ను అప్పగించారు నాన్నా, మల్లారెడ్డి గార్లు. విజయారెడ్డి గారు అప్పట్లో కన్నడలో ప్రముఖ డైరెక్టర్. తెలుగులో రాఘవేంద్రరావు, దాసరి నారాయణ రావు గార్లు ఎన్టీఆర్ తో హిట్స్ ఇచ్చినట్లే ఆయన కన్నడంలో రాజ్ కుమార్‌తో మంచి హిట్స్ ఇస్తున్నారు ఆ సమయంలో. ఫేమిలీ రిలేషన్స్ తో జరిగిన పరిచయమేమో ఆయన నన్ను బాగా చూసుకునే వారు. ఆయన చేస్తున్న కన్నడ సినిమా షూటింగ్‌కి వెళ్ళి అన్నీ పరిశీలిస్తూ ఉండేవాడిని. అలా రెండు సినిమాలకి చేశాను.. ఐతే సీరియస్‌గా డైరెక్షన్ డిపార్ట్‌మెంట్లో కి దిగలేదు.

ఒక రోజుకి ఆయనే అన్నారు ..'నీకు తెలుగు ఫీల్డ్ ఐతేనే బెటరు..మద్రాసులో నాకు తెలిసిన తెలుగు డైరెక్టర్లకి పరిచయం చేస్తాను.'అని నన్ను వెంటబెట్టుకుని తనకి తెలిసిన డైరెక్టర్లందరి దగ్గరకీ తీసుకెళ్ళారు. చివరికి **మల్లెమాలగారి ద్వారా వాళ్ళు అప్పుడు తీస్తున్న 'ఆహుతి' సినిమాకి అప్రెంటిస్ గా చేరాను. అదీ నాకు తెలుగు సినిమా రంగంతో నా తొలి పరిచయం.** తరువాత '-అంకుశం' సినిమాకి అసిస్టెంట్‌గా ప్రమోట్ చేశారు శ్యాం ప్రసాద్ రెడ్డి గారు. సరిగ్గా చెప్పాలంటే అసిస్టెంట్ డైరెక్టర్‌గా నా పేరు తెరమీద పడిన మొదటి సినిమా 'అంకుశం'. శ్యాం ప్రసాద్‌రెడ్డి గారు నాకు మొదటి జీతం 500 రూపాయలు 1988 మే 31 వ తేదీన హైదరాబాదులోని పద్మాలయా స్టూడియోలో ఇచ్చారు. అది నా తొలి సంపాదన..

> ఆయనతో ఇంటర్వ్యూ కోసం ఫోన్ చేసినప్పుడు రింగ్ టోన్‌గా వినిపించిన పాట 'మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది...ఎదిగిన కొద్దీ ఒదగమనీ అర్థమందులో ఉంది..' అన్నపాట వినిపించింది. ఆయనతో గంటన్నరసేపు మాట్లాడాక.. ఆపాటనే ఆయన ఎందుకు రింగ్ టోన్ గా ఎన్నుకున్నారో అర్థమయింది..!

చిన్నప్పటినుంచీ నాకు ఒక కోరిక ఉండేది. మావూళ్ళో మా అమ్మకి కట్నంగా ఇచ్చిన పొలం ఒక ఎకరం ఉండేది. ఎప్పటికైనా అందులో ఒక వృద్ధాశ్రమం, అనాథ శరణాలయం, ఒక ఆసుపత్రి కట్టించాలని ఉండేది. నా మొదటి జీతం అందుకోగానే మద్రాసు వచ్చి అందులో 380 రూపాయలతో అమ్మా, నాన్నలకి బట్టలు కొన్నాను. అక్కడే

టి.నగర్ లో ఉంటున్న శాస్త్రి గారనే వాస్తు పండితుడి వద్దకెళ్ళి మా వూళ్ళో ఎకరం పొలంలో కడదామనుకున్న ఆశ్రమం, ఆసుపత్రులగురించి వాస్తు విషయంలో సంప్రదింపులు జరిపాను. అవన్నీ కట్టడానికి అవసరమైన డబ్బు నా వద్ద లేదు . ఐనా మొదటి సంపాదన రాగానే ఆ ఆలోచనకి పునాది వెయ్యాలని అలా చేశాను. 500 ల్లో అమ్మా, నాన్నలకి బట్టలు కొనగా మిగిలిన 120 రూపాయల శాస్త్రి గారికి ఇచ్చాను. నా వయసూ. నా మొదటి సంపాదనా చూసిన శాస్త్రి గారు ఫీజు తీసుకోడానికి ఒప్పుకోలేదు. నా తృప్తికోసం తీసుకోమని బలవంతాన ఆయన చేతిలో పెట్టి, రైలెక్కి మావూరికి వెళ్ళాను. అమ్మా. నాన్నలు నేను తెచ్చిన కొత్త బట్టలు కట్టుకోగానే, ఫోటోలు తీసి ఎంతో సంబరపడ్డాను. నా జీవితం ఒక గాడిలో పడుతోందని తెలుసుకున్న అమ్మానాన్నలు కూడా ఆనందించారు. ఆ విధంగా అంకుశం సినిమాకి పనిచేస్తూ కోడి రామకృష్ణ గారి వద్ద మొదటి పాఠాలు నేర్చుకున్నాను.

ఆ సినిమా అయ్యాక గోవిందరెడ్డి, నరసారెడ్డి అనే నిర్మాతల పరిచయం వల్ల వాళ్ళు తీస్తున్న 'రక్తకన్నీరు' అనే సినిమాకి జి.రామ్మోహన రావు గారి వద్ద అసిస్టెంట్ గా చేరాను. అప్పటినుంచీ ఆయనవద్దనే మరో 3-4 సినిమాలు చేశాను. తరువాత ఆయనకీ సినిమాలు తగ్గడంలో నాకూ కష్టకాలం వచ్చింది.

రూము అద్దె కట్టడంకూడా కష్టంగా వుండేది. దాదాపు రోడ్డున పడ్డ పరిస్థితి. ఉన్నప్పుడు తినే వాడిని..లేకుంటే పస్తులే.. ఆ సమయంలో ముక్కామల శ్రీరామకృష్ణ అనే ఆయన నన్ను ఆదుకున్నారు. అప్పటికి ఆయనా చిత్రసీమలో అంతగా నిలదొక్కుకోలేదు (ప్రస్తుతం డబ్బింగ్ సినిమాలకి నెంబర్ వన్ రైటర్ శ్రీరామకృష్ణ గారే ఈయన. బొంబాయి సినిమా మొదలుకుని ప్రస్తుతం తయారయ్యే అన్ని పెద్దస్టార్ల డబ్బింగ్ సినిమాలకీ ఆయనే మాటలు రాస్తుంటారు). నాకు ఉన్న కొద్ది పాటి పరిచయంతోనే నా కష్టాలు తెలుసుకుని తనింటికి తీసుకెళ్ళారు. ఆయన భార్య గారు, ఆయన వాళ్ళిద్దరూ నన్ను సొంత బిడ్డలా చూసుకున్నారు. దాదాపు 8 నెలల పాటు వాళ్ళింట్లోనే ఉంచుకున్నారు. శ్రీరామకృష్ణగారిని నాన్న (తమిళ్ లో అప్పా) అని పిలిచే వాడిని. వాళ్ళు పరమ నిష్ఠాగరిష్ఠులైన బ్రాహ్మణులు. ఐనా నన్ను వారిలో ఒకరిగా చూసుకుని నాకు మానవత్వానికి నిజమైన నిర్వచనమేమిటో తెలియచేశారు. 8 నెలలూ వాళ్ళు నన్ను ఆదుకోకపోతే ఏమైపోయేవాడినో అనిపిస్తుంది. అలా రామకృష్ణగారి ఆతిథ్యంలో ఉంటూనే మళ్ళీ సినిమాల కోసం ప్రయత్నాలు చేస్తూ ఉండేవాడిని.



మళ్ళీ గోవిందరెడ్డి, నరసా రెడ్డి గార్లే డాక్టర్ భవాని అనే సినిమా తీస్తూ దాని దర్శకుడు వై.నాగేశ్వరరావు గారి వద్ద దర్శకత్వ శాఖలో పనిచేసే అవకాశం కలిపించారు. అక్కడినుంచీ నాగేశ్వరరావు గారి వద్దనే 4-5 సంవత్సరాలు 1993 వరకూ 'దోషి-నిర్దోషి', 'అత్తసొమ్ము అల్లుడు దానం' 'మొండి మొగుడు పెంకి పెళ్ళాం', 'ప్రయత్నం' ..వగైరా సినిమాలకి పనిచేశాను. నామీద దర్శకుడిగా నాగేశ్వరరావు గారి ప్రభావం విపరీతంగా ఉంది.

ఇక్కడింకో విషయం చెప్పాలి. నాగేశ్వరరావు గారితో పరిచయం కేవలం ప్రొఫెషనల్ గానే కాక పర్సనల్‌గా

కూడా వాళ్ళ కుటుంబ సభ్యుల్లో ఒకరిగా చూసుకునేవారు. నాగేశ్వరరావుగారు, ఆయన భార్య శ్రీమతి శివ పార్వతిగారు నిజంగా పార్వతీ పరమేశ్వరుల్లాంటి వారు. వాళ్ళింట్లో భోజనం చేసేప్పుడు.. ఉదయం మిగిలిన అన్నం ఏమైనా ఉంటే అది వాళ్ళు పెట్టుకుని అతిధులకి వేడి వేడి అన్నం పెట్టేవారు. వారి ఆప్యాయతానురాగాలు జీవితంలో మరిచిపోలేను. విజయం వచ్చినప్పుడు పొంగిపోకుండా, కష్టాలు వచ్చినపుడు కుంగిపోకుండా స్థితప్రజ్ఞతతో ఉండడమనేది వాళ్ళ వద్దనుంచే నేర్చుకున్నాను. పదిమందితో మంచిగా ఉండడం, పరోపకారమే మనకి కలకాలం కలిసొచ్చే నేస్తం.. ఇలాంటి భావాలన్నీ వాళ్ళే నాకు నేర్పారు. ఈ రోజు అందరూ శ్రీనివాసరెడ్డి మంచి వాడు అంటున్నారంటే ఇందుకు కారణం నాగేశ్వరరావు గారి సాహచర్యంలో నేను పెంపొందించుకున్న వ్యక్తిత్వమే.. చివరలో నాగేశ్వరరావు గారికీ సినిమా అవకాశాలు తగ్గిపోయాయి. నాకు ఉపాథి చూపించలేకపోతున్నానే అని బాధపడుతుండే వారు.

1995 ప్రాంతాల్లో తనికెళ్ళ భరణి గారు పరిశ్రమ అంతా హైదరాబాదుకి వచ్చేస్తోంది, రమ్మని నన్ను ప్రోత్సహించారు. ఆయన సలహా పాటించి హైదరాబాదుకి మకాం మార్చాను. ఆయన రికమండేషన్‌తోనే శివనాగేశ్వరరావు గారి వద్ద కోడైరెక్టర్‌గా 'నాయనమ్మ', 'అదరహో..', 'వామ్మో..ఓ అత్తో..ఓ పెళ్ళామా..' సినిమాలకి పనిచేశాను. ఆ సమయంలోనే 1997 లో మా వూరి నుంచీ నా ప్రాణ మిత్రుడు ఆనందరెడ్డి అనే ఆయన మరో ముగ్గురు మిత్రులు ద్వారంపూడి శ్రీనివాస్ రెడ్డి, కర్రి రామలింగేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి గార్లని కలుపుకుని నా దర్శకత్వంలో సినిమా తీద్దామని నా వద్దకి వచ్చారు. సినిమా నిర్మాణంలో ఉన్న సాధకబాధకాలన్నీ వాళ్ళకి చెప్పాను. పెట్టుబడి పెట్టిన డబ్బుకి గ్యారంటీ కూడా ఉండదని వివరించి చెప్పాను. వాళ్ళు ఒక్కటే అన్నారు ' శ్రీనివాస్..ఈ సూట్ కేస్ తో తిరిగివెళ్ళేప్పుడు ఎవరైనా కొట్టేశారనుకో ..ఏమౌతుందీ..!? జీవితంలో దేనికీ గ్యారంటీ లేదు. ఫలితం ఏమైనా మేమేమీ అనుకోము. నిన్ను దర్శకుడిగా చూడాలన్నదే మా తపన' అని నన్ను ఒప్పించారు.

**ఆవిధంగా 1997 లో నాదర్శకత్వంలో మొదటి సినిమా 'ఆషాఢం పెళ్ళికొడుకు' మొదలైంది.** ఆలీ హీరో, రమ్యభారతి హీరోయిన్.. రాజమండ్రిలో ముహూర్తం , మొదటి షాట్ తీయడం జరిగాయి. ప్రముఖ నిర్మాత అచ్చిరెడ్డి గారు, ప్రముఖ తమిళ నిర్మాత మోహన్ నటరాజన్ గారూ వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆశీర్వదించారు. మొత్తం 35 రోజుల్లో సినిమా పూర్తిచేసి మరో నెలరోజుల్లో రిలీజ్ చేశాం. 4-5 వారాల సినిమాగా నడిచింది. దర్శకుడిగా నాకు గొప్ప పేరేమీ రాలేదు. ఐతే వెంటనే రెండో సినిమా 'ఫిబ్రవరి 14 నెక్లెస్ రోడ్' తీయడం జరిగింది. సుమన్, భాను ప్రియల కాంబినేషన్‌తో కేవలం 27 లక్షల బడ్జెట్ తో 18 రోజుల్లో సినిమా పూర్తి చేశాము. ఒక కొత్త కాన్సెప్ట్ తో తీశాననుకున్నాను. పాటలు కూడా లేవు. ఈ సినిమా కూడా అంతంత మాత్రంగానే 2-3 వారాలు నడిచింది. ఐతే లో బడ్జెట్ అవడం వల్ల నిర్మాతలకేమీ నష్టం రాలేదు...

ఈ రెండు సినిమాల తరువాతా నాకు బాగా గ్యాప్ వచ్చింది. రెంటిలో ఏదీ పెద్ద సక్సెస్ కాకపోవడంతో ఎక్కడా అవకాశాలు రాలేదు. అప్పుడు మొదలైంది జీవితంలో నాకు నిజమైన పరీక్షా సమయం. పెద్దగా సంపాదించిందీ లేదు. నెమ్మది, నెమ్మదిగా కష్టాలు ఒకటి తరువాత ఒకటిగా చుట్టుముట్టాయి. క్రమేణా పూట గడవడం ఎలా అనే స్థితికి వెళ్ళాను. పిల్లలు ఏడుస్తుంటే పాలు కూడా కొనలేని స్థితి. అద్దెకట్టాలంటే అప్పులు, ఇల్లు గడవాలంటే అప్పులు..తెల్సిన వాళ్ళుకూడా నేను దగ్గరైకి వస్తున్నానంటే 'ఎక్కడ డబ్బులు అడుగుతానో ' అని భయపడేవాళ్ళు. ఐనా ఆశ చావలేదు. తెల్సిన నిర్మాతలందరి వద్దకీ వెళ్తుండే వాడిని. అందరూ కథలు వినడమే తప్ప ఎవరూ నాతో సినిమా చేయడానికి ముందుకి రాలేదు. ఈ సమయంలోనే ఎప్పటినుంచీ నా మీద బెంగపెట్టుకున్న అమ్మ ప్రమాదవశాత్తూ

సిమెంటు తొట్టిలో పడి, మంచాన పడింది. దాదాపు మూడేళ్ళు అలా కష్టాలు పడి ఈ లోకం విడిచి వెళ్ళిపోయింది. అమ్మ వైద్యానికీ, నా ఖర్చులకీ చేసిన అప్పులు తీర్చడానికి చిన్నప్పటినుంచీ అమితంగా ప్రేమించిన మా ఒక్క ఎకరం పొలాన్నీ అమ్మక తప్పలేదు. ఐనా ఇంకా నా అప్పులు పూర్తిగా తీరలేదు.

మధ్యలోనే 'వైఫ్' అనే సినిమాకి రావిపల్లి రాంబాబుకి కో-డైరెక్టర్ గా కూడా చేశాను. కేవలం ఏదో కాలం జరగడానికే తప్ప అవకాశమూ నా బాధల్ని తీర్చలేదు. ఈ సినిమా చేసేప్పుడే సెట్స్ కి వచ్చి నా పనితనం గమనించిన మల్లెమాల ఎమ్.ఎస్.రెడ్డి గారు నా దర్శకత్వంలో 'అందం' అనే సినిమా మొదలుపెట్టారు. లండన్ యువతి హీరోయిన్, కౌశిక్ హీరో. సినిమా పూర్తయి , ఫస్ట్ కాపీ కూడా వచ్చింది కానీ విడుదలకి నోచుకోలేదు.

మిత్రులూ, నన్ను అభిమానించే వాళ్ళూ అందరూ నన్ను చూసి జాలిపడేవాళ్ళు..'పాపం..శ్రీనివాసరెడ్డి రా..మనవాడు చాలా మంచి వాడు..పాపం సరైన అవకాశాలు రావడం లేదు' అనుకుంటుండే వాళ్ళు. ఒక విధంగా 'పాపం' అనేది నా ఇంటిపేరులా స్థిరపడింది..!

ఇలా ఏం జరుగుతోందీ, నాకేమౌతోందీ, రేపేంటీ.. నా సంతానం సంగతేమిటీ నలువైపులా చుట్టుముట్టిన చీకట్లో మగ్గిపోతున్నప్పుడు ఒకరోజు పెద్దిరెడ్ల త్రినాథ్ అనే ప్రాత్రికేయ మిత్రుడు ఒకసారి రోడ్డు మీద కనపడి 'నిన్ను ఒక ప్రొడ్యూసర్ కి పరిచయం చేస్తాను..కథతో సిద్ధంగా వుండు..' అన్నాడు. ఈ మాటలు రోజూ వింటున్నవే కాబట్టి త్రినాథ్ మాటల్ని మామూలుగానే తీసుకున్నాను. ఐతే తను అన్నట్లే బెంగుళూరులో ఉన్న ప్రొడ్యూసర్ గారికి ఫోన్ చేసి నన్ను పరిచయం చేశాడు. ఆయన ఫోన్లోనే కాస్సేపు మాట్లాడాక 'త్వరలోనే హైదరాబాదు వస్తున్నాను..కలుద్దాం..' అనిచెప్పారు. నా అనుమానాలని అబద్ధం చేస్తూ అయన హైదరాబాదు రాగానే నన్ను పిలిపించారు. అరగంట మాట్లాడగానే 'నీతో సినిమా చేస్తున్నాను' అని తన నిర్ణయాన్ని చెప్పేశారు. మరి నాలో ఏమి నచ్చిందో, నామీద అంత నమ్మకం ఎలా వచ్చిందో కానీ ఆయన మాటల్ని నేనే నమ్మలేక పోయాను. ఆయనే నూకారపు సూర్యప్రకాశరావు గారు. **అలా మొదలైందే 'అదిరిందయ్యా చంద్రం'.!** అప్పుడే కష్టాలు తీరలేదు. ప్రొడ్యూసర్ గారైతే దొరికారు కానీ హీరో ఎలా. ఏ పేరూ లేని నాకు డేట్స్ ఇవ్వడానికి ఎవరు ముందుకొస్తారు..!? 'వైఫ్' చిత్రానికి పనిచేసినప్పుడు పరిచయమైన శివాజీని అడుగుదామని వెళ్ళాను. ఆయన డేట్స్ చూసే అమ్మిరాజు గారు నాకు మంచి మిత్రుడు. నేనంటే చాలా అభిమానం. (నా కష్ట కాలంలో ఈయనే చాలామంది సినీ ప్రముఖుల దగ్గరికి తీసుకెళ్ళి పరిచయం చేశారు. 'మంచి కుర్రవాడు..సినిమా సక్సెస్ కి నాదీ గ్యారంటీ..ఇతడితో సినిమా చెయ్యండి' అని రెకమెండ్ చేస్తుండేవారు) నాకు ఎలాగైనా సహాయం చెయ్యాలని అక్కడ కొన్నీ, ఇక్కడ కొన్నీ డేట్స్ చూసి మొత్తానికి శివాజీ గారి డేట్స్ ఇచ్చారు. సినిమా మొదలైంది.

ఈ సినిమా సహనిర్మాత కూనిరెడ్డి శ్రీనివాస్ గారు కూడా నాతోటే ఉండి సినిమా నిర్మాణంలో ప్రతి విషయంలోనూ నాకు ఏ ఇబ్బంది కలగకుండా చూసుకునే వారు. ఆయన ఇచ్చిన నైతిక స్థైర్యం అపారమైంది. ప్రొడ్యూసర్ గారి తో బాటుగా త్రినాథ్ గారు, శివాజీ గారు, అమ్మిరాజుగారు..నాకు ఫుల్ సపోర్ట్ నిచ్చారు. సినిమా రిలీజ్ ఐంది.. కొద్ది రోజుల్లోనే హిట్ సినిమాగా పేరు తెచ్చుకుంది. 7 **సెంటర్లలో** వందరోజులు ఆడింది. ఇది నాకు పునర్జన్మ..! **నిజానికి మీరు మొదటి సినిమా ఏది అంటే 'అదిరిందయ్యా చంద్రం..' అని చెప్పాలేమో.** ఈ సినిమా తోటే శ్రీనివాసరెడ్డి అనే డైరెక్టర్ ఒకడున్నాడని ఆంధ్రదేశంలోని ప్రేక్షకులందరికీ తెలిసింది.

నేను ఏదీ కాని రోజుల్లో నామీద నమ్మకం ఉంచి నాకు అవకాశాన్నిచ్చి పునర్జన్మ నిచ్చిన నూకారపు

సూర్యప్రకాశరావు గారు దేవుడితో సమానం. ఆయన ఋణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేము. మా ఇంట్లో దేవుడికి దణ్ణం పెట్టుకునేప్పుడు పక్కనే ఆయన ఫోటో కూడా పెట్టుకుంటాను. నిజానికి ఆయన రోజు నాకా అవకాశం ఇవ్వకపోతే ఏమైపోయి ఉండేవాడినో ఊహించలేను.. అందుకే ఆయన్ని తలచుకోని క్షణం ఉండదు. నేనే కాదు మా ఇంట్లో అందరూ అయనకి ఎప్పుడూ ఋణపడి ఉంటాము.

'అదిరిందయ్యా చంద్రం' విజయంతో జీవితం మళ్ళీ పట్టాలమీదికి ఎక్కింది. వెంటనే చాలా పెద్ద పెద్ద ప్రొడక్షన్ సంస్థలనుంచీ ఆఫర్స్ వచ్చాయి. కానీ శివాజీ నాకు చేసిన సహాయానికి గుర్తుగా ఆయన మిత్రులు తీసిన 'టాటా బిర్లా మధ్యలో లైలా' సినిమాకి దర్శకత్వం చేశాను. అదీ హిట్ టాక్ తెచ్చుకుని చాలా సెంటర్లలో వందరోజులు  ఆడింది. ఇంక ఇటీవల విడుదలైన 'యమగోల మళ్ళీ మొదలైంది' గురించి వేరే చెప్పాల్సిన అవసరం లేదు కదా.. 125 కేంద్రాల్లో 50 రోజులు ఆడి, కనీసం 30 సెంటర్లలో 100 రోజులు ఆడడానికి ఉరకలు వేస్తోంది.

కష్టాల్లో అమ్మేసిన  ఎకరం పొలాన్నీ మళ్ళీ కొనడానికి ప్రయత్నాలు చేస్తున్నాను. చిన్నప్పటినుంచీ నాకున్న కోరిక అందులో అనాథాశ్రమం, వృద్ధాశ్రమం, ఒక ఆసుపత్రి కట్టాలనేది. తప్పని సరిగా సాధించితీరుతాను. ఇంతదూరం వచ్చాను, ఇన్ని కష్టాలూ అనుభవించి పడిలేచాను. తప్పని సరిగా నేను ఊహించిన కలని నిజంచేసుకోగలననుకుంటున్నాను. మా పిల్లలని కూడా డాక్టర్లనే చేసి అక్కడే ఉండాలనేది నా ఆశయం. పేదలకి ఉచిత వైద్యం, ఉచిత భోజన సదుపాయాలూ, కన్నవాళ్ళు నిర్లక్ష్యం చేసిన వృద్ధులకి ఆసరా ఇవ్వాలనేది నా ఆశయం. ఇందుకు తగిన బలాన్ని భగవంతుడిస్తాడని నాగట్టి నమ్మకం.

ఈ మొదటి సినిమా అనుభవాలని ముగించే ముందు మీతో మరికొన్ని విషయాలు పంచుకోవాలి. ఈ 20 ఏళ్ళ సుదీర్ఘ ప్రయాణంలో ఎంతో మంది నాకు సహాయం చేశారు. నిస్వార్ధానికి అర్ధం తెలియచేశారు. నన్ను తమలో ఒకడిగా కలుపుకుని నాకు అనంతమైన మానసిక స్థైర్యాన్ని ఇచ్చారు. వారిలో కొంతమందినైనా ఈ సందర్భంగా గుర్తు తెచ్చుకోవడం నా బాధ్యత..

నేను జి.రామ్మోహన రావు గారి వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్నప్పుడు ఆయన వద్ద కో-డైరెక్టర్‌గా సత్తిబాబు గారు (పి.సత్యనారాయణ) అనే ఆయన ఉండేవారు. దర్శకత్వంలోని మెళకువలన్నీ ఆయనే నాకు నేర్పారు. చాలా చోట్ల కో-డైరెక్టర్లు అసిస్టెంట్ లని సరిగా ట్రీట్ చెయ్యరని ఒక అపవాదు ఉంది. కానీ సత్తిబాబు గారు నన్ను సొంతమనిషిలా చూసుకునే వారు. అప్పటికి నా వయసు 18 సంవత్సరాలే. ఉదయాన్నెప్పుడో లేచి రోజంతా షూటింగ్ చేసి పేకప్ చెప్పాక ఇంటికి కారులో వెళుతుంటే పూర్తిగా అలసిపోయేవాడిని. నిద్రవచ్చి తూలుతుంటే సత్తిబాబు గారు తన ఒళ్ళో పడుకో పెట్టుకునే వారు. ఎంతటి ఆత్మీయతా.. ఎంత అనురాగం.! ఆ వయసులో ఇంటినుంచీ దూరంగా ఒక్కడినే ఉంటుంటే సత్తిబాబు గారు చూపించిన  ప్రేమాను రాగాలు ఎప్పటికీ మరచిపోలేను.

అలానే 'రక్తకన్నీరు' సినిమా కి చేస్తున్నప్పుడే ఆదిత్య గారనే రచయిత ఒకాయన పరిచయమయ్యారు. ఈయన సముద్రాల గారి మేనల్లుడూ..పాత తరం రచయిత అప్పలాచార్య గారికి తమ్ముడూ. తరువాతి కాలంలో 'నవయుగం' (మీనా మొదటి సినిమా), 'ఈ ప్రశ్నకు బదులేది' 'యుగకర్తలు' అనే సినిమాలకి దర్శకత్వం చేశారు కూడా. స్క్రిప్ట్ వర్క్ లో మొదటి పాఠాలూ, మెళకువలూ అన్నీ ఆయనే చెప్పారు. ఈ రోజు నేను నేను స్క్రిప్టు రాసే విధానంలోనూ, డైలాగులు సమకూర్చుకునే పద్ధతిలోనే ఆదిత్య గారి ప్రభావమే నా మీద పూర్తిగా ఉంది. అలాంటి వ్యక్తులు చాలా అరుదుగా పరిచయమౌతుంటారు..

నేను ఎప్పటికీ మరచిపోలేని మరో వ్యక్తి చారి అనే కుర్రాడు. నేను 'వైఫ్' సినిమాకి కో-డైరెక్టర్ గా పనిచేసే రోజుల్లో నా వద్ద అసిస్టెంట్ గా చేసే వాడు. నాతో బాగా స్నేహం కల్సింది తనకి. ఎప్పుడూ నన్నే అంటిపెట్టుకుని ఉండేవాడు. తరువాత నేను అవకాశాలు లేక కష్టాలు పడుతున్నప్పుడు కూడా ఎప్పుడూ నన్ను వదల్లేదు. రేపు రెంట్ కట్టాలి డబ్బులెలా అని మధన పడుతుంటే తనే ఎక్కడికో వెళ్ళి అప్పుచేసి తెచ్చి ఇచ్చేవాడు. 'సర్..మీకు ఎప్పటికైనా మంచి రోజులొస్తాయి..అందుకోసమే నేనూ ఎదురు చూస్తున్నాను' అనేవాడు. నావద్ద సినిమాలేమీ లేవు కదా వేరే చోట ఎక్కడైనా చేసుకోమని



చెప్పినా నాన్ను వదిలి వెళ్ళేవాడు కాదు. నా కష్టాలకీ, బాధలకీ ప్రత్యక్ష సాక్షే కాదు..వాటిల్లో భాగస్వామి కూడా. నాకు 'అదిరిందయ్యా చంద్రం' అవకాశం వచ్చినప్పుడు మొదటిసారి సంతోషించిన వ్యక్తి చారీనే. ఆ సినిమా తరువాత 'టాటా బిర్లా మధ్యలో లైలా' మొదలయ్యే ముందు ఊళ్ళో ఏదో పని ఉందని వెళ్ళాడు. వెళ్ళిన వద్దనుంచీ కొన్ని రోజులు ఫోన్లో టచ్ లోనే ఉన్నాడు. ఒకసారి ఫోన్ చేసి వాళ్ళ నాన్నగారు పోయినట్లు చెప్పాడు.. ఆ తరువాత తన వద్ద నుంచీ సమాచారం ఆగిపోయింది. కొన్ని నెలల తరువాత తెలిసింది చారి ఆత్మహత్య చేసుకున్నాడని.. ఈ వార్తని ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నాను. నేను కష్టాల కడలిని ఈదుతున్నప్పుడు నాకు తోడునీడగా ఉన్నాడు..బంధువుకాదు.. చిన్ననాటి స్నేహితుడూ కాదు.. కేవలం సాటి మనిషిగా, నా మీద అచంచలమైన విశ్వాసంతో నాతో ఉన్న చారి ఈ లోకంనుంచీ నిష్క్రమించాడని విన్నప్పుడు నా మనసు మూగపోయింది. ఇప్పటికీ చారి గుర్తొస్తే మనసు అదోలా ఐపోతుంది. నేను మళ్ళీ పేరు తెచ్చుకోవాలనీ, నాకు మంచి రోజులు రావాలనీ నాకంటే తనే ఎక్కువ తపనపడే వాడు. నేను ఈ కష్టాలకి తల వంచుకోరాదని ప్రోత్సహిస్తూ, నన్ను వెన్నంటి ఉండే వాడు. దాదాపు నాలో ఒక భాగం గా బతికాడు. ఈరోజు నా విజయాన్ని తను చూడలేక పోతున్నాడనే బాధ నన్ను కలచివేస్తుంది. వాళ్ళ అమ్మగారు ఎక్కడున్నారో ఇటీవలే తెల్సింది. ఆమెకు సహాయం చేసి చారి స్థానం లో నేను ఉండాలనుకుంటున్నాను. కొన్ని బంధాలు జీవితంలో ఎందుకు ఎలా ఏర్పడతాయో, వాటి అర్ధమేమిటో నిర్వచించడం కూడా కష్టమే అలాంటిదే నాకూ చారికీ ఉన్న అనుబంధం..!

మీరు మొదటి సినిమా అనిఅడిగినా నా సినీ జీవితానికి నారు పోసినవాళ్ళూ, నీరు పోసిన వాళ్ళూ, గాలి వానలో ఆదుకున్న వాళ్ళూ.. వీళ్ళందరినీ కూడా ఈ సందర్భంలో గుర్తుచేసుకునే అవకాశాన్నిచ్చిన 'కౌముది' పాఠకులకి నా కృతజ్ఞుతలు.

**Featured in December 2007**

# బి.గోపాల్

*దర్శకుడిగా మారిన తరువాత తీసిన మొదటి ఆరు సినిమాలనీ వరుసగా శతదినోత్సవచిత్రాలుగా రూపొందించి (అందులో రెండు హిందీ చిత్రాలు కావడం గమనార్హం) నాటి బొబ్బిలిరాజా నుంచీ మొన్నటి ఇంద్ర, అల్లరిరాముడు, నిన్నటి నరసింహనాయుడు వరకూ అనేక బ్లాక్ బస్టర్ సినిమాలనందించిన ప్రముఖ దర్శకుడు బి.గోపాల్ గారి మొదటి సినిమా విశేషాలు ఈ సంచికలో...*



మాది ఒంగోలు జిల్లాలోని ఎమ్. నిడమానూరు. నాన్నగారి పేరు వెంకటేశ్వర్లు, అమ్మగారి పేరు మహాలక్ష్మమ్మ. నేను 1952 జులై 24 న పుట్టాను. వ్యవసాయాధారిత మధ్యతరగతి కుటుంబం మాది. నా ఎలిమెంటరీ చదువంతా మా వూళ్ళో జరిగింది. హైస్కూలుకి మాత్రం మాకు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న కారుమంచి అనే వూరికి వెళ్ళేవాళ్ళం. రోజూ నడిచి వెళ్ళడం, నడిచి రావడమే. అక్కడ హైస్కూలులో ఎస్సెల్సీ పూర్తయాక పి.యు.సికి ఒంగోలు లోని శర్మ కాలేజీలో చేరాను.

చిన్నప్పటి నుంచీ నాటకాలు చూడడమంటే చాలా ఇంట్రెస్టు ఉండేది. నటించడం కూడా చేశాను కానీ, నటనకంటే ప్రేక్షకుడిగా విమర్శనాత్మకంగా నాటకాలు చూడడం ఎక్కువగా చేసేవాడిని. శర్మ కాలేజీలో ఉండగానే అంతర్ కళాశాలల నాటకాలపోటీలకి మిత్రులతో కలిసి గుంటూరు హిందూ కాలేజీకి వెళ్ళి ఒక నాటకం కూడా వేశాము. అందులో నాపాత్రకి చిన్న బహుమతి కూడా వచ్చినట్లు జ్ఞాపకం. ఒంగోలులోనే పియు.సి తరువాత బి.ఎ. లో చేరాను. బి.ఎ రెండో సంవత్సరంలో అనుకుంటాను ప్రత్యేక ఆంధ్రా ఉద్యమం మొదలైంది. కాలేజీకి శెలవలు..చదువులు కుంటుబడ్డాయి..సమ్మె ఎప్పుడు ముగుస్తుందో తెలీదు. ఆ సమయంలో ఎందుకో హఠాత్తుగా అనిపించిందొక రోజు 'మద్రాసు వెళ్ళి ఏదైనా ఉద్యోగం చేసుకుంటే బావుటుంది' అని.'ఐతే ఇంకా చదువుపూర్తికాలేదు కాబట్టి గవర్నమెంటు ఉద్యోగమేం రాదు. మద్రాసు అనగానే గుర్తొచ్చేది సినిమా ఫీల్డ్ కాబట్టి..సినిమాల్లోనే ఏదైనా ఉద్యోగం చూసుకుంటే ఎలా వుంటుంది..' అని

అనిపించింది. ఇదంతా ఒంగోలులో ఉండగానే. ఇంటికి వెళ్ళి నాన్నని అడిగితే ఏమంటారో..పంపిస్తారో లేదో..ఐనా చెప్పకుండా చెయ్యడం ఎందుకు అనిపించి ఇంటికి వెళ్ళి నాన్నకి నా ఆలోచన వివరించాను. ఆయన పెద్దగా చర్చించకుండానే నా నిర్ణయాన్ని ఆమోదించి మద్రాసు పంపించడానికి ఒప్పుకున్నారు. మద్రాసులో న్యూటోన్ మూవీస్ అనే స్టూడియో యజమాని వెంకోబారావు గారు అనే ఆయన అప్పుడే 'జీవితాలు' అనే సినిమా తీసి ఉన్నారు. దానికి మా వూరిలోని కోటయ్య గారు అనే ఆయన కొంత పెట్టుబడి పెట్టారు. కోటయ్య గారి వద్దనుంచీ రికమండేషన్ లెటర్ తీసుకుని నాన్నగారే స్వయంగా మద్రాసు వచ్చి వెంకోబా రావు గారికి నన్ను అప్పగించారు. ఆయన మమ్మల్ని బాగా రిసీవ్ చేసుకున్నారు.

కేవలం ఉద్యోగం అన్న ఆలోచనతోనే వచ్చానని తెలుసుకుని అప్పటి ప్రముఖ దర్శకుడు పి.సి.రెడ్డి గారి వద్ద



అప్రెంటిస్‌గా జాయిన్ చేశారు. ఆయన వద్ద నేను పనిచేసిన మొదటి సినిమా 'పెద్దలు మారాలి' కృష్ణగారు, జమునగారు హీరో, హీరోయిన్లు.. ఒకనాటి దేవదాసు చిత్రనిర్మాత డి.ఎల్.నారాయణ గారు నిర్మాత. ఆ విధంగా నా చలనచిత్ర జీవితం 1973 సంవత్సరంలో 'పెద్దలు మారాలి' తో మొదలైంది. ఆ తరువాత రెండో సినిమా కూడా పి.సి.రెడ్డి గారి వద్దనే చేశాను. తరువాత రాఘవేంద్రరావు గారి పరిచయంతో నా సినీ జీవితం పెద్దమలుపు తిరిగింది. అదృష్టవశాత్తూ నేను ప్రయత్నించిన వెంటనే ఆయన వద్ద ఖాళీ ఉండడమూ, ఆయన వెంటనే ఒప్పుకోవడమూ 'అడవిరాముడు' నుంచీ ఆయన వద్ద చేరడమూ జరిగాయి. అంతే దాదాపు 10 సంవత్సరాలపాటు రాఘవేంద్రరావు గారి వద్దనే పలు హోదాల్లో దర్శకత్వ శాఖలో పనిచేశాను. 'అడవిరాముడు', 'జస్టిస్ చౌదరి' , 'కొండవీటి సింహం', 'సత్యభామ', 'దేవత', 'తోఫా' , 'అగ్ని పర్వతం' వగైరా రాఘవేంద్రరావు గారి అన్ని సినిమాలకీ నేను పనిచేశాను.



ముందే చెప్పినట్లు నాకెప్పుడూ సొంతంగా దర్శకత్వం చేయాలని ఉండేది కాదు. ఏదో ఉద్యోగంలా చేసుకుంటూ వెళ్ళడమే. అలా రోజులు గడుస్తుండగా 'దేవత' షూటింగ్ జరిగేప్పుడు రామానాయుడు గారు పరిచయమయ్యారు. అదే మొదటి పరిచయం ఆయనతో. నా పనితీరుని గమనించిన ఆయన నాకు దర్శకత్వం ఛాన్సుని ఆఫర్ చేశారు. ఐతే ఆ విషయాన్ని నాకంటే ముందుగా రాఘవేంద్రరావు గారికే చెప్పారు. ఒక రోజు రాఘవేంద్రరావు గారే సంతోషంగా పిలిచి 'గోపాల్

అదృష్టవంతుడివయ్యా..రామానాయుడు గారే ఆయనంతటాయనే స్వయంగా నీకు దర్శకత్వం అవకాశం ఇస్తున్నారు' అని ఆనందంగా చెప్పారు. రామానాయుడు గారిని వెంటనే కలిసి కృతజ్ఞతలు చెప్పుకున్నాను. కథ తయారు చేసుకోమని చెప్పారు. కథల వేటలో ఉండగానే దేవత హిందీ వెర్షన్ 'తోఫా' మొదలైంది. కథ ఫైనలైజ్ కాలేదు కాబట్టి దానిక్కూడా పనిచెయ్యమన్నారు. ఆ విధంగా సినిమా ఆఫర్ చేతిలో ఉన్నా 'తోఫా' కి కో-డైరెక్టర్ గా పనిచేశాను. నాకంటే రామానాయుడు గారే సినిమా కథకోసం ఎక్కువగా శ్రమపడ్డారు. రకరకాల సబ్జెక్టులు వినేవారు. కొన్ని కొన్ని నాతో డిస్కస్ చేసేవారు. ఈలోగా రాఘవేంద్రరావు గారి' అగ్ని పర్వతం' మొదలైంది. దానికి కూడా పనిచేశాను. అప్పుడు రామానాయుడు గారు పిలిచి చెప్పారు'గోపాల్ ..ఇలా సినిమాలు చేస్తుంటే నీకు ఖాళీ దొరకదు..వేరే సినిమాలు మానేసి పూర్తి సమయాన్ని కథల వేటకి కేటాయించు' అని చెప్పారు. ఆయన మాట ప్రకారం ఇంక వేరే సినిమాలేమీ చెయ్యకుండ కథలకోసమే సమయం వెచ్చించడం మొదలు పెట్టాను, రామానాయుడు గారితో కలిసి. ఒకరోజు ఆయనే ఫోన్ చేశారు, మంచి కథ దొరికింది 'రా..గోపాల్..' అంటు. అలా రామానాయుడు గారి అన్వేషణ ఫలించి దొరికిన కథే 'ప్రతిధ్వని' 1985 అక్టోబర్ లో మద్రాసు ఎ.వి.ఎమ్ స్టూడియోలో షూటింగ్ మొదలైంది. అర్జున్ గారు, రజని హీరో హీరోయిన్లు..ఇంకా శారద గారు, గుమ్మడి గారు, గొల్లపూడి మారుతీ రావు గారు.. వగైరా ఇతర తారాగణం.. సినిమా 1986 మార్చి ప్రాంతాల్లో అనుకుంటా విడుదలైంది.



రామానాయుడు గారికి తన సినిమాని విజయవాడలో చూడడం సెంటిమెంట్. అలా ఆయన మొదటి రోజు 'ప్రతిధ్వని' కి వెళుతూ నన్ను రమ్మన్నారు విజయవాడకి.

'సార్..నాకు భయమేస్తోంది.. మీరు వెళ్ళండి. మీరు మొదటి ఆట చూసి చెప్పండి..అప్పుడు నేను వస్తాను' అన్నాను.



సినిమా మోర్నింగ్ షో మొదలైంది.. నాకు విపరీతమైన టెన్షన్ గా వుంది. సినిమా అవగానే రామానాయుడుగారూ., నవ భారత్ ప్రభాస్ గారు ఫోన్ చేసి నాకు కంగ్రాచ్యులేషన్స్ చెప్పారు. ప్రేక్షకులు బాగా రిసీవ్ చేసుకుంటున్నారనీ, ఖచ్చితంగా వందరోజుల సినిమా అనీ. అప్పటికి నా టెన్షన్ తగ్గింది. రామానాయుడు గారే ఇంటికి కారు పంపించారు. ఆ కారులో నెల్లూరు నుంచీ మొదలుపెట్టి కోస్తా జిల్లాల ప్రధాన థియేటర్లన్నింటినీ చూసుకుంటూ నా మొదటి సినిమా ప్రతిధ్వని సక్సెస్ ని ప్రత్యక్షంగా అనుభవించాను.

ఆ సినిమా వందరోజుల పండుగ విజయవాడలోనే జరిగింది. ఆ ఫంక్షన్

కి అమ్మా, నాన్నా, మా బంధువులంతా వచ్చారు. వేదిక మీద అందరూ 'ఈ కొత్త దర్శకుడికి మంచి భవిష్యత్తు ఉంది..' అంటూ నా టాలెంట్‌ని పొగుడుతుంటే ప్రత్యక్షంగా చూసిన అమ్మ, నాన్నల ఆనందానికి అవధులు లేవు. ఏదో ఉద్యోగానికని సినిమా ఫీల్డ్‌లోకి వెళ్ళి మొదటి సినిమానే వందరోజుల సినిమాగా రూపొందించిన నన్ను వాళ్ళు మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

తరువాత అదే సినిమాని హిందీలో 'ఇన్సాఫ్ కి వాజ్' పేరుతో అనిల్ కపూర్, రేఖలతో రీమేక్ చేశాము. అదీ వందరోజులు ఆడింది. మూడో సినిమా కలెక్టర్ గారి అబ్బాయి. నాగేశ్వరరావు గారు, నాగార్జున కాంబినేషన్ లో మొదటి సినిమా. అప్పట్లో మార్కెట్ బావుండలేదు. రిలీజ్ ఐన ఏ సినిమా ఐనా ఫెయిలౌతోంది. అలాంటి సమయంలో కూడ అది వందరోజులు ఆడింది. వెంటనే దాన్నీ హిందీలో తీసి వందరోజులు సినిమాగా చేశాను . మళ్ళీ తెలుగులో వరుసగా రక్తతిలకం, అశ్వత్థామ శతదినోత్సవ సినిమాలయ్యాయి. ఈ విధంగా నేను మొదలు పెట్టినవద్దనుంచీ దర్శకత్వం సినిమాలు వరుసగా వందరోజుల సినిమాలే అయ్యాయి.. తరువాత బొబ్బిలి రాజా, పోలీస్ ఇన్స్పెక్టర్..ఇంద్ర, అల్లరి రాముడు.. వగైరా సినిమాలు క్రియేట్ చేసిన సెన్సేషన్ మీకు తెలిసిందే.

**Featured in January 2008**

# బోయపాటి శీను


మొదటి సినిమా 'భద్ర' తోనే సూపర్ హిట్ దర్శకుడిగా పేరుతెచ్చుకుని, రెండో సినిమా 'తులసి' ని కూడా విజయవంతమైన చిత్రంగా రూపొందించిన నవ, యువ దర్శకుడు శ్రీ బోయపాటి శీను మొదటి సినిమా జ్ఞాపకాలు ఈ నెల మీ కోసం..



మా స్వగ్రామం గుంటూరుకి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదకాకాని. ఈ ఊరు సిటీకీ, పల్లెటూరికీ మధ్య రకంగా ఉంటుంది. గుంటూరు నుంచీ వచ్చే మెయిన్ రోడ్, హైవే 7 పరంగా చూస్తే టౌన్ అనిపిస్తుంది. కాస్త లోపలికి వెళితే అన్నీ పచ్చటిపొలాలూ, కృష్ణానది నుంచీ వచ్చే ఒక నదీ పాయ.. ఎటుచూసినా పక్కా పల్లెటూరి వాతావరణం కనిపిస్తుంది. ఇంత అందమైన ఊళ్ళో నేను 1971, ఏప్రిల్ 25న పుట్టాను. నాన్న గారి పేరు లింగయ్య, అమ్మ పేరు సీతారావమ్మ. నాన్న వాళ్ళు నలుగురు అన్నదమ్ములు. ఒక్కొక్కరికీ ఐదుగురు సంతానం. మా కుటుంబంలో నేను మధ్య వాడిని. నా పైన అక్కయ్య, అన్నయ్య, నాకు ఇద్దరు చెల్లెళ్ళు. నాన్న వ్యవసాయమే చేస్తుండేవాళ్ళు. అన్నయ్య మాత్రం ఫోటో స్టూడియో నడుపుతుండేవాళ్ళు.

ఎలిమెంటరీ స్కూలు నుంచీ హైస్కూలు వరకూ నా చదువంతా పెదకాకానిలోనే జరిగింది. చిన్నప్పుడు తోటి పిల్లలతో కలిసి బాగా అల్లరి చేస్తుండేవాడిని. మా అల్లరి గాంగ్ అంటే ఊళ్ళో అందరికీ హడల్‌గా ఉంటుండేది. హైస్కూలు అయ్యాక గుంటూరు జె.కె.సి కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేరాను. అక్కడే డిగ్రీ వరకూ చదువుకున్నాను. కాలేజీ దగ్గరలోనే శ్రీనివాస నగర్‌లో ఒక రూముకి అద్దెకి తీసుకున్నా , ఎక్కువగా ఇంటివద్దనుంచే కాలేజీకి వెళ్తుండేవాడిని. ఎప్పుడన్నా మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోడానికో, సాయంకాలం ఆలస్యమైతే పడుకోడానికో మాత్రమే అద్దె రూము వాడుకునే వాడిని. చిన్నప్పటినుంచీ చదువులో పెద్ద చురుకైన వాడినేమీ కాదు. ఎలానో హై సెకండ్ క్లాసు, ఫస్టుక్లాసు బోర్డర్ లో లాగిస్తూ ఉండేవాడిని. డిగ్రీకి రాగానే అన్నయ్య (బ్రహ్మానందరావు) ఫోటో స్టూడియోలో

ఎక్కువకాలం గడిపుతూ అన్నయ్యకి చేదోడు వాదోడుగా ఉండేవాడిని. అప్పుడే 'ఈనాడు' స్టాఫ్ రిపోర్టర్‌గా కూడా పనిచేసే వాడిని. డిగ్రీ తరువాత నాగార్జునా యూనివర్సిటీలో ఎమ్మే హిస్టరీ కూడా పూర్తి చేశాను. ఒక వైపు స్టూడియో, మరో వైపు 'ఈనాడు'కి వార్తలు పంపడమూ, ఇంకోవైపు కాలేజీ చదువూ.. ఎప్పుడూ బిజీగానే ఉండేవాడిని. మీరు నమ్మి తీరాల్సిన ఒక విషయం, ఆ రోజుల్లో సినిమాలంటే అస్సలు ఆసక్తి ఉండేది కాదు. ముఖ్యంగా సినిమా చూసేంత తీరిక సమయం ఉండేది కాదు. పుస్తకాలు మాత్రం బాగా చదివేవాడిని. న్యూస్ పేపర్లయితే ఒక్క కాలం వదలకుండా ఆసాంతం పఠించేవాడిని. సినిమాలకీ నాకూ మాత్రం చుక్కెదురే..!



పోస్ట్‌గ్రాడ్యుయేషన్ అవగానే 1994లో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్.ఐ. పోస్టుకి వ్రాత పరీక్ష, మిగతా టెస్టులూ అన్నీ పూర్తయి ఫైనల్ సెలక్షన్ కూడా వచ్చింది. కానీ కారణాంతరాల వల్ల అందులో చేరలేక పోయాను. ఇలా సమయం బిజీగా గడుస్తున్నప్పుడే మా వూరి వాడు, మా కజిన్, అప్పటికే సినిమాల్లో పేరు తెచ్చుకున్న పోసాని కృష్ణమురళి హైదరాబాదు నుంచీ మా వూరు వచ్చినప్పుడు మా ఇంటికి వచ్చాడు. మాటల మధ్యలో, కావాలంటే సినిమా రంగంలో ఏదైనా అవకాశం కల్పిస్తాను, తనతో హైదరాబాదు రమ్మని చెప్పాడు. మా ఇంట్లో ఏ విషయమైనా అన్నయ్య సలహా తీసుకోవాల్సిందే అందరం కలిసి అన్నయ్యతో సంప్రదించాం. 'ఎలానూ అందరం ఎప్పుడూ సొంత ఊర్లోనే ఉండి వ్యసాయమో, వ్యాపారమో చేసుకుంటున్నాం. ఒక సారి లైను మార్చి వేరే ఊరు, వేరే ఫీల్డూ ప్రయత్నిస్తే నష్టమేముందీ.. ఒకవేళ అక్కడేమన్నా ఇబ్బంది ఎదిరైనా ఇంటికి వచ్చేస్తే వ్యవసాయమూ, బిజినెస్సూ ఉండనే ఉన్నాయి' - అని అలోచించి నన్ను, కృష్ణ మురళి సలహా మీద, హైదరాబాదు పంపించడానికే నిర్ణయించుకున్నారు., నేను సరే అన్నాను. అన్నయ్యే స్వయంగా వచ్చి హైదరాబాదులో దించి వెళ్ళారు 1997లో. కృష్ణ మురళి నన్ను ముత్యాల సుబ్బయ్య గారి వద్ద అసిస్టెంట్ గా కుదిర్చారు.

అక్కడినుంచీ కొత్త ప్రపంచంలో, కొత్త జీవితం మొదలైంది. నేను చేరే సరికి సుబ్బయ్యగారి సినిమా 'పవిత్రబంధం' చివరిలో ఉంది. తరువాత వరుసగా ఆయన వద్దనే 'పెళ్ళిచేసుకుందాం', 'అన్నయ్య', 'గోకులంలో సీత', 'స్నేహితులు' ..ఇలా వరుసగా దాదాపు ఆరేళ్ళు 11 సినిమాలకి పనిచేశాను. మధ్యమధ్యలో సుబ్బయ్య గారికి ఖాళీ వచ్చి వేరే ఎక్కడైనా పనిచెయ్యమని చెప్పినా ఆయన్ని వదిలి ఎక్కడికీ వెళ్ళలేదు. ఇంక ఈ ఫీల్డ్‌కి వచ్చాక తిండీ, నిద్రా, గాలీ, ఊపిరీ అన్నీ సినిమాలే అయ్యాయి. హైదరాబాదులో మిత్రులతో కలిసి రూములో ఉంటూ షూటింగ్‌లకి వెళ్ళడం, షూటింగ్ లేనప్పుడు కేసెట్లు చూడ్డం..వందలాది అనేకంటే అతిశయోక్తి కాదనుకుంటే వేలాది సినిమాలు చూసేశాను ఆరేళ్ళలో.

2003 ప్రాంతాల్లో ఇంక సొంతంగా దర్శకత్వ ప్రయత్నాలు మొదలు పెట్టాలనుకుని కథలు సిద్ధం చేసుకోవడం ప్రారంభించాను. ఒక కథ ఫైనలైజ్ చేసుకుని ఒక మాస్ హీరోగారికి వినిపించాను. వెంటనే ఒప్పుకున్నారు కానీ ఎన్ని నెలలు గడిచినా ప్రోజెక్ట్ ఫైనలైజ్ కావడం లేదు. అలా దాదాపు సంవత్సరం గడిచిపోయింది. ఆ సమయంలోనే

'అన్నయ్య', 'గోకులంలో సీత' సినిమాల నుంచీ బాగా పరిచయం ఉన్న అల్లు అరవింద్ గారిని కలిసాను. అప్పుడే 'గంగోత్రి' విజయ పథంలో నడుస్తోంది.

'సార్ ..నావద్ద ఒక మంచి కథ ఉంది. కానీ మీరేమో కొత్త వాళ్ళని ప్రోత్సహించడం లేదు' అన్నాను.

చనువుగా మందలిస్తూ "శీనూ..నావద్ద నీకు మొహమాటమెందుకయ్యా. ఎప్పుడైనా వచ్చి అడగొచ్చు కదా.. ఏదీ కథ చెప్పు.." అన్నారు.

బన్నీ, అరవింద్ గారు, కుటుంబసభ్యులు అందరూ కూర్చుని కథ విన్నారు. అందరికీ విపరీతంగా నచ్చేసింది. కానీ అర్జున్ ఇంకా అప్పుడే సినీరంగ ప్రవేశం చేసి ఉన్నాడు. ' మొదట్లోనే ఇంత హెవీ కథని తీసుకుంటే మళ్ళీ తరువాత లవర్ బాయ్ పాత్రల్లో ప్రేక్షకులు చూడలేరు. ఎవరైనా పేరున్న మాస్ హీరో ఐతేనే ఈ కథకి న్యాయం జరుగుతుంది. ..నీ కథలో మంచి పవర్ ఉంది. తప్పని సరిగా ఇది సూపర్ హిట్ సినిమా ఔతుంది. నువ్వు మంచి దర్శకుడిగా నిలదొక్కుకుంటావు.. పద నిన్ను దిల్‌రాజు గారికి పరిచయం చేస్తాను ..'అని అల్లు అరవింద్ గారే నన్ను వెంటబెట్టుకుని దిల్ రాజు గారి వద్దకి తీసుకెళ్ళారు. బన్నీ కూడా మాతో వచ్చారు.

ఆయన ఆర్య షూటింగ్ లో ఉన్నారప్పుడు. ఆయన గురించి వినడమే కానీ చూడ్డం అదే మొదటి సారి. మొదటి సిటింగ్ లోనే రెండున్నర గంటలపాటు కథ వినిపించాను. కథ వినడం పూర్తవగానే వెంటనే జేబులోంచి చెక్ బుక్ తీసి చెక్కు రాసిచ్చి 'తరువాత సినిమా ఇదే, నువ్వే దర్శకుడివి' అన్నారు దిల్ రాజు గారు..! వరుసగా రెండు హిట్ల తరువాత ఆయనకిది మూడో సినిమా కాబోతోంది. అలా మొదలైంది నా మొదటి సినిమా భద్ర..!

కథకి తగిన హీరో ఎవరా అని వెదికితే రెండు మూడు ఆప్షన్స్ వచ్చాయి కానీ వాళ్ళెవరికీ డేట్స్ ఖాళీలు లేవు. రాజు గారే రవితేజ పేరు సజెస్ట్ చేశారు. ఐతే రవితేజ అప్పటికి సీరియస్ పాత్రలు చేస్తున్నా కాస్త లైటర్ వెయిన్‌లో హాస్యం కూడా ఉంటోంది ఆయన పాత్రల్లో. రవితేజ గారిని కలిసి కథ వినిపించి ఆయన ట్రెండ్‌కి తగినట్లుగా కాస్త హ్యూమర్ జతచేసి 'భద్ర' ఫైనలైజ్ చేశాము.. ఎన్నాళ్ళనుంచీ నా రూమ్‌మేట్స్‌గా వుంటున్న నివాస్, రవి, సాయి నాకు రచయితలుగా సహకారమందించారు.




2004 నవంబర్ 17న షూటింగ్ మొదలైంది. సెంటిమెంటల్‌గా మొదటి షాట్‌ని వనదేవత పార్కులో చిత్రీకరించి, తరువాత రెగ్యులర్ షూటింగ్‌ని అన్నపూర్ణలో కొనసాగించాము. మొత్తం సినిమాలో 6 హెవీ సీన్లు ఉన్నాయి. ప్రారంభించిన మొదటి వారమే ఆరు హెవీ సీన్స్‌నీ పిక్చరైజ్ చేశాను. ఆరో రోజు షూటింగ్‌కి పాకప్ చెప్పాక ఎడిటింగ్ రూముకి వెళ్ళాను. ఎవరినీ లోపలికి రావొద్దని చెప్పాను. మొత్తం సీన్లన్నీ ఎడిట్ చేసాక, నిర్మాతగారినీ, హీరో గారినీ పిల్చి రషెస్ చూపించాను.. అందరికీ బాగా నచ్చింది. రవితేజ గారైతే 'ఇంక సినిమా పూర్తయే వరకూ మోనిటర్

లో చూడల్సిన అవసరంలేదు..'అని డిక్లేర్ చేశారు. ఏది కావాలంటే అది క్షణాల్లో సమకూర్చే దిల్‌రాజు గారు నిర్మాతగా నా మొదటి సినిమా భద్ర 120 రోజుల్లో షూటింగ్ పూర్తయింది. 2005 మే 12న రిలీజైంది. సినిమా పబ్లిక్ రిలీజ్‌కి ముందు రోజు రాత్రి ఇండస్ట్రీలో పెద్దవారందరినీ పిలిచి ప్రి-వ్యూ షో వేశారు. ప్రివ్యూ ఐ బయటికి రాగానే ముందుగా అల్లు అరవింద్‌గారు శుభాకాంక్షలు చెప్పారు. రెండో ఫోన్ ఎమ్మెస్ రాజు గారి వద్దనుంచీ. రిలీజయ్యాక ఫీలింగ్స్ అంటే ఏమి చెప్పమంటారు..గాల్లో తేలుతున్న అనుభవం..!

'భద్ర' విజయాన్ని మా కుటుంబసభ్యులు కూడా బాగా ఎంజాయ్ చేశారు. అందులో పాత్రలూ , చాలా సంఘటనలూ..వాళ్ళకి ఎప్పటినుంచో తెలిసినవే.. ఎందుకంటే అవన్నీ మా వూరు, నాకు తెలిసిన మనుషుల మధ్యనుంచీ వచ్చినవే కాబట్టి..!

నా మొదటి సినిమాని ఆదరించిన ప్రేక్షకులు రెండో సినిమా 'తులసి'ని కూడా విజయవంతం చేశారు. నాకు వరుస విజయాలు అందించిన తెలుగు ప్రేక్షకులకీ, ప్రవాసాంధ్రులకీ నేను ఎంతైనా ఋణపడి ఉంటాను. 'కౌముది' ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి పరిచయం కావడం నాకు చాలా సంతోషంగా ఉంది.

***

**Featured in March 2008**